చదువు
రూ॥ 180/-
పేజీలు: 210

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


దోహా డైమండ్ లీగ్‌లో చరిత్ర సృష్టించిన నీరజ్ చోప్రా
లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 326 | శనివారం | 17-05-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

# వానాకాలం పనులకు సన్నద్ధమవ్వాలి



- మార్కెట్‌లో డిమాండ్ ఉన్న అన్ని కంపెనీల విత్తనాలు అందుబాటులో ఉన్నాయ్
- ఎరువులూ, విత్తనాలపై ఆందోళనొద్దు
- రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలి
- నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో ఎవరినీ ఉపేక్షించొద్దు
- చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి
- దందాను అరికట్టేందుకు కలెక్టర్లు, పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం / హైదరాబాద్

వానకాలం పంటలకు సన్నద్ధమవ్వాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని జిల్లాల్లో సాగు విస్తీర్ణానికి సరిపడే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని సిఎం అధికారులను ఆదేశించారు. కల్తీ, నకిలీ విత్తనాల దందాను అరికట్టేందుకు అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ, పోలీస్ విభాగం సంయుక్తంగా టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహించాలని, రాష్ట్ర సరిహద్దులు అన్ని చోట్ల టాస్క్‌ఫోర్స్ నిఘా ఉంచాలని చెప్పారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపితో పాటు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వానకాలం పంటలకు సన్నద్ధమవ్వాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలకు సంబంధించి అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విషయంలో రైతులను మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను సిఎం హెచ్చరించారు. ఎవరెవరు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నారు, ఎక్కడ నిల్వలున్నాయో, ఎక్కడ నుంచి రవాణా అవుతున్నాయనే వివరాలన్నీ అధికారులకు సమాచారం ఉందని, ఎవరినీ ఉపేక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. నకిలీ దందా చేసే వ్యాపారులపై పిడి యాక్ట్ కేసులు పెట్టాలన్నారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు

తరువాయి 2లో

# పాక్ ఉగ్రవాదంపై ప్రపంచవ్యాప్త ప్రచారం

- పలు దేశాలకు అఖిలపక్ష ప్రతినిధి బృందాలను పంపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం
- ఒక్కో ప్రతినిధి బృందం పదిరోజులపాటు ప్రచారం
- ఈనెల 22 నుంచి ప్రయాణాలకు సిద్ధంగా ఉండాలని ఎంపిలకు సూచాయిగా సమాచారం


ఫైల్

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్న పాకిస్థాన్ బండారాన్ని ప్రపంచవ్యాప్తంగా వివిధ వేదికల ద్వారా ప్రచారం చేసేందుకు ప్రధానమైన దౌత్య దాడిని భారత్ ప్రారంభిస్తోంది. ఇందులోభాగంగా అనేక దేశాలకు అఖిలపక్ష ప్రతినిధి బృందాలను పంపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చేవారం నుండి ఈ అఖిలపక్ష ప్రతినిధి బృందాలు వివిధ దేశాలకు వెళతాయి. వీరిలో ప్రతిపక్షాలు కూడా ప్రధానభాగస్వామ్యం వహిస్తాయి. బిజెపి, కాంగ్రెస్, టిఎంసి, డిఎంకె, ఎన్‌సిపి (ఎస్‌పి), జెడియు, బిజెడి, సిపిఐ(ఎం)లతోపాటు ఇతర పార్టీలకు చెందిన ఎంపిలకు కూడా ఈ బృందాలలో సభ్యులుగా ఎంపిక చేస్తారు. వివిధ రాజకీయపార్టీలకు చెందిన సీనియర్ ఎంపిలు, ప్రతిపక్ష ఎంపిలు ఈ ప్రతినిధి బృందాలలో సభ్యులుగా వివిధ దేశాలకు వెళతారు. ఒకొక్క ప్రతినిధిబృందం వివిధ దేశాల్లో దాదాపు పదిరోజులపాటు ప్రచారం చేసి వస్తుంది. ఎంపిలు ఈనెల 22, 23 తేదీల నాటికి ప్రయాణాలకు సిద్ధంగా ఉండాలని సూచాయిగా సమాచారం తెలియజేసినట్లు ఒక పార్టీనాయకుడి భోగట్టా. పర్యటనలో ఉన్న సమయంలో ఈ బృందాలలో ఉండే ఎంపిలకు తాజా సమాచారం తెలియజేయడానికి

తరువాయి 2లో



# స్తంభాలు కనిపించొద్దు

- భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలి
- ఫ్యూచర్ సిటీలో టవర్లు, పోల్స్, ఏవీ బహిరంగంగా ఉండొద్దు
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలి
- విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ చేసుకోవాలి

ప్రజాపక్షం / హైదరాబాద్

గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో భవిష్యత్తు అంచనాలు, అవసరాలకు తగినట్లుగా విద్యుత్తు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ నివాసంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో కలిసి ఇంధన శాఖ ఉన్నతాధికారులతో పరిస్థితిని సమీక్షించారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలన్నారు. విద్యుత్ లైన్ల ఆధునీకరణపై దృష్టి సారించాలని, ఫ్యూచర్ సిటీలో టవర్లు, పోల్స్, లైన్స్ ఏవీ బహిరంగంగా కనిపించకుండా పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్, కెబిఆర్ పార్క్ వంటి ప్రాంతాల్లో ముందుగా ప్రయత్నించాలని చెప్పారు. 160 కిలోమీటర్ల అవుటర్ రింగ్ రోడ్

తరువాయి 2లో

# హరీశ్‌రావుతో కెటిఆర్ భేటీ

- రాజకీయ వర్గాల్లో చర్చ
- భేటీ కొత్తేమీ కాదన్న పార్టీ ముఖ్యులు
- తాజా రాజకీయ పరిణామాలు, బిఆర్‌ఎస్ అంతర్గత వ్యవహారంపై చర్చ జరిగి ఉండొచ్చని పలువురి అభిప్రాయం

ప్రజాపక్షం/హైదరాబాద్



బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుతో ఆ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటి.రామారావు భేటీ రాజకీయ వర్గాల్లో చర్చనీయంశంగా మారింది. గులాబీలో హరీశ్‌రావును, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితను పక్కన పెట్టారని, వారి అనుచరులకు పార్టీలో ప్రాధాన్యతను తగ్గించారనే చర్చ జరుగుతోంది. బిఆర్‌ఎస్‌లో రాజకీయ సంక్షోభం తప్పదనే ఉహాగానాలు, చర్చలు జరుగుతున్న క్రమంలో హరీశ్‌రావుతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కెటిఆర్ శుక్రవారం సమావేశం కావడం ప్రాధాన్యత

తరువాయి 2లో

పెదవి విరుపుల మధ్య తొలిసారి

## ఉక్రేన్ – రష్యా చర్చలు ప్రారంభం



వీలైనంత త్వరలో పుతిన్‌ను కలుస్తా : ట్రంప్ 02

# తడిసిన ధాన్యమూ కొంటాం

- పంటలు, పండ్లతోటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం
- రైతుల అభీష్టానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





ప్రజాపక్షం/హైదరాబాద్

యాసంగి సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని, తడిసిన ధాన్యం సహా, చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. పంటలు, పండ్ల తోటలు పూర్తిగా దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారం అందిస్తామన్నారు. హైదరాబాద్ సచివాలయం నుండి శుక్రవారం ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై కలెక్టర్‌లతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల అభీష్టానికి అనుగుణంగా

తరువాయి 2లో

# చట్ట ప్రకారం నడుచుకోవాలి

- శాంతి చర్చలు–మేధో స్పందనపై రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్
- అందరినీ చంపుకుంటూ పోతే ప్రజాస్వామ్యం అనిపించుకోదు : కోదండరామ్
- మానవ హననాన్ని ఆపాలి : జస్టిస్ చంద్రకుమార్
- అమిత్‌షా, బండిసంజయ్ పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు : బోస్

## మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి




ప్రజాపక్షం/హైదరాబాద్

శాంతి చర్చల ప్రతిపాదనను మవోయిస్టులు ముందుకు తీసుకొచ్చినందున రాజ్యాంగం, చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాని పలువురు వక్తలు అన్నారు. మవోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్‌లో శుక్రవారం వర్సిటీ పరిశోధక విద్యార్థులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'శాంతి చర్చలు మేధో స్పందన' అనే అంశంపై రౌండ్ టెబుల్ సమావేశంం నిర్వహించారు. సిపిఐ (మావోయిస్టు) పార్టీ శాంతి చర్చల కోసం అనేక ప్రకటనలు విడుదల చేసినా కేంద్ర ప్రభుత్వం చర్చలను వ్యతిరేకిస్తున్న సందర్భంలో సమాజంలో మేధావులు ఏ పాత్ర వహించాలో, మేధావులు, విద్యార్థి సంఘాలు చర్చించారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను సమావేశంలో తెలిపారు. రీసెర్చ్ స్కాలర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆజాద్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఎంఎల్‌సి, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, శాంతి చర్చల అధ్యక్షులు జస్టిస్ చంద్ర కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్.బోస్, ప్రొఫెసర్ హరగోపాల్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం,

తరువాయి 2లో

# 'రక్షణ'కు అదనంగా రూ.50 వేల కోట్లు!

డిఫెన్స్ రంగానికి రూ.7 లక్షల కోట్లు దాటనున్న బడ్జెట్ కేటాయింపులు



**న్యూఢిల్లీ :** భారత్–పాక్ ఉద్రిక్తతల వేళ రక్షణరంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఆ రంగానికి రూ.50,000 కోట్ల మేర బడ్జెట్‌లో అదనపు కేటాయింపులు చేపట్టవచ్చని వర్గాలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా సన్నాహాలు చేస్తుందని వెల్లడించాయి. ఈ ఏడాది రక్షణశాఖ కేటాయింపులు రూ.6.81 లక్షల కోట్లుగా ఉన్నాయి. తాజాగా పెంపునకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం లభించే అవకాశాలున్నాయి. దాంతో డిఫెన్స్‌కు కేటాయించిన నిధులు రూ.7 లక్షల కోట్లు దాటుతాయని ఆ వర్గాలు తెలిపాయి. చైనా, పాకిస్థాన్ నుంచి భద్రతా సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో రక్షణరంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఆర్థిక సంవత్సరానికి

తరువాయి 12లో

# నా వ్యాఖ్యలు వక్రీకరించారు

- బిఆర్‌ఎస్ పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తోంది
- గత ప్రభుత్వ హయాంలో ఏ పని చేయడానికైనా మంత్రులు డబ్బులు తీసుకునేవారని మాత్రమే చెప్పా
- మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం / హనుమకొండ ప్రతినిధి



తాను వరంగల్‌లో చేసిన వ్యాఖ్యల మీద కొంతమంది పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఏ పని చేయడానికి అయినా

తరువాయి 2లో

# మౌంట్ ఎవరెస్టు వద్ద భారత పర్వతారోహకుడు మృతి



**కాఠ్మాండూ :** ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరంపై మరో పర్వతారోహకుడు ప్రాణాలు విడిచారు. ఎవరెస్ట్ శిఖరం నుంచి దిగుతుండగా 'ఆల్టిట్యూడ సిక్‌నెస్' లక్షణాలతో బాధపడుతూ భారత్‌లోని పశ్చిమ బెంగాల్‌కు చెందిన 45 ఏళ్ల సుబ్రతా ఘోష్ మరణించారు. ఆయన 8,848.86 మీటర్ల (29,032 అడుగులు) ఎత్తులో, ఎవరెస్టుకు సమీపంలో ఉన్న ప్రమాదకరమైన హిల్లరీ స్టెప్ ప్రాంతం దిగువ భాగంలో చనిపోయారు. ఈ క్లైంబింగ్ సీజన్‌లో ఎవరెస్టుపై సంభవించిన రెండో మరణం ఇది అని అధికార వర్గాలు వెల్లడించాయి. 'కృష్ణనగర్ స్నోవీ ఎవరెస్ట్ ఎక్స్‌పెడిషన్ 2025' పర్వతారోహణ సంఘం ఆధ్వర్యంలో సుబ్రతా ఘోష్ గత శనివారం(మే 10న) మధ్యాహ్నం 2 గంటలకు ఎవరెస్టుపైకి చేరుకున్నారు. అయితే అత్యంత ఎత్తులో ఉన్నందున, అక్కడి నుంచి దిగే క్రమంలో తీవ్ర అలసటకు గురయ్యారు. దీంతో ఇక పర్వతం

తరువాయి 12లో

# కార్పొరేట్ చదువుల దోపిడీ షురూ


- జోరుగా ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల ప్రచారం
- నియంత్రణ లేకపోవడంతో ఎవరి దోపిడీ వారిదే
- బడికో రేటు, కాలేజీకో ధర
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు రాక విద్యార్థులు అవస్థలు




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే దోపిడీ మొదలైంది. కార్పొరేట్ స్థాయి బడులు, కళాశాలలు తామ సత్తా ఇంతా.. అంతా అంటూ రంగురంగుల కరపత్రాలు ముద్రించి పంచుతున్నారు. మరోపక్క ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తూ మా స్కూల్లో చేర్పించండి, మా కాలేజీలో చదువులు బాగుంటాయి, ఇవిగో మార్కుల పంటలు అంటూ చెవులు చిల్లులు పడేలా చెబుతూపోతున్నారు. ఈ జోరు ప్రచారంలో వారు చెప్పే మాటలతో విస్తుపోతున్న విద్యార్థులు తల్లిదండ్రులు ఎక్కడ చేర్పించాలో అంతుపట్టక తలలు పట్టుకుంటున్నారు. అన్నిదానాల్లో కల్లా విద్యాదానం గొప్ప అన్న నానుడి ఉండనే ఉంది. కానీ నేడు అన్ని దోపిడీల్లో కల్లా విద్యా దోపిడే ఎక్కువైంది. తల్లిదండ్రుల ఆశలను ఆసరాగా చేసుకుని వల విసురుతున్న విద్యాలయాలు ఏడాది తిరిగే లోపు అ ఫీజు ఈ ఫీజు అంటూ, పుస్తకాలు, మెటీరియల్, స్పెషల్ డిజిటల్ వర్క్‌బుక్స్, తదితరాల పేరుతో లక్షలు గుంజేస్తున్నారు. జేబుకు చిల్లు పడిన సంగతి సంవత్సరం గడిచాక గానీ అర్థం కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 50కి పైగా జూనియర్ కాలేజీలు, 100కి పైగా స్కూళ్లు ఉన్నాయి. ఆయా స్కూళ్ల పరిధిలో ఎవరి దోపిడీ వారిదే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మాస్టాండర్డ్‌ను బట్టి ఫీజులు వసూళ్లు చేస్తామంటూ

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## బ్రిటన్‌లో పెరిగిన రాజు ఛార్లెస్ సంపద



**లండన్ :** ఇటీవల బ్రిటన్‌లో కోటీశ్వరుల సంపద ఆవిరై వారు రేటింగ్‌లో కిందిస్థాయికి వెళ్ళగా బ్రిటన్ రాజు ఛార్లెస్ సంపద మాత్రం పెరిగింది. బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి రిషి సునాక్, ఆయన భార్య అక్షతామూర్తిలతో సమానంగా ఛార్లెస్ రాజు సంపద పెరిగిందని సండేటైమ్స్ రిచ్‌లిస్ట్ పేర్కొంది. వార్షికంగా 350 సంపనున్న కుటుంబాల జాబితాలో ఛార్లెస్ సంపద 30 మిలియన్ పౌండ్లు పెరగడంతో ఆయన సంపద 650 మిలియన్ పౌండ్లకు చేరుకుంది. రాజు ఛార్లెస్ తన స్థానాన్ని పెంచుకుని ర్యాంకుల్లో ఇరవై అంకెలు పైకి చేరుకున్నారు. రిషి సునక్‌తో సమానంగా 238వ ర్యాంకుకు చేరుకున్నారు. బ్రిటన్‌లో గోపీ హిందూజా కుటుంబం 37.2 బిలియన్ డాలర్ల సంపదతో అగ్రస్థానంలో అంటే ప్రథమస్థానంలో ఉంది. డేవిడ్ అండ్ సిమన్ రేయిబన్ కుటుంబం రెండోస్థానంలో, సర్‌లియోనార్డ్ బ్లావట్లిక్ కుటుంబం మూడోస్థానంలో ఉంది.

## పెదవి విరుపుల మధ్య తొలిసారి

# ఉక్రేన్–రష్యా చర్చలు ప్రారంభం







**ఇస్తాంబుల్ :** ఉక్రేన్ – రష్యా మధ్య తుర్కియే (టర్కీ)లో మొట్టమొదటిసారి ముఖాముఖీ యుద్ధ శాంతి చర్చలు ప్రారంభమయ్యాయి. కానీ అందరూ ఊహించినస్థాయిలో చర్చలు ప్రారంభం కాకపోవడంతో ఈ చర్చల నుండి పెద్ద ప్రతిఫలం ఉంటుందని ప్రపంచదేశాలు అంచనావేయడం లేదు. భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం 11.30 గంటలకు (స్థానిక సమయం ఉదయం (9గంటలు) పెదవి విరుపుల మధ్య చర్చలు మొదలయ్యాయి. రెండు దేశాలమధ్యా యుద్ధం మొదలయ్యాక మూడేళ్ళలో ముఖాముఖీ చర్చలు ఇదే మొదటిసారి. రెండు దేశాల నుండి వచ్చిన ప్రతినిధులకు మధ్యవర్తిదేశం టర్కీ స్వాగతం పలికింది. ఈ మూడు దేశాల ప్రతినిధులమధ్య దాదాపు గంటసేపు చర్చలు జరిగాయని టర్కీ విదేశాంగమంత్రి హకన్ ఫిదాన్ చెప్పారు. ప్రస్తుత దశలోనే యుద్ధాన్ని ముగించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరగాలన్నారు. ''ఇది రెండు దేశాలకూ ఎంతో కీలకమైన సమయం, ముఖ్యంగా పుతిన్ చర్చలకు ఒప్పుకున్న ఈ సమయం ఇంకా ముఖ్యమైనది'' అన్నారు.

చర్చల అనంతరం ఉక్రేన్ రక్షణమంత్రి రస్టెమ్ ఉమెరోవ్ మాట్లాడారు. ''చర్చల్లో మంచి ఫలితాలు వచ్చా యా?'' అని పాత్రికేయులు ప్రశ్నించగా ''యస్..'' అని ఉమెరోవ్ అన్నారు. ఈ చర్చలకు రష్యా అధ్యక్షుడు వి.పుతిన్ హాజరు కాలేదు. జెలెన్స్కీతో ప్రత్యక్ష చర్చలకు ఆయన తిరస్కరించారు. 2022లో ఉక్రేన్‌తో శాంతి చర్చలకు నాయకత్వం వహించిన తన సహాయకుడు వ్లాదిమీర్ మెడిన్స్కీని అనుసంధానకర్తగా చర్చలకు పంపారు. మెడిన్స్కి నాయకత్వాన గల బృందంలో, రష్యా విదేశాంగ డిప్యూటీ మంత్రి మిహాయిల్ గలుజిన్, సాయుధ దళాల డైరెక్టరేట్ ప్రధానాధిపతి ఇగోర్ కోస్త్యుకోవ్, రక్షణశాఖ డిప్యూటీ మంత్రి అలెగ్జాండర్ ఫోమిన్ సభ్యులుగా ఉన్నారు.

### వీలైనంత త్వరలో పుతిన్‌ను కలుస్తా : ట్రంప్



మధ్యప్రాచ్యంలో ట్రంప్ నాలుగు రోజుల పర్యటన శుక్రవారంతో పూర్తయింది. అబుధాబిలో పాత్రికేయుల ప్రశ్నలకు ట్రంప్ స్పందిస్తూ, వీలైనంత త్వరలో పుతిన్–నేను సమావేశమవుతాం' అన్నారు. యుద్ధాన్ని ముగించడమే తన లక్ష్యమన్నారు. వారానికి సగటున ఐదువేలమంది ఈ యుద్ధంలో మరణిస్తున్నారు, వీలైనంత త్వరగా దీన్ని ఆపాలి, ఆపుతాం అన్నారు. ఇదిలా ఉండగా, పుతిన్‌తో ట్రంప్ నేరుగా చర్చలు జరిపితేగానీ వ్యవహారం చక్కబడేట్టులేదని ఆదేశ విదేశాంగమంత్రి మార్కో రుబియో అన్నారు. ఐతే ప్రత్యక్ష సంభాషణలకు ఇంకా ఒకతేదీని, ప్రదేశాన్ని నిర్ణయించలేదని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో అదొక్కటే ఆశారేఖగా ఉందన్నారు. రాబోయే వారం రో జుల్లో పుతిన్‌ను కలుస్తానని ట్రంప్ నెలరోజుల క్రితమే చెప్పినప్పటికీ వారిమధ్య చర్చ సాధ్యపడలేదు. ఉక్రేన్‌లో యుద్ధం రావడానికి గల మూల కారణాలను ముందుగా చర్చించాలని పుతిన్ అంటున్నారు. కానీ బేషరతుగా కాల్పుల విరమణ జరిగాకే చర్చలు మొదలుకావాలని నిన్నటివరకూ ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ చెబుతూ వచ్చారు. కాగా, రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ దూత రోడియన్ మిరోష్నిక్ టాస్ వార్తాసంస్థతో మాట్లాడుతూ, జెలెన్స్కీని ఉక్రేన్‌కు చట్టబద్ధమైన అధ్యక్షుడుగా తాము చూడటంలేదని, ఎలాంటి అధికారిక ఒప్పందాలపైన సంతకాలు చేసే అర్హత ఆయనకు లేదని అన్నారు.

**మనవడు పుట్టాడు:ఇంటికెళ్ళాలి..** ''నాకు మనవడు పుట్టాడు, చూడాలి, వెంటనే ఇంటికి వెళ్ళాలి, ఆ తర్వాత ఇంకా చాలా పనులన్నాయి'' అని ట్రంప్ అన్నారు. ఆయన ఇంటికి ఆత్రంగా తిరిగివెళ్ళే హడావుడిలో ఉన్నారు.''నా కూతురు టిఫ్ఫనీకి మగబిడ్డ పుట్టాడు, నా అందమైన మనవణ్ణి వెళ్ళ చూడాలి'' అని ట్రంప్ ఆనందంతో చెప్పారు. ఆయన కూడా ఇస్తాంబుల్‌లో జరిగే శాంతిచర్చల్లో పాల్గొంటారని ముందుగా భావించారు. కానీ చర్చలకు ఇదే తగిన సమయమన్నారు. అమెరికా,యూరోపియన్ యూనియన్‌లు ప్రతిపాదించిన 30రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి ఉక్రేన్ పది రోజుల క్రితమే అంగీకరించింది. కానీ పుతిన్‌మాత్రం కొన్ని షరతులు విధించారు. ఆ తర్వాత ఆయనే స్వచ్ఛంధంగా శాంతి చర్చలకు ప్రతిపాదన చేశారు.

## ఇజ్రాయెల్ దారుణకాండ : 100మంది మృతి

### జర్నలిస్టులపై ఆంక్షలు

**గాజా :** ఇజ్రాయెల్ శుక్రవారం ఉత్తర గాజాలో భీకరమైన దాడులు చేసింది. ఈ తాజా దాడుల్లో మరో 100 మంది మరణించారని హమాస్ పౌర రక్షణ ఏజన్సీ చెప్పింది. అనేకమంది అదృశ్యమయ్యారు. వీరంతా గగనతల దాడువల్ల శిథిలాలలో కూరుకుని మరణించి ఉంటారని భావిస్తున్నారు. ఖాన్ యూనిస్‌లో దాడులవల్ల తాత్కాలిక గుడారాలు దగ్ధమయ్యాయి. గడచిన 48 గంటల్లో మొత్తం 250మంది పైగా పాలస్తినా ప్రజలు దాడుల్లో మరణించారు. నివాసిత ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగుతున్నాయి. మరోవైపు ఖతార్‌లో పరోక్షచర్చలు మధ్యవర్తుల ద్వారా జరుగుతున్నప్పటికీ ఎలాంటి ఫలితం కనిపించడంలేదు. బయట నుండి జర్నలిస్టులు గాజాలోకి ప్రవేశించకుండా ఇజ్రాయెల్ సైనికులు గట్టిభద్రత ఏర్పాటు చేశారు. లోపల స్థానిక పాలస్తినా జర్నలిస్టులే రిపోర్టింగ్ చేస్తున్నారు. గడచిన ఏడాదిన్నర కాలంలో 200 మంది జర్నలిస్టులు ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. గురువారం చేసిన దాడుల్లోనే `120 మంది మరణించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యప్రాచ్యంలో పర్యటించిన నాలుగు రోజుల్లో ఇజ్రాయెల్ తన దాడులను మరింత తీవ్రం చేసింది. మార్చి రెండో తేదీ నుండి ఇప్పటివరకూ గాజాలోకి ఎలాంటి మానవతా సహాయాన్ని ఇజ్రాయెల్ సైన్యం అనుమతించడం లేదు. మార్చి 18న కాల్పుల ఉల్లంఘున చేసిన ఒక్క రోజులోనే 400 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ సైన్యం చంపింది. ఇక అప్పటినుండీ ప్రతి రోజూ జరుగుతున్న దాడుల్లో మృతులసంఖ్య అంతకుముందుకంటే గణనీయంగా పెరిగింది.



గాజాలోకి ఆహార సరఫరా వెళ్ళకుండా పెట్టిన ఆంక్షలు తక్షణం ఎత్తివేయాలని రష్యా, చైనా, బ్రిటన్ దేశాలు డిమాండ్ చేయగా, కేన్స్‌లో జరుగుతున్న ప్రపంచ సినీ వేడుకలలో ప్రముఖులంతా గాజాలో దాడులను తీవ్రంగా ఖండించారు.

### దశాబ్దాలు గడచినా నేరాలు ఆగలేదు : అబ్బాస్

పాలస్తినా భూఆక్రమణ, పాలస్తినా ప్రజల కష్టాలు, వారిపై నేరాలు 77 సంవత్సరాల తర్వాత కూడా ఇంకా ఆగలేదని పాలస్తినా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ చెప్పారు. పాలస్తినాలో నివాసాలు కోల్పోయిన శరణార్ధులు, ప్రపంచవ్యాప్తంగా వలసలు వెళ్ళిన పాలస్తీనియన్ల సంఖ్య 70 లక్షలు దాటిందన్నారు. 1948 ఇజ్రాయెల్–అరబ్ యుద్ధ విజయోత్సవం సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ 19 నెలలుగా ఇజ్రాయెల్ చేస్తున్న దురాగతం, సామూహిక హత్యాకాండ, పాలస్తినాలో నెలకున్న కరువు పరిస్థితులను యావత్ ప్రపంచం కళ్ళతో చూస్తోందన్నారు. వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలెం ప్రాంతాలలో పాలస్తినా భూభాగాన్ని ఆక్రమించే నేరం ఈనాటికీ కొనసాగుతోందన్నారు. జోర్డాన్, లెబనాన్, సిరియా, వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలెం ప్రాంతాలలో పాలస్తినా శరణార్ధుల దారుణమైన కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు.

# ప్రపంచవ్యాప్త ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

ఎప్పటికప్పుడు భారత విదేశాంగమంత్రిత్వశాఖ అధికారులు వారితో సంభాషణలు చేస్తూ ఉంటారు. విదేశీ వ్యవహారాల మాజీమంత్రి ఖుర్షీద్‌ను ఒక బృందానికి నాయకత్వం వహించాలని కేంద్రం కోరింది. ఆయన సారథ్యంలో ఏడుగురు ఎంపీల బృందం దక్షిణాసియా, ఆగ్నేయ ఆసియా దేశాలలో ప్రచారం చేస్తుంది. దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్ వంటి దేశాలకు కూడా ఈ బృందం వెళుతుంది. బారామతి ఎంపీ సూలే ఒక బృందానికి నాయకత్వం వహించే అవకాశం ఉంది. ఆమె సారథ్యంలో బృందం మధ్యప్రాచ్యం, ఆఫ్రికాలలో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తారు. ఒమన్,ఈజిప్టు, కెన్యా, దక్షిణాఫ్రికా దేశాలలో కూడా ఈ బృందం పర్యటిస్తుంది. యూరప్ లేదా మధ్యప్రాచ్యదేశాలలో ప్రచారానికి కాంగ్రెస్ నాయకుడు తివారీ ఒక బృందానికి సారథ్యం వహిస్తారు. ఐతే వారి వారి అవకాశాలను కూడా అడుగి నిర్ధారణ చేస్తారని వర్గాలు తెలిపాయి. కేంద్రమాజీ మంత్రి అనురాగ్ థాకూర్, బిజెపి ఒడిశా ఎంపి అపరాజిత సారంగి అధికారపార్టీ తరపున ప్రతినిధులుగా ఉంటారనీ, కాంగ్రెస్ తరపున ప్రభుత్వ జాబితాలో ఎంపీ శశిథరూర్, మనీశ్ తివారీ, సల్మాన్ ఖుర్షీద్, అమర్‌సింగ్‌లు ఉంటారు. కాంగ్రెస్ కూడా వారి అభ్యర్థిత్వాలను ఖరారు చేసిందని వర్గాలు తెలిపాయి. తృణమూల్ కాంగ్రెస్ తరపున ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ, జెడియు ఎంపి సంజయ్ ఝా, బిజెడి నుండి సస్మిత్‌పాత్ర, సిపిఐ(ఎం) నుండి జాన్ బ్రిట్టస్,శివసేన (యుబిటి) నుండి ప్రియాంకా చతుర్వేది, ఎన్‌సిపి(ఎస్‌పి) నుండి సుప్రియా సూలే, డిఎంకె నుండి కె.కనిమొళి, ఎఐఎంఐఎం నుండి అసదుద్దీన్ ఒవైసీ, ఆమ్‌ఆద్మీపార్టీ నుండి విక్రమ్‌జిత్ సాహ్నీలు ఈ బృందాలలో ఉంటారు. కాగా ప్రియాంకా చతుర్వేది సౌదీఅరేబియా,అల్జీరియా, కువైత్, బహ్రైన్ దేశాల బృందంలో ఉన్నారు. బృందాల ఎంపిక, వారు ఏఏ ఖండాలకు, ఏఏ ప్రాంతాలకు వెళ్ళాలి ? అనే విషయాలను కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈ బృందాలు తమ పర్యటనలు ప్రారంభించేముందుగా భారత విదేశాంగమంత్రిత్వశాఖ బృందంలోని సభ్యులకు అవసరమైన సమాచారాన్ని తెలియజేస్తుంది. వారికి అన్ని వివరాలను కూర్చోబెట్టి చెబుతుంది. ఇప్పటికే కొన్ని పార్టీల ఎంపీలు ఇందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ ప్రచారాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు ఏకీభవించారు. కొంతమంది మాజీమంత్రులు ఈ అఖిలపక్ష ప్రతినిధి బృందాలకు నాయకత్వం వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పక్కపక్కనే గొలుసుకట్టుగా ఉండే దేశాలకు ప్రతినిధి బృందాలు వెళ్ళి వరుస ప్రచార కార్యక్రమాలలో పాల్గొంటాయి. ఐతే ఈ ప్రతినిధి బృందాలలో ఎంతమంది సభ్యులు ఉంటారన్న విషయం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. కొంతమంది నాయకులు చెప్పిన సమాచారం ప్రకారమైతే దాదాపు 30 మందికంటే ఎక్కువమంది ఎంపీలే ఈ బృందాలలో ఉంటారు. 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన తర్వాత పాకిస్థాన్ విషయంలో భారత ప్రభుత్వ ఆలోచనల్లో భారీ మార్పు వచ్చింది. పహల్గామ్‌లో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు దాడి చేసిన మరునాటి నుండి అంతర్జాలం ద్వారా, వివిధ క్రియాశీల సోషల్ మీడియా వేదికల ద్వారా భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ దుష్ప్రచారం ప్రారంభించింది. భారత్ వ్యతిరేక విషం చిమ్మింది. దీనిని దీటుగా భారత్ స్పందించినప్పటికీ, పాకిస్థాన్ పెంచిపోషిస్తున్న ఉగ్రవాదం గురించి ప్రపంచానికి తెలియజెప్పేందుకు దౌత్యస్థాయిలో కూడా ప్రచారాన్ని ఇంకా ఉద్ధృతం చేయాలని కేంద్రం నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ మాట్లాడుతూ, తనకు ఎలాంటి సమాచారం ప్రభుత్వం ఇవ్వలేదని చెప్పారు. ఐతే ఈ విషయాల గురించి కేంద్రమంత్రి కిరెణ్ రిజిజు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో మాట్లాడారన్నారు. ఐక్యత,సార్వభౌమాధికారాల గురించి కాంగ్రెస్ మాట్లాడుతుంటే, కేంద్రం మాత్రం ప్రతిపక్షాల ప్రతిష్ఠ దిగజార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఎక్స్ వేదికగా ఆయన ఒక పోస్టింగ్ పెడుతూ, ''ఇప్పుడు ప్రధానమంత్రి ఆకస్మికంగా ప్రపంచదేశాలకు వెళ్ళి పాకిస్థాన్ వ్యతిరేక ప్రచారం చేయాలని నిర్ణయించారు, కానీ పాకిస్థాన్ ఉగ్రవాదం గురించి భారతదేశానికి ఎప్పటినుండో స్థిరమైన వైఖరి ఉంది, కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడూ దేశ ప్రయోజనాలనే ఆశిస్తుంది, దేశ ప్రయోజనాలను ఎన్నటికీ రాజకీయం చేయదు, బిజెపి లాగా దేశ భద్రతా విషయాలను రాజకీయం చేయదు'' అని పేర్కొన్నారు.

# కెటిఆర్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

సంతరించుకున్నది. అనారోగ్యంతో ఉన్న హరీశ్ రావు తండ్రి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు, కెటిఆర్‌కు నాయకత్వ బాధ్యతలను అప్పగిస్తే స్వాగతిస్తామని హరీశ్ రావు ప్రకటించిన తర్వాతనే ఆయను కలిసి ధన్యవాదాలు తెలిపేందుకు హరీశ్‌తో కెటిఆర్ భేటీ అయ్యారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. హరీశ్‌రావు, కెటిఆర్ భేటీ కావడం సర్వసాధారణమేనని, ఇదేం కొత్త కాదని కొందరు పార్టీ ముఖ్యులు చెబుతున్నారు. రెండు గంటల పాటు జరిగిన వారి భేటీలో తాజా రాజకీయ పరిణామాలు, గత కొంత కాలంగా బిఆర్‌ఎస్ వ్యవహారంలో జరుగుతున్న ప్రచారాలపై కూడా చర్చ జరిగి ఉండవచ్చని బిఆర్‌ఎస్ నాయకులు మధ్య చర్చ జరుగుతోంది. ఈ నెల చివరి వారంలో కెటిఆర్ అమెరికాకు వెళ్తున్న నేపథ్యంలో పార్టీ వ్యవహారంలో రకరకాల చర్చలు, అభిప్రాయాలు, చీలికలు, నాయకుల మధ్య విబేధాలు ఇలా రకరకాల ప్రచారం జరగడం పార్టీకి మంచిది కాదని, ఈ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని ఉద్దేశంతోనే హరీశ్‌రావు ఇంటికి కెటిఆర్ వెళ్లారనే ప్రచారం జరుగుతోంది. బిఆర్‌ఎస్‌లో గత కాంత కాలంగా జరుగుతున్న పరిణామాలు పార్టీ శ్రేణుల్లో అయోయమానికి గురిచేస్తోంది. తెలంగాణ భవన్ కార్యాకలాపాల నుంచి మొదలు అనేక ముఖ్యమైన విషయాల్లో కెటిఆర్ నిర్ణయాల తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. అయితే ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌డిఎస్‌ఎ నివేదిక అందిన విషయం తెలిసిందే. దీనిపైన మంత్రివర్గంలో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని సాక్షాత్తూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో జస్టిస్ పిసి ఘోష్ త్వరలోనే ప్రభుత్వానికి నివేదికను సమర్పించే అవకాశాలు ఉన్నాయి. ఈ అంశాలు కూడా హరీశ్‌రావు, కెటిఆర్ మధ్య చర్చ జరిగినట్టు తెలుస్తోంది.

అంతర్గత విబేదాలకు కేంద్ర బిందువుగా బిఆర్‌ఎస్ గులాబీ శ్రేణుల్లో జోష్ నింపాల్సిన 'బిఆర్‌ఎస్ వరంగల్ రజతోత్సవ సభ' గత కొంత కాలంగా అంతర్గత విబేధాలకు కేంద్ర బిందువుగా మారిందనే చర్చ జరుగుతోంది. జన సమీకరణ చేయడంలో విజయవంతమైన బిఆర్‌ఎస్, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహానికి బదులుగా అనుమానాలు, అయోమయాలకు తెరతీసింది. ఆ సభ వేదికపైన ఏ ఒక్కరిని కూడా మాట్లాడనివ్వకపోవడం, సభ ప్రాంగణంలో కేవలం కెటిఆర్ ఉన్న పోస్టర్లే దర్శనమివ్వడం, పైగా కెటిఆర్ వర్గానికి చెందిన వారికే సభకు చెందిన ముఖ్యమైన బాధ్యతలను అప్పగించారనే ప్రచారం ఆ పార్టీలో విభేదాలకు, నాయకుల ఆదిపత్యపోరుకు ఆజ్యం పోసిందనే చర్చ జరుగుతోంది. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కెసిఆర్ తర్వాత కెటిఆర్ అనేది అనేక సందర్భాల్లోనే అనేక పద్ధతుల ద్వారా కెసిఆర్ సంకేతాలు ఇచ్చారు. రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత హరీశ్‌రావును మంత్రివర్గంలో కూడా తీసుకోలేదు. ఒక దశలో ఆయనను పక్కన పెట్టారనే సంకేతాలను కూడా పంపించారు. దీంతో హరీశ్‌రావును కలిసేందుకు కూడా చాలా మంది ముఖ్య నాయకులే భయపడే పరిస్థితి నెలకొన్నది. ఆ తర్వాత మళ్లీ మంత్రివర్గంలో హరీశ్‌రావుకు అవకాశం కల్పించారు.

### హరీశ్,కవిత పాత్రపై సర్వత్ర ఆసక్తి ...?

బిఆర్‌ఎస్‌లో కెసిఆర్ తర్వాతి స్థానం కెటిఆర్ అనేది స్పష్టత ఉన్నది. కానీ కెటిఆర్ తర్వాత ఎవరు? అనేదే ప్రస్తుతం ప్రశ్నార్ధకంగా మారింది. బిఆర్‌ఎస్‌లో హరీశ్‌రావు, కల్వకుంట్ల కవిత పాత్ర ఏమిటనేది కూడా చర్చనీయంశంగా మారింది. ఒక వేళ కెటిఆర్‌కు నాయకత్వం అప్పగిస్తే, ఆ తర్వాత స్థానంలో హరీశ్‌రావు, కవితలో ఎవరికి ప్ర ధాన్యత ఇస్తారనేది కూడా పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠత నెలకొన్నది. తనపై సోషల్ మీడియాలో రకరకాల ప్రచారం చేస్తున్నారని, వారేవరో తనకు తెలుసని, సమయం వచ్చినప్పుడు చెబుతానని స్వయంగా కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మరోవైపు కవిత చేస్తున్న వ్యాఖ్యలు, ఆమె కార్యక్రమాలు బిఆర్‌ఎస్‌ను ఇరకాటంలో పెడుతున్నాయి. తెలంగాణ జాగృతి అనేది స్వతంత్ర సంస్థ అనేది గులాబీలో బలంగా వినిపిస్తోంది.

# చట్ట ప్రకారం నడుచుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

వైస్ ప్రిన్స్‌పల్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ రావు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మ ణ్‌లు హాజరయ్యారు. కోదండరాం మాట్లాడుతూ బలగాలు ఉన్నాయని, అందరినీ చంపుకుంటూ పోతే ప్రజాస్వామ్యం అనిపించుకోదన్నారు. యుద్ధాలు జరిగినపుడు అంతర్జాతీయ స్థాయిలో కూడా ఇష్టానుసారం వ్యవహరించడానికి వీలులేదని, అలాంటిది అంతర్గికమైన సమూహాలతో సమస్యలు వచ్చినప్పుడు రాజ్యాంగం, చట్టాలకు లోబడి వ్యవహరించాలన్నారు. వీటిని బేఖతరు చేస్తూ వ్యహరించడానికి వీలులేదన్నారు. ఈ చట్టాలు పౌరులను చంపడానికి ప్రభుత్వ యంత్రాంగానికి ఇవ్వలేదన్నారు. చర్చిస్తామని అన్నప్పుడు చట్టపరంగా చర్చించాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మావోయిస్టులు కూడా చర్చలు కోరుతున్నందున తప్పనిసరిగా చర్చించాలని, ఈ సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోదండరాం కోరారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఆదానీ, అంబానిల ఆస్తులు పెరిగితే దేశ సంపద పెరిగినట్లు కాదన్నారు. మల్టీనేషనల్ కంపెనీల ఏజెంట్లుగా రాజకీయ నాయకులు మారారు అని విమర్శించారు. వాళ్లు ఇచ్చే డబ్బులకు బానిసలయ్యారని ఆరోపించారు. దోపిడి, అన్యాయాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వస్తాయని తెలిపారు. రాజ్యాంగం పౌరులకు జీవించే హక్కు కల్పించిందని, ఎవరి ప్రాణాలు హరించే అధికారం ఇవ్వలేదన్నారు. ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా శాంతి చర్చల కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. మావోయిస్టులతో పాటు గ్రేహౌండ్స్, సిఆర్‌పిఎఫ్ బలగాలు కూడా మృతువాత పడుతున్నాయన్నారు. మానవ హాణాన్ని ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలని జస్టిస్ చంద్రకుమార్ కోరారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ మావోయిస్టులు చర్చలకు సానుకూలంగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం ఇంకా స్పందించకపోవడం సరికాదన్నారు. శాంతి చర్చలకు సానుకూల వాతావరణం ఏర్పడటానికి ముందుగా కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటన చేయాలని కోరారు. ఆపరేషన్ కగార్‌లో చనిపోయేవాళ్ళు ఈ దేశ పౌరులు, ఆదివాసులేనన్నారు. ఏ సమస్య అయినా శాంతితో, చర్చలతోనే ముగుస్తుందన్నారు. ఆపరేషన్ కగార్ రాజ్యాంగ వ్యతిరేకమని, రాజ్యాంగం బద్ధంగా నడుచుకునే ప్రభుత్వాలు దానిని గౌరవించాలని కోరారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మావోయిస్టులపై తమకు ద్వేషం లేదని చెప్తుంటే, మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాత్రం విరుద్ధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, ఒకే ప్రభుత్వంలో మంత్రులిద్దరు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. బేషరతుగా కేంద్రం మావోయిస్టులతో చర్చలు జరిపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పౌర సమాజం తిరగబడుతుదని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకుడు బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ మావోయిస్టు ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశంగా భావిస్తుందని తెలిపారు. బడా కార్పొరేట్ కంపెనీల కోసం అడువులలో ఉండే ఆదివాసీలను తరిమేసి, ఖనిజ సంపందను కొల్లగొట్టేందుకే కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టిందని విమర్శించారు. మావోయిస్టులతో చర్చలు జరపాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి సూచించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఎలాంటి షరతులు పెట్టకుండా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చల ప్రక్రియను ప్రారంభించాలని కోరారు.

# వక్రీకరించారు

(మొదటి పేజీ తరువాయి)

అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారని తాను మాట్లాడానని,అవి అక్షర సత్యం కూడా అని, ఆ మాటలకి తాను ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని మంత్రుల పనితీరుపై వారు ప్రతి ఫైలుకు డబ్బులు తీసుకునే వారని తాను ఆ వ్యాఖ్యలు చేశానని, అది నిజమో కాదో వాళ్ళకి తెలుసునని, అయితే కొంతమంది తన వ్యాఖ్యలను తప్పుగా వక్రీకరించడం సహేతుకం కాదని అన్నారు. తమ ప్రభుత్వం అద్భుతంగా పరిపాలన చేస్తుంటే ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు తమ పెయిడ్ సోషల్ మీడియా ద్వారా విషప్రచారం చేసే కుట్ర చేస్తున్నారని, అందులో భాగంగానే ఆ వీడియోలో తన వ్యాఖ్యల్ని ముందు వెనక కొంత తీసేసి, మిగతా కొంత పార్ట్ ను కావాలనే హైలైట్ చేయడం వెనుక ఉన్న కుట్ర ఇదేనని అన్నారు. తాను అన్నది కేవలం గత ప్రభుత్వంలో మంత్రులు పైసలు తీసుకొని పనిచేసేవారినీ మాత్రమేనని, కానీ తన వ్యాఖ్యలను పెయిడ్ సోషల్ మీడియా వాళ్ళు ఎడిటింగ్ చేసిన మార్ఫింగ్ వీడియో చేసి రెండు రోజులుగా సోషల్ మీడియాలో సర్కులేట్ చేస్తున్నారని అన్నారు. ఆ వీడియోను ఇలా సర్కులేట్ చేసి... తమ కేబినెట్ సభ్యుల మధ్య గొడవ పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సరికాదని, వారి ఆశలు నెరవేరవు అని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులంతా అద్భుతంగా పనిచేస్తున్నారని, తమ ప్రభుత్వానికి పనిచేసుడు తెలుసు, పరిపాలన చేయడం తెలుసు అని, బీఆర్‌ఎస్ వాళ్ళకి సోషల్ మీడియాలో దొంగ ప్రచారం, తప్పుడు ప్రచారం ఎలా చేయడమో మాత్రమే తెలుసు అన్నారు. ఇటువంటి దుష్ప్రచారాలు ఇంకొకసారి చేస్తే ఎంత మాత్రం సహించేదిలేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల నిర్వాకం వల్లనే కదా మంత్రులకు డబ్బులు ఇస్తే తప్ప ఫైళ్లు క్లియర్ కావు అనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోయిందన్నారు. ఈ విషయం వారి హయాంలో పని చేసిన మంత్రి నాయిని నరసింహా రెడ్డి కేసీఆర్ మానస పుత్రిక ఆయన మిషన్ కాకతీయలో ఉన్న కమిషన్ బాగోతాన్ని కమిషన్ కాకతీయ అని సంబోధించి మీ అవినీతిని బయట పెట్టలేదా?అని ప్రశ్నించారు. ఇక దళిత బంధులో ప్రతి ఎమ్మెల్యే 30 శాతం కమిషన్ తీసుకుంటారని అప్పటి సీఎం కేసీఆరే వారి ఎమ్మెల్యేల గురించి చెప్పలేదా? అన్నారు. ఊర్ల మీద పడి ప్రజల రక్తాన్ని పీల్చారు కాబట్టే ప్రజలు మీకు ఎన్నికల్లో బుద్ధి చెప్పారని,అయినా మీ బుద్ధి మారలేదని, ప్రతి అంశానికి వక్రభాష్యాలు చెబుతూ మీ వంకర బుద్ధిని బయట పెట్టుకుంటున్నారని అన్నారు. పద్ధతి మార్చుకోకపోతే అవినీతికి, అబద్ధాలకు పుట్టిన విష పురుగు బీఆర్‌ఎస్‌ను ప్రజలే నామరూపాలు లేకుండా చేస్తారన్నారు.

# తడిసిన ధాన్యమూ కొంటాం

(మొదటి పేజీ తరువాయి)

ధాన్యం కొనుగోళ్లు జరుపుతామన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడం, నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. నిజానిజాలు ప్రజలకు బహిర్గతం చేసి, రైతులకు భరోసా కల్పించడంలో కలెక్టర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీ పూర్తయిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తామన్నారు.

**ఇప్పటివరకు 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు..**

రాష్ట్రంలో ఇప్పటివరకు 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఈ సీజన్‌లో మొత్తం 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 2023 రబీ సీజన్‌లో మే15 నాటికి 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, ఈ రబీ సీజన్‌లో అదే మే 15 నాటికి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేశామన్నారు. ముందెన్నడూ లేని రీతిలోపెద్ద సంఖ్యలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, యాసంగి ధాన్యం కొనుగోలుకు 8,348 కొనుగోలు కేంద్రాలు 202122 రబీ సీజన్‌తో పోలిస్తే ఈ రబీ సీజన్‌లో అధికంగా1,739 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో పెరగడంతో కొనుగోలు కేంద్రాల పెంచామన్నారు. ధాన్యం కొనుగోళ్లు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. కొనుగోళ్ల ప్రక్రియను కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలని ఆదేశించారు. రానున్న 10, 12 రోజులు కొనుగోళ్ల ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్ర స్థాయిలో లోపాలు గుర్తించి, సత్వరమే పరిష్కరించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు.

## బంగ్లాదేశ్‌కు జూన్‌లో 3.5 బి.డాలర్ల రుణాలు

**ఢాకా :** బంగ్లాదేశ్‌కు రాబోయే జూన్ నెల నుండి దాదాపు 3.5 బిలియన్ డాలర్లు రుణం లభించనున్నది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థతోపాటు పలు ఆసియా బ్యాంకుల నుండి ఈ రుణం లభిస్తుందని బంగ్లాదేశ్ బ్యాంక్ గవర్నర్ అహ్సన్ హెచ్ మన్సూర్ చెప్పారు. ఈ నిధుల్లో 1.3 బిలియన్ డాలర్లు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ నుండి వస్తాయన్నారు. మిగిలిన రుణం ఆసియా అభివృద్ధి బ్యాంకు, వరల్డ్ బ్యాంకు, జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ బ్యాంకుల నుండి వస్తాయని ఆయన చెప్పారు. మార్కెట్ ఆధారిత ఎక్స్ఛేంజ్ రేటును కూడా తాము అమలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. బంగ్లాదేశ్‌కు రుణం మంజూరు చేసేందుకు సంబంధించిన నాలుగో విడత చర్చలను ఐఎంఎఫ్ ఇటీవల ముగించింది. జూన్ నాటికి 1.3 బిలియన్ డాలర్లు రుణం ఇచ్చేందుకు లైన్‌క్లియర్ చేసింది. ఇది కాకుండా ఇతర భాగస్వాముల నుండి మరో రెండు బిలియన్ డాలర్లు కూడా మద్దతు లభిస్తుందని తమ ప్రభుత్వం అంచనావేస్తున్నట్లు గవర్నర్ చెప్పారు.

# స్తంభాలు కనిపించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పొడవునా సోలార్ విద్యుత్ వినియోగించుకునే ప్రణాళిక ఉండాలని, జిహెచ్‌ఎంసి పరిధిలోని పుట్‌పాత్‌లు నాలాలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సిఎం సంబంధిత అధికారులకు సూచించారు. మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రానికి వెల్లువెత్తిన పెట్టుబడులు, రానున్న రోజుల్లో తెలంగాణలో జరిగే పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ప్రణాళిక తయారు చేసుకోవాలని సిఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. పరిశ్రమలతో పాటు గ్లోబల్ కెపాబులిటీ సెంటర్లు (జిసిసి), డేటా సెంటర్లు, మాస్ ట్రాన్స్‌పోర్టేషన్ (మెట్రో, ఎలక్ట్రికల్ వెహికిల్స్) దృష్టిలో ఉంచుకుని పునరుత్పాదక విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సిఎం సూచించారు. రానున్న రోజుల్లో విద్యుత్ అవసరాలను ముందస్తుగా అంచనా వేసి రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని సిఎం చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల వచ్చే మూడేండ్లలో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని అధికారులను అప్రమత్తం చేశారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మూడేండ్ల విద్యుత్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఈ సంవత్సరం విద్యుత్ డిమాండ్ పెరిగిందని, అయినప్పటికీ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ అత్యధికంగా 17,162 మెగావాట్లకు చేరుకుందని, ఈ డిమాండ్ 2025–26లో 18,138 మెగావాట్లు, 2034–35 నాటికి 31,808 మెగావాట్లకు పెరుగుతుందని, ఆ మేరకు అవసరాలు, అంచనాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. ప్రధానంగా క్లీన్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజీపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్తగా అమలులోకి తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీపై దృష్టి సారించాలని, విద్యుత్ ఉత్పత్తిలో ప్రఖ్యాతిగాంచిన ప్రపంచ దిగ్గజ సంస్థలకు అవకాశం ఇవ్వాలని సిఎం అన్నారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్, మెట్రో విస్తరణ, రైల్వే లైన్లు, ఇతర మాస్ ట్రాన్స్‌పోర్టర్ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు.

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఇతర కార్పొరేషన్ల విద్యుత్, కొత్తగా ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్లు, పారిశ్రామికవాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని చెప్పారు. జిసిసి హబ్‌గా హైదరాబాద్ దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తోందని అన్నారు. భవిష్యత్తులో డేటా సెంటర్ల హమ్‌గా మారబోతుందని, హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్‌లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపై హెచ్‌ఎండిఎతో సమన్వయం చేసుకోవాలని సిఎం సూచించారు.

# సన్నద్ధమవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, పోలీస్ కమిషనర్లతో మాట్లాడాలని సిఎస్ రామకృష్ణారావును సిఎం ఆదేశించారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో సరిపడే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సీజన్‌లో వరి, పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందని, రైతుల నుంచి డిమాండ్ ఉన్న అన్ని కంపెనీల విత్తనాలు మార్కెట్‌లో ఉన్నాయని చెప్పారు. ఎరువులు, విత్తనాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రైతులకు భరోసానిచ్చారు. ఈసారి రుతుపవనాలు ముందే వస్తుండటంతో, రాష్ట్రంలోనూ వానలు ముందుగానే కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చేసిన సూచనలను రైతులు గమనించాలన్నారు. అందుకు అనుకూలంగా సరైన అదనులో పంటలు వేసుకోవాలని, నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని రైతులను అప్రమత్తం చేశారు. ప్యాకింగ్ చేసిన విత్తనాలు తప్ప విడిగా విత్తనాలు కొనుగోలు చేయవద్దని, విత్తన పాకెట్లు కొనేటప్పుడు తప్పకుండా బిల్లును, పాకెట్‌ను పంట కాలం ముగిసేంత వరకు భద్రపరుచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. నకిలీ కంపెనీలు, కల్తీ విత్తనాల బారిన పడి రైతులు మోసపోకుండా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖకు ఆదేశించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎఫ్‌ఎండి మీర్జా రియాజ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎఫ్‌ఎండి మీర్జా రియాజ్ ఉల్ హస్సన్ పదవీ స్వీకార ప్రమాణం చేశారు. తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుక్రవారం తన ఛాంబర్‌లో మీర్జా రియాజ్ ఉల్ హస్సన్‌తో ప్రమాణస్వీకారం చేయించారు.
ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, ఎంఐఎం ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, మీర్ జులుఫికర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# రైతు రాజ్యమే కాంగ్రెస్ లక్ష్యం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో అమల్లో ఉన్న ధరణి చట్టం కారణంగా అనేక మంది రైతులు భూములు కోల్పోయారని, అది బిఆర్‌ఎస్ నాయకుల కోసం రూపొందించిన చట్టమని, భూ సమస్యల పరిష్కారంలో ధరణి విఫలమైందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలో శుక్రవారం ఏర్పాటుచేసిన భూ భారతి అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొమరం భీం జిల్లాలో పెంచికల్ పేట్ మండలాన్ని భూభారతి ఆర్ఒఆర్ చట్టానికి పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. కాగజ్‌నగర్ డివిజన్ లోని పలు మండలాల అధికారులు పెంచికల్‌పేట్ మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ రైతులు పెట్టే అర్జీలను పరిశీలించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తారని ఆయన చెప్పారు. ధరణిలో జరిగినట్లుగా భూ భారతి చట్టంలో అవకతవకలకు ఆస్కారం లేదని, రైతులకు మేలు చేసే విధంగా అనేక రాష్ట్రాల్లోని భూ చట్టాలను పరిశీలించి భూ భారతిని అమల్లోకి తీసుకువచ్చామని ఆయన వెల్లడించారు. సర్వేయర్లు స్వయంగా భూ స్థలాల్లోకి వచ్చి ఆన్‌లైన్ మ్యాపింగ్ చేసి భూములను గుర్తిస్తారని, నిబంధనల ప్రకారం పట్టాలు చేస్తారని ఆయన తెలిపారు. పంచాయతీరాజ్ మంత్రి సీతక్క మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలు, రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఈ చట్టంలో అన్ని రకాల సమస్యలకు పరిష్కారం చేసేలా అధికారులకు అవకాశం కల్పించామని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌సి దండే విఠల్ మాట్లాడుతూ సిర్పూర్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, మంత్రి సీతక్క వారం రోజుల్లో రెండుసార్లు పర్యటించి ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. ఎంఎల్‌ఎ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ నిలిచిపోయిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని మంత్రులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే సాబ్, సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్ల, రెవెన్యూ సబ్ కలెక్టర్ డేవిడ్, స్థానిక సంస్థల కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, మాజీ ఎంఎల్‌సి పురాణం సతీష్, మాజీ ఎంఎల్‌ఎ వేణుగోపాల చారి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా ఎస్‌పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

### రాష్ట్రంలో పసుపుబోర్డు ఏర్పాటు చేసినా..

# రైతులకు నామమాత్రపు ధరలేనా!

రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పసుపు పంటకు కేరాఫ్ అడ్రస్ అయిన నిజామాబాద్‌లో కేంద్రం పసుపు బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ రైతుకు నామమాత్రపు ధరలు మాత్రమే లభిస్తున్నాయని, తెలంగాణ వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అదే పక్కన ఉన్న మహారాష్ట్ర సాంగ్లీ మార్కెట్‌లో ఎక్కువ ధర లభిస్తుండగా, నిజామాబాద్‌లో పండించే పసుపులో కురుకుమిన్ శాతం తక్కువగా ఉండడంతో తక్కువ ధర లభిస్తుందని తెలిపారు. పసుపుబోర్డు తక్షణమే కురుకుమిన్ అధికంగా ఉండే విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ, రైతు కమిషన్ కార్యాలయంలో శుక్రవారం కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సభ్యులు భూమి సునీల్, భవానీ రెడ్డిలు మీడియాతో మాట్లాడారు. పసుపు సాగులో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భూమిలో నుండి పసుపు పీకడం, ఉడకపెట్టడం, పాలిష్ చేయడానికి యంత్ర పరికరాలు అవసరమన్నారు. ఆధునిక యంత్రాలు అందించడం కేంద్రానిదే బాధ్యతని, ఇందుకు వచ్చే సీజన్‌కు ముందే కేంద్రం చొరవ తీసుకోవాలన్నారు. మేలైన పసుపు విత్తనాలు అందించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. విత్తనం పండించుకోడానికి తెలంగాణ అనుకూలమైన ప్రాంతమని, అందుకే బహుళజాతి కంపెనీలు అన్నిరకాల విత్తనాలను ఇక్కడ తయారు చేస్తున్నాయన్నారు. కొన్ని కంపెనీలు నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేస్తున్నాయని, అలాంటి వారి ఆట కట్టించేందుకు నిర్దిష్టమైన విత్తన చట్టం త్వరలో రానుందన్నారు. భవానీరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ విత్తనం రాజ్యమేలుతోందని, దీంతో వ్యవసాయం గాడి తప్పి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇతర దేశాల్లో సాంప్రదాయ పంటలకు ప్రాధాన్యత ఇస్తుండగా మన రాష్ట్రంలో, దేశంలో నిర్లక్ష్యం కారణంగా చెరుకు, పసుపు పంటల సాగు విస్తీర్ణం తగ్గుతోందని తెలిపారు. ఈ పంటలకు యాంత్రీకరణ అవసరమని, దానికోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. భూమి సునీల్ మాట్లాడుతూ 1966లో కేంద్రం చేసిన విత్తన చట్టం 2007 పత్తి విత్తన చట్టాల్లో ఉన్న కొన్ని లొసుగుల కారణంగా రైతులకు నాణ్యమైన విత్తనం అందని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవసాయం జరుగుతోందని, విత్తనోత్పత్తి కోసం చాలావరకు ఎంఎన్‌సి కంపెనీలు రైతులతో అలాంటి ఒప్పందాలు చేసుకుంటున్నారని, కానీ ఎక్కడ అగ్రిమెంట్స్ పేపర్స్ ఉండడం లేదన్నారు. విత్తన చట్టం ప్రకారం నకిలీ విత్తనాలు అమ్మితే ఐదేళ్ల నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష పడేలా చట్టం రూపొందించాల్సి ఉందన్నారు.

## టిసాట్ లక్ష్యం ఇంటింటికీ ఉన్నత విద్య

ఓయు విసి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉన్నత విద్యలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలనే సంకల్పంతో, ప్రతీ ఇంటికీ ఉన్నత విద్యను చేర్చాలనే టిసాట్ ఆశయంతో కలిసి పనిచేస్తామని ఉస్మానియా యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం చెప్పారు. ఓయు రిజిస్ట్రార్, ఇతర అధ్యాపక బృందంతో కలిసి అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలోని టిసాట్ చానల్ ప్రొఫెసర్ కుమార్ సందర్శించారు. టిసాట్ స్టూడియోలను కలియతిరిగిన విసి అక్కడి అధునాతన టెక్నాలజీతో కూడిన పరికరాలు, స్టూడియోలు, పోస్ట్ ప్రొడక్షన్ యూనిట్, కెమెరాలు, డిజిటల్ బోర్డులను స్వయంగా తిలకించారు. గతంలో కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంఒయు) ప్రకారం టిసాట్‌తో కలిసి విస్తృతంగా పనిచేస్తామని ఈ సందర్భంగా విసి ప్రకటించారు. దేశంలోనే డిజిటల్, ఆన్‌లైన్, శాటిలైట్ మాధ్యమాల ద్వారా అత్యుత్తమ కంటెంట్‌ను అందిస్తున్న ఏకైక ఛానల్ టిసాట్ మాత్రమే అన్నారు. రానున్న రోజుల్లో టిసాట్ మాధ్యమంగా ఉన్నత విద్యకు సంబంధించిన నాణ్యమైన కంటెంట్‌ను రూపొందించి విద్యార్థులకు అందిస్తామని, ఇందుకోసం ప్రతిష్టాత్మక ఓయుకు చెందిన వివిధ సబ్జెక్టు నిపుణులతో టిసాట్ వేదికగా కార్యక్రమాల రూపకల్పనకు ఓయు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దేశంలో అత్యధిక శాతం ఉన్న యువత ఈ కార్యక్రమాలను వినియోగించుకోవాలని విసి కోరారు. ఈ సందర్భంగా టిసాట్ సిఇఒ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యను అందరికీ చేర్చేందుకు టిసాట్ కృషి చేస్తుందని, మూడవ తరగతి నుండి పీజి వరకు అకడమిక్ కంటెంట్‌తో పాటు, కానిస్టేబుల్ మొదలు గ్రూప్స్ వరకు కాంపిటేటివ్ పరీక్షలకు సంపూర్ణమైన కంటెంట్‌ను అందిస్తుందన్నారు. ఓయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్ రెడ్డి, విసి ఓఎస్‌డి ప్రొఫెసర్ జితేందర్‌కుమార్ నాయక్, ఓయు యుజిసి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ లావణ్య, ఇఎంఆర్‌ఎస్ డైరెక్టర్ రఘుపతి పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి




**ప్రజాపక్షం / హుజురాబాద్ :** గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలో ర్యాలీ చేపట్టగా, పోలీసులు అడ్డుకున్నారు. భారీగా పోలీసు బలగాలు మోహరించి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గంటపాటు హుజురాబాద్‌లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ర్యాలీ వద్దకు వచ్చి తహసీల్దార్ కనుకయ్య సిపిఐ నాయకుల నుండి వినతిపత్రం స్వీకరించారు.
నెల రోజుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. అనంతరం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ హుజురాబాద్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గత ప్రభుత్వం పంపిణీ చేయకపోగా, ఈ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్‌కు పలు మార్లు లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ పార్టీ ఆధ్వర్యంలో పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేయాలని ఆందోళనా కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన, నిరాశ్రయులైన పేదలకు హుజురాబాద్ పట్టణంలో నిర్మించిన 570 ఇళ్లను తక్షణమే పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. నెల రోజుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయకపోతే ఆందోళనా కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్, బోయిని అశోక్, పైడిపల్లి రాజు,పంజాల శ్రీనివాస్, మహిళా సమైక్య రాష్ట్ర నాయకురాలు మల్లక్క, జిల్లా కౌన్సిల్ సభ్యులు రామారపు వెంకటేష్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి గరిగే శారద, హుజురాబాద్ మండల కార్యదర్శి గోవిందుల రవి, పట్టణ కార్యదర్శి గరిగె రాములు, మండల కౌన్సిలింగ్ కేశబోయిన రాము, లంకదాసరి కల్యాణ్, అనిశెట్టి చంద్రయ్య, పట్టణ నాయకులు బొడ్డు రాజు, వంకాయల లక్ష్మి, స్వప్న, రమ, దుర్గం మమత, దుర్గం తిరుమల, లక్ష్మి, సునీత, అనిత, చదల్ల లక్ష్మి, దాసరి లక్ష్మి, పులి మల్లమ్మ, రేపల్లి కోమల, మంజుల, నల్లకొండ రజిత, పర్లపెల్లి భారతి, శనిగరపు గిరిజ, కడుమంగి యాదమ్మ, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## హైదరాబాద్ పోలీసులకు 'అంతర్జాతీయ గుర్తింపు'

దుబాయ్‌లో వరల్డ్ పోలీసు సమ్మిట్-2025
హైదరాబాద్ యాంటీ-నార్కోటిక్స్‌కు దక్కిన అరుదైన అవార్డు
దుబాయ్ ఆఫీసర్స్ క్లబ్‌లో అవార్డు అందుకున్న సివి ఆనంద్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దుబాయ్ కేంద్రంగా నిర్వహించిన వరల్డ్ పోలీసు సమ్మిట్ (డబ్ల్యూపిఎస్) 2025లో హైదరాబాద్ పోలీసులు అరుదైన అవార్డు దక్కించుకున్నారు. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్‌కు 'ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కోటిక్ అవార్డు' గెలుచుకుంది. దుబాయ్‌లోని దుబాయ్ పోలీస్ ఆఫీసర్స్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్ వరల్డ్ పోలీస్ సమ్మిట్ కమిటీ ద్వారా 'ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కోటిక్స్ అవార్డు'ను అందుకున్నారు. డబ్ల్యూపిఎస్ 2025 ఈనెల 13 నుంచి 16 వరకు దుబాయ్‌లో నిర్వహించారు. హైదరాబాద్ నగరంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడానికి తీసుకున్న చురుకైన చర్యలు, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని విద్యార్థులు, సాధారణ ప్రజలు మాదకద్రవ్యాల నియంత్రణ కోసం నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, గత మూడు సంవత్సరాలలో ఈ విషయంలో సాధించిన గణనీయమైన విజయాల కారణంగా ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించింది.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..అంతర్జాతీయ పోలీస్ సమ్మిట్ 2025లో 138 దేశాల నుండి ప్రముఖ పోలీసు అధికారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ ఖండాల నుండి అత్యంత సమర్థవంతమైన పోలీసు దళాలతో పోటీపడి హైదరాబాద్ నగర పోలీసుల హైదరాబాద్ నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) 'ఎక్సలెన్స్ ఇన్ యాంటీనార్కోటిక్స్ అవార్డు' గెలుచుకోవడం పట్ల కమిషనర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును సాధించడంలో తన బృంద సభ్యుల కృషి, అంకితభావాన్ని గుర్తిసూ, ప్రతి ఒక్కరికీ తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం తెలంగాణ పోలీసులకు మాత్రమే కాకుండా మొత్తం భారతదేశ పోలీసులకు గర్వకారణమని చెప్పారు. మాదకద్రవ్యాలను నియంత్రించడంలో హెచ్‌న్యూ అనుసరించిన వినూత్న పని పద్ధతులు, సమగ్ర విధానానికి కమిషనర్ ఈ గుర్తింపును ఆపాదించారు. 12 దేశాలకు చెందిన వివిధ చట్టాల అమలు సంస్థల నుండి 12 మంది పోలీసు అధికారులు, ఆవిష్కర్తలకు చట్ట అమలులోని వివిధ విభాగాలలో మొదటి బహుమతి లభించింది.
అవార్డుల ప్రదానోత్సవానికి ముందు జరిగిన ప్యానెల్ చర్చలో, సివి ఆనంద్ భారతదేశంలో ఎదుర్కొంటున్న మాదకద్రవ్యాల సమస్యల గురించి, ముఖ్యంగా కోవిడ్ తర్వాత, మాదకద్రవ్యాలు దేశంలోకి ప్రవేశించే వివిధ మార్గాలు, వివిధ ముఠాలు మరియు పెడ్లర్లను పట్టుకోవడం, మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీలు, అవగాహన ప్రచారాల ద్వారా విద్యా సంస్థలను పర్యవేక్షించే ప్రయత్నాలు, పునరావాస చర్యలు మొదలైన వాటి గురించి మాట్లాడారు.

## 'కంచెగచ్చిబౌలి'లో చెట్లను పునరుద్ధరించండి : వివేకానంద

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కంచెగచ్చిబౌలి భూముల్లో చెట్లను పునరుద్ధరించాలని బిఆర్‌ఎస్ విప్ కె.పి.వివేకానంద రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న పది వేల కోట్ల రూపాయల రుణంపై దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు డాక్టర్ కె.సంజయ్, అనిల్ జాదవ్‌తో కలిసి వివేకానంద మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీలో జీవరాశుల మరణాలకు కారణమైన సిఎం రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలన్నారు. పది వేల కోట్ల ఆర్థిక అవకతవకల్లో బిజెపి ఎంపి పాత్ర కూడా ఉన్నదని, అందుకే ఆర్థిక అవకతవకలపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసినప్పటికీ విచారణ చేయడంలేదని ఆరోపించారు. దస్త్రాలు క్లియర్ కావాలంటే డబ్బులు తీసుకుంటున్నామని సాక్షాత్తూ మంత్రి కొండా సురేఖనే వ్యాఖ్యానించిన విషయాన్ని వివేకానంద గుర్తుచేశారు. అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా మాట్లాడాలంటేనే కేసులు పెడుతున్నారని ఆరోపించారు.
డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ క్యాబినెట్ మంత్రులే కాంగ్రెస్ ప్రభుత్వంపైన ఆరోపణలు చేస్తున్నారని, 20శాతం కమీషన్లు తీసుకుంటున్నారని మంత్రులు చెబుతున్నారని ఆరోపించారు.

### సరస్వతి పుష్కరాల్లో

# ఆకట్టుకుంటున్న 'టెంట్‌సిటీ'

ఈ తరహా ఏర్పాటు ఇదే మొదటిసారి





**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన 'టెంట్ సిటీ' అందర్నీ ఆకట్టుకుంటుంది. భక్తులు బస చేసేందుకు ప్రత్యేక గదులు, హాల్స్ ఈ టెంట్‌సిటీలో తాత్కాలికంగా నిర్మించారు. ఆధ్యాత్మిక కేంద్రాలలో భక్తుల కోసం ఇలాంటి టెంట్‌సిటీ ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాళేశ్వరం ఘాట్ (గోదావరి నది) వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతి పుష్కరాలను గురువారం ప్రారంభించిన విషయం తెలిసిందే.
పుష్కరాలకు వచ్చిన భక్తులు టెంట్‌సిటీని తిలకిస్తున్నారు. కాలేశ్వరం దేవాలయంకు 400 మీటర్ల దూరంలో 2 ఎకరాల విస్తీర్ణంలో టెంట్ సిటీ ఏర్పాటు చేశారు. ఈ టెంట్ సిటీ ఏర్పాటుకు సుమారు రూ.71లక్షలు ఖర్చుచేశారు. పుష్కరాలకు వచ్చే భక్తులు బస చేసేందుకు ఈ టెంట్ సిటీ మే 10 నుండి 31 వరకు అందుబాటులో ఉంటుందని దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖ తెలిపారు. ఇందులో వసతి కోసం పురుషులు, మహిళల కోసం వేర్వేరు డార్మిటరీలు ఏర్పాటు చేశారని కొండా సురేఖ తెలిపారు. ప్రతి డార్మిటరీలో 100 పడకలు, 80 కూలర్లు, ఫ్యాన్లు, లైట్లు, మెత్తని మంచాలు, బెడ్‌షీట్లు, దిండు, మంచినీటి సౌకర్యం, సిసిటీవి, గార్డెన్, భోజన సౌకర్యం, అటాచ్డ్ టాయిలెట్లు, కార్పెట్ ఫ్లోరింగ్ ఉన్నాయన్నారు. అలాగే బస కోసం 40 స్వతంత్ర టెంట్లు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రతి టెంట్లో క్వీన్ సైజ్ బెడ్, జోధ్పురి, చికూల్ ల్యాంపులు, మెత్తని మంచాలు, దిండు, క్విల్ట్, కుర్చీలు, రైటింగ్ టేబుల్, ఎసితో ఇతర సదుపాయాలు ఉన్నాయన్నారు. పారిశుధ్యం కోసం ప్రతి లింగానికి 10 శౌచాలయాలు, 10 వాష్రూములు ఏర్పాటు చేయబడ్డాయి. ఇవి ఎఫ్‌ఆర్‌పి మెటీరియల్తో నిర్మించబడ్డాయి, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు ఉన్నాయి. ప్రతి 10 శౌచాలయాలకు ఒక క్లీనర్, ఒక అటెండెంట్‌ను నియమించారు. భోజన సదుపాయాలు కోసం డైనింగ్ ఏరియా కూడా ఏర్పాటు చేశారు. ఇందులో రౌండ్ టేబుల్, బ్యాంక్వెట్ కుర్చీలు, డెకరేటివ్ లైటింగ్, ఎసితో కూడిన డైనింగ్ ఏరియా ఏర్పాటు చేయబడింది.
భక్తుల సౌకర్యార్థం సరస్వతి పుష్కరాల కోసం ప్రత్యేక మొబైల్ యాప్, వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ టెంట్ సిటీ భక్తులకు సౌకర్యవంతమైన వసతి, భోజన, పారిశుధ్య, ఇతర అవసరమైన సదుపాయాలను అందించేందుకు ప్రత్యేకంగా రూపొందించబడింది. భక్తులు ముందుగా బుకింగ్ చేసుకోవడం ద్వారా ఈ సదుపాయాలను పొందవచ్చు.

### భూమి మనిషి జీవితంలో

# ఒక భావోద్వేగ బంధం

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** భూమి అనేది మనిషి జీవితంలో ఒక ఎమోషనల్ అటాచ్మెంట్. ఇది కేవలం ఆస్తి మాత్రమే కాదు, తరతరాలుగా మన సంస్కృతి, జీవన విధానాలతో ముడిపడి ఉంది. అని మంత్రి సీతక్క అన్నారు కుంటాల మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన భూభారతి చట్టం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ భూమికి సంబంధించిన సమస్యలు తరచుగా కుటుంబాలలో చిచ్చు రేపుతున్నాయి. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ భూమిని తమ ఆస్తిగా భావిస్తారు. అందుకే భూమికి సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది అని తెలిపారు. ఈ చట్టం ద్వారా భూమికి సంబంధించిన అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ముఖ్యంగా, పేద రైతుల భూములను కాపాడటం, వారికి న్యాయం చేకూర్చడం ఈ చట్టం యొక్క ప్రధాన లక్ష్యం అని ఆమె వివరించారు. అంతేకాకుండా భూమికి సంబంధించిన రికార్డులను డిజిటలైజ్ చేయడం ద్వారా పారదర్శకతను పెంచడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీని ద్వారా భూమికి సంబంధించిన మోసాలను అరికట్టవచ్చు అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.


**తెలంగాణ ప్రభుత్వ ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం**

No.04/EE PH/SRD/2025-26 తేదీ: 15.05.2025

బొల్లారం మున్సిపాలిటీలో TUFIDC లోన్ అసిస్టెన్స్ కింద 01 పని సంఖ్య (సిసి రోడ్) NIT. నం. 14 /EE/PH/SRD/బొల్లారం/TUFIDC/సిసి రోడ్/DB/T1/2025-26 కోసం అభివృద్ధి పనుల కోసం టెండర్ నోటీసు ఆహ్వానించబడింది. హైదరాబాద్‌లోని సంగారెడ్డి డివిజన్‌లోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పిహెచ్) నుండి రూ.0.5 కోట్లు ఖర్చవుతుంది. టెండర్లు 19.05.2025 ఉదయం 11 గం.ల నుండి 26.05.2025 సాయంత్రం 5 గం.ల వరకు షెడ్యూల్ చేయబడ్డాయి; వివరాల కోసం https://tender.telangana.gov.in ని సందర్శించండి.

Sd/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పిహెచ్)
ప్రజారోగ్యం, డివిజన్, సంగారెడ్డి

DIPR R.O.No:1953-PP/CL/ADVT/1/2025-26 Date: 16-05-2025



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ కలెక్టర్, జనగాం గారి ప్రకటన
ఫారం-7
(Declaration) రూఢీ ప్రకటన
(చూడుము సబ్ రూల్ 1, రూల్-25, సెక్షన్-19 (1) చట్టం-30/2013)

జిల్లా కలెక్టర్, జనగాం గెజిట్ నెం.LA/JN 19/2025 తేది: 08.05.2025
జిల్లా కలెక్టర్, జనగాం ఫైల్. నెం.G1/416 /2024 తేది: 05.05.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఫైల్. నెం.B/335/2024 తేది: 21.03.2025

జనగాం జిల్లా, రఘునాథపల్లి మండలములోని, అశ్వరావ్ పల్లి గ్రామములో ఈ క్రింద అనుబంధంలో చూపబడిన ఎ.1-08 గుంటల భూమి ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా వ్యవసాయ భూములకు సాగునీరు అందించుటకు గాను జె.చొక్కారావ్ దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ క్రింద గండిరామారం ట్యాంక్ యొక్క హై లెవెల్ కుడి ప్రధాన కాలువకు డిస్ట్రిబ్యూటరి 6L కాలువ కి.మీ.0.000 నుండి 0.5400 T.E. వరకు నిర్మాణం నిమిత్తం తెలంగాణ ప్రభుత్వము, జిల్లా కలెక్టర్, జనగాం వారి ద్వారా భూసేకరణ చట్టం-30/2013 ప్రకారము సేకరించుటకు నిర్ణయించినారు.

కావున పైన తెలిపిన ప్రాజెక్టులోని D-6L/HRMC కాలువ నిర్మాణము కొరకు, జనగాం జిల్లా, రఘునాథపల్లి మండలములోని, అశ్వరావ్‌పల్లి గ్రామములో ఈ క్రింద అనుబంధంలో చూపబడిన ఎ.1-08 గుంటల భూమిని సేకరించుటకు రూఢీ (Declaration) ప్రకటన జారీ చేయనైనది.

అనుబంధం

కెనాల్ పేరు: D-6L/HRMC కి.మీ.0.000 నుండి 0.5400 వరకు

| క్ర. సం. | సర్వే నెం. | పైటీ రకం | భూమి రకం తరి/మెట్ట | భూసేకరణ చేయు విస్తీర్ణము ఎ.గుం. | పట్టాదారు / అనుభవదారు | వృక్షములు/నిర్మాణములు, ఇంకావేమైనా |
|---|---|---|---|---|---|---|
| అశ్వరావ్‌పల్లి గ్రామము | | | | | రఘునాథపల్లి మండలము కి.మీ.0.000 నుండి 0.5400 వరకు | |
| 1 | 232 | పట్టా | మెట్ట | 1-08 | పిల్లి సాయిలు తండ్రి వీరయ్య, పిల్లి రమేశ్ తండ్రి వీరయ్య, పిల్లి లింగం తండ్రి వీరయ్య (0-35) | |
| | | బాట | మెట్ట | | బాట (0-01) | |
| | | పట్టా | మెట్ట | | పొట్లపల్లి అవినాష్‌రావు తండ్రి అమరేందర్‌రావు, పొట్లపల్లి మహేందర్‌రావు తండ్రి జగన్నాథరావు (0-13) | |
| | మొత్తము 1-08 | | | | | |

భూసేకరణ చట్టం,30/2013 లోని సెక్షన్ - 15 క్రింద ఇచ్చిన అభ్యంతరములను పరిశీలించిన పిదప ఇట్టి రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఇట్టి ప్రాజెక్ట్ నిర్మాణ భూసేకరణ ద్వార ఏ ఒక్క కుటుంబం కూడా పై గ్రామములో నిర్వాసితులు కావడము లేదు.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుపరాయి, స్లేట్, ఖనిజములు మరియు ఇతరములు ఇట్టి భూములలో లేదా భాగములో లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడదు. భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్, ఎల్.ఎ.-ఆర్&ఆర్, యూనిట్-I, ఇరిగేషన్ ప్రాజెక్టులు, జనగాం వారి కార్యాలయములో భూసేకరణకు సంబంధించిన భూముల ప్లానును కార్యాలయము పనిచేయు దినములలో తనిఖీ చేసుకోవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్, ఎల్.ఎ.-ఆర్&ఆర్, యూనిట్-I, నీటిపారుదల ప్రాజెక్టు, జనగాం
సం/- అదనపు కలెక్టర్, జనగాం
సం/- జిల్లా కలెక్టర్, జనగాం

DIPR RO NO. 96/LA/PP/Advt/Pub/2025-26

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శనివారం, మే 17

# ట్రంప్ వాదనకు ఏదీ జవాబు?

భారత్–పాకిస్థాన్‌ల మధ్య సైనిక చర్యలను నిలుపుచేసి కాల్పుల విరమణ సాధించటానికి తమ ప్రభుత్వం కృషి చేసిందని, కాల్పులు విరమించకపోతే వాణిజ్యం బంద్ చేస్తామని, నిలుపుచేస్తే వాణిజ్యం పెంచుతామని చెప్పామని, యుద్ధం కన్నా వాణిజ్యం మిన్న అని గ్రహించి రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. తాము మధ్యవర్తిత్వం వహించామనే మాటను వెనక్కి తీసుకున్నా, తమ ఒత్తిడివల్లనే కాల్పుల విరమణ జరిగిందనే బాణీని విడిచిపెట్టలేదు. ప్రస్తుతం పశ్చిమాసియా పర్యటనలో కూడా ఒకటికి రెండుసార్లు ఆయన అదే చెప్పారు. కాల్పుల విరమణకు భారత్–పాకిస్థాన్‌లు అంగీకరించినట్లు ఆ రెండు దేశాలకన్నా ముందు ట్రంప్ ప్రకటించటమే ఈ వ్యవహారంలో ఆయ న జోక్యాన్ని స్పష్టంగా సూచిస్తున్నది. అయితే షరతులేమిటి? టెర్రరిస్టు స్థావరాలను ధ్వంసం చేయటానికి పాకిస్థాన్ అంగీకరించిందా? టెర్రరిస్టులు భారత్ వ్యతిరేక ఉగ్రచర్యలకు తమ భూభాగాన్ని వినియోగించుకోకుండా నిరోధిస్తామని హామీ ఇచ్చిందా? పహల్గాం టెర్రరిస్టు దాడి సూత్రధారులను పట్టి అప్పగిస్తామని హామీ యిచ్చిందా? సరిహద్దు గ్రామాలకు జరిగిన నష్టానికి పరిహారం చెల్లిస్తానన్నదా? ఒప్పందం అంటే ఏవో కొన్ని అంగీకారాలు ఉండాలి కదా? లేదా ట్రంప్ చెప్పినట్లు వాణిజ్యం బుట్టలో పడేసిందా? ఇది మన దేశం సార్వభౌమత్వానికి సంబంధించిన విషయం. ఇరు దేశాల మధ్యనున్న సమస్యలను ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకుందామని భారత్–పాకిస్థాన్‌లు 1971లో సిమ్లా ఒప్పందంలో అంగీకరించిన అంశం చెల్లుబడిలో ఉన్నట్టా, లేనట్టా? ప్రభుత్వం ఎందుకు మౌనం పాటిస్తోంది.

కాల్పుల విరమణను ప్రభుత్వాలేకాదు, ప్రజలంతా స్వాగతించారు. మన సైన్యం యుద్ధ ప్రావీణ్యాన్ని మెచ్చుకుంటూ, సంఘీభావం ప్రకటిస్తూ బిజెపి ముందే తిరంగ ప్రదర్శనలు మొదలుపెట్టింది. పాకిస్థాన్‌ను చావుదెబ్బకొట్టి, ఆ ఖ్యాతిని మోదీ ఖాతాలో చేర్చి రాజకీయంగా లబ్ధిపొందే వ్యూహం ట్రంప్ జోక్యంతో నీరుగారినందున, తిరంగ యాత్రలతో ఆ నష్టాన్ని పూడ్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఇవి అఖిలపక్ష సంఘీభావ ప్రదర్శనలు కావు. రెండోవైపున, పహల్గాం టెర్రరిస్టు చర్యను, సైనిక చర్యను సాకుగా ఉపయోగించుకుని ద్వేష ప్రచార ముఠాలు కశ్మీరీయులకు, ముస్లింలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంతో రెచ్చిపోయారు. కొన్ని గుంపులు కశ్మీరీ విద్యార్థులపై దాడులు కూడా చేశాయి. చివరకు, ప్రభుత్వ విధానాన్ని మీడియాకు వివరించిన విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీని, ఆయన కుటుంబ సభ్యులను, ముస్లిం కావడంవల్ల కల్నల్ సోఫియా ఖురేషీని దుర్భాషలాడారు. పహల్గామ్‌లో టెర్రరిస్టులు హత్యచేసిన నౌకాదళ అధికారి వినయ్ నర్వాల్ భార్య, నవ వధువు హిమాన్షీ నర్వాల్ మత సామరస్యంకోసం విజ్ఞప్తి చేసినందుకు అంతకుముందే ఆమెపై విషం కక్కారు. ఈ ద్వేష ఫ్యాక్టరీలు తమ పెరడులోనివే అయినందువల్ల ప్రభుత్వం, పాలక పార్టీ వాటిని ఖండించలేదు, వాటికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోలేదు.

టెర్రరిజానికి వ్యతిరేకంగా ప్రభుత్వ పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపిన అన్ని ప్రతిపక్ష పార్టీలు, ట్రంప్ జోక్యం తదితర అంశాలు చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. రెండు అఖిలపక్ష సమావేశాల్లో పాల్గొనని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 12వ తేదీ రాత్రి 8 గంటలకు దేశ ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగంలో సైన్యాన్ని మెచ్చుకున్నారు; టెర్రరిజంపై యుద్ధం కొనసాగుతుందని ప్రకటించారు. కాని ప్రతిపక్షాలు, దేశ ప్రజల మనస్సులను తొలుస్తున్న అంశాలను నివృత్తి చేయలేదు. భారత్–పాకిస్థాన్ ద్వైపాక్షిక సమస్యలో ట్రంప్ జోక్యాన్ని అవుననిగాని, కాదనిగాని ప్రస్తావించలేదు. సిమ్లా ఒప్పందం జోలికి వెళ్లలేదు. కనీసం ట్రంప్ ప్రభుత్వానికి నిరసన లేఖ పంపలేదు. కశ్మీర్ విషయంలో భారత్ వైఖరిలో మార్పు లేదని అధికార ప్రతినిధి ప్రకటించటం మినహా ప్రధాని నోటినుంచి ఆ మాట రాలేదు. ఇది అమెరికా జోక్యం లేదా మధ్యవర్తిత్వంతో తెరవెనుక ఏదో జరిగిందన్న సందేహాలకు తావిస్తున్నది. కాబట్టి ఈ సమస్యను కూలంకషంగా చర్చించేందుకు పార్లమెంటు సమావేశం కోసం ప్రతిపక్షాల డిమాండ్ సమంజసమైంది. పార్లమెంటు చర్చకు ప్రధానమంత్రి ముక్తసరి, ఏకపక్ష మీడియా ప్రసంగం ప్రత్యామ్నాయం కాదు. ఈలోపు విద్వేష సోషల్ మీడియాను, యుద్ధోన్మాద ప్రసారాలు చేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియాను నియంత్రించాలి.

# కులగణన : మోదీ ప్రభుత్వంపై కన్నేసి ఉండాలి...


రాం పునియాని

2024 ఎన్నికల సమయంలో ముఖ్యంగా రాహుల్‌గాంధి కులగణన అవసరం గూర్చి మాట్లాడారు. అనేక మంది ప్రతిపక్ష నాయకులు దాన్ని బలపరిచారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు, ఎన్‌డిఎ పాలనలోని బిహార్ కూడా కులగణన నిర్వహించాయి. ఆ ఎన్నికల్లో ప్రతిపక్షం కొంతమేరకు కోలుకోవటంలో కులగణన ఒక ప్రధానాంశంగా ఉపకరించింది.

కులగణన పట్టణ నక్సల్స్ ఆలోచనలో భాగమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దాన్ని సంపూర్ణంగా తిరస్కరించారు. వారి మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ దాన్ని హిందూ సమాజాన్ని విభజించే పన్నాగంగా వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో, మోదీ క్యాబినెట్ ఏప్రిల్ 30న, రానున్న జనాభా లెక్కల సేకరణలో కులగణనను చేర్చాలని నిర్ణయించింది. (ఏప్రిల్ 22న పహల్గాంలో టెర్రరిస్టులు హిందూ టూరిస్టుల ను ఏరి కోరి 26 మందిని తుపాకులతో కాల్చిచంపిన ఘోరం దేశ ప్రజల ఆలోచనను కలవరపెడుతుండగా, కేంద్ర మంత్రివర్గ సమావేశం 'ఏమి ప్రతి చర్య' నిర్ణయిస్తుందోనని ఉత్కంఠతో ఎదురుచూస్తుండ గా అది కులగణన నిర్ణయం తీసుకోవడం గమనించదగింది–సం). 2021లో నిర్వహించాల్సిన సెన్సెస్ ఏదోక కారణంతో వాయిదా పడుతూ వచ్చింది. ఈ సమయంలో కులగణనకు అనుకూలంగా బిజెపి ఎందుకు నిర్ణయం తీసుకుందోనని పరిపరివిధాల ఊహాగానా లు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రానున్న బిహార్ అసెంబ్లి ఎన్నికల దృష్ట్యా ఈ నిర్ణయం చేసారన్న అభిప్రాయం వుంది. అయితే కులగణన చేబట్టేందుకు, దాని నిర్ధారణలు విధానంగా మార్చేందుకు కాలనిర్ణయ ప్రకటన వెలువడలేదు. బిహార్ ఎన్నికల ఒత్తిళ్లు, భవిష్యత్‌లో ఇతర ఎన్నికలు ఇందుకు కారణం కావచ్చు. రాహుల్‌గాంధీ నినాదం కులగణన చేబట్టటం, రిజర్వేషన్స్‌లో 50 శాతం సీలింగ్ ఎత్తివేయటమన్నది స్పష్టం. ఇది ఓటర్లలోని గణనీయమైన భాగాల్లో సానుకూల ప్రభావం కలుగజేసింది. అందువల్ల, సామాజిక న్యాయా న్ని ఆమూలాగ్రం వ్యతిరేకించే ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి ఇందుకు ఉపక్రమించి ఉండవచ్చు.

గత రెండు శతాబ్దాల్లో దళితుల్లో చైతన్యం కలుగజేసినవారు జ్యోతిరావు ఫూలె, ఆ తర్వాత భీంరావు అంబేద్కర్. సామాజిక న్యాయంకోసం దళితుల్లో పెరుగుతున్న చైతన్యాన్ని వ్యతిరేకించేందుకే ఆర్‌ఎస్‌ఎస్ ప్రధానంగా ఆవిర్భవించింది, వ్యవస్థాపితమైంది.

దళిత చైతన్యం తలెత్తటం అగ్రవర్ణానికి ఇబ్బందిగా తయారైంది. వారు హిందూ జాతి సిద్ధాంతంతో ముందుకు వచ్చారు. వారి సామాజిక విలువలకు ప్రధాన మార్గదర్శి మనుస్మృతి అని కచ్చితంగా చెప్పవచ్చు. ఆర్‌ఎస్‌ఎస్ రెండవ సర్‌సంఘ్‌చాలక్ ఎంఎస్ గోల్వాల్కర్ మనువు సూత్రాలు చాలా ప్రాచీనమైనవని, ప్రస్తుత కాలంలో వాటిని ఆచరించటం అవసరమని కొనియాడారు. గాంధీ ముఖ్యంగా 1932 తర్వాత, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా తమ అగణిత కృషి ప్రారంభించారు. గ్రామగ్రామానికీ వెళ్లారు – బహిరంగ ప్రదేశాల్లోకి, దేవాలయాల్లోకి, మంచినీటి వసతుల్లోకి దళితులను ప్రవేశింపజేశారు. ఆర్‌ఎస్‌ఎస్ అటువంటి ప్రయత్నం ఏదీ చేయలేదు, కులం, లింగ నిమ్నోన్నతాల్లో తమ స్వయంసేవక్‌లు, ప్రచారక్‌లకు శిక్షణ ఇస్తూ ఉండింది.

ఆర్‌ఎస్‌ఎస్ గొప్పగా ఆరాధించే సావర్కార్ కులవ్యవస్థకు వ్యతిరేకంగా కొంత ప్రయత్నం చేశారు. అయితే అది గాఢత సంతరించుకోలేదు. బ్రిటిష్ పాలనకు విధేయతతో కూడిన ఆయన రాజకీయంలో ఆ ప్రయత్నాలు కొద్దికాలంలోనే అదృశ్యమైనాయి. భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తూ ఆయన మనుస్మృతి నేటి చట్టం అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వాణి ఆర్గనైజర్ – భారత రాజ్యాంగ మనుస్మృతిని విస్మరించినందున, అందులో భారతీయత ఏమీ లేదని వ్యాఖ్యానించింది.



ఆరంభంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన పునాది అగ్రవర్ణ బ్రాహ్మణ–వర్తక కులాలు. కుల, లింగ నిమ్నోన్నతాల్లో విశ్వాసమున్న ఇతర అగ్రవర్ణాలు కూడా ఆర్‌ఎస్‌ఎస్ బలపరిచాయి.

అయితే కాలక్రమంలో ఎన్నికల ఒత్తిళ్లతో హిందూత్వ శక్తులు తమ గూటిలోకి దళితులు, ఆదివాసీలు, ఒబిసిలను చేర్చుకునేందుకు ఉద్దేశపూర్వకంగా కృషి చేశారు. హిందూ జాతీయవాద రాజకీయాల్లోకి దళితులను రాబట్టేందుకు వారి మధ్య పనిచేసేందుకై 'సామాజిక్ సంరస్త మంచ్' (సామాజిక సామరస్య వేదిక)ని వారు ఏర్పాటు చేశారు. కులాన్ని హిందూ సమాజానికి గొప్ప దోహదకారిగా కొనియాడుతూ వివిధ జాతులను కొనియాడారు. వారు ప్రచురించిన చరిత్ర పుస్తకాలు తక్కువ కులాలను తమ గూటిలోకి ఆకర్షించే ప్రకటనగా వివిధ జాతుల 'గొప్పతనాన్ని' కొనియాడాయి. హిందూ చర్మకార్‌జాతి, హిందూ వాల్మీకి జాతి, హిందూ కటిక జాతి సంపుటాలను ఆర్‌ఎస్‌ఎస్ ఛీఫ్ మోహన్ భాగవత్ విడుదల చేశారు. అన్ని కులాలు సమానం అని ఆయన అన్నారు. వారు ఈ కులాల నుంచి ధ్రువతారలను కూడా గుర్తించి హిందూ సమాజానికి గొప్ప వీరులుగా వారిని చిత్రించి, వారు ముస్లిం వ్యతిరేకులన్న అభిప్రాయం కలుగజేశారు. రాజా సుహెల్ దేవ్ ఈ వ్యూహానికి ఉదాహరణ. పాసి కులానికి చెందిన సుహెల్ దేవ్‌ను దళితులను ఆకర్షించటానికి వాడుకున్నారు. వారితో సహపంక్తి భోజనాలు చేశారు. 'సాంస్కృతికీకరణ' లో దాన్ని భాగం చేశారు. క్రమంగా దళితుల్లో కార్యకర్తల్ని తయారు చేసుకున్నారు.

ఇతర అనేక వ్యూహాలు అనుసరించారు. ముస్లింలు హిందూ సమాజానికి వ్యతిరేకులని, వారిని బుజ్జగించని పార్టీ బిజెపి ఒక్కటేనని దళితుల్లో ప్రచారంలో పెట్టారు. దళితులను ఆర్‌ఎస్‌ఎస్ శాఖల్లోకి తీసుకుని, చాలామందికి ముఖ్యమైన బాధ్యతలిచ్చారు. దళిత నాయకుల్లో కొందరిని – రాంవిలాస్ పాశ్వాన్, రాందాస్ అథవాలె వంటివారిని అధికార పదవులు, వనరులతో ఆకట్టుకున్నారు. తాను మోదీకి హనుమంతుడినని చిరాగ్ పాశ్వాన్ (రాంవిలాస్ పాశ్వాన్ కుమారుడు, ఎం.పి.) ప్రకటించుకున్నా డు.

మండల్ కమిషన్ అమలు ఆర్‌ఎస్‌ఎస్–బిజెపికి, వాటి సామాజిక న్యాయానికి పరీక్ష పెట్టింది. అగ్రవర్ణాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. వారిలో ఒకరు ఆత్మహననం చేసుకున్నారు కూడా. దాన్ని బహిరంగంగా వ్యతిరేకించటం తమ ఎన్నికల ప్రయోజనాలకు చేటు అని ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిలకు తెలుసు. వారి నోటితో వ్యతిరేకించలేదు. మండల్‌కు వ్యతిరేకంగా కమండల్ (రామాలయం)తో పెద్ద ఉద్య మం నడిపారు. అగ్రవర్ణాలను ఏకత్రాటిపైకి తెచ్చారు. అది వారి ఎన్నికల విజయాలకు దారితీసింది. ఒంటెత్తువాద రాజకీయాలకు ఎన్నికల్లో తోడ్పాటు చకచకా పెరిగిపోయింది.

అగ్రవర్ణాల ప్రయోజనాలను దెబ్బతీసే కులగణనను వారిప్పుడు ఏ విధంగా పరిష్కరిస్తారో ఆసక్తితో గమనించదగింది. తాము ఎంచుకున్న పార్టీ కులగణన చేబట్టే అంశం అగ్రవర్ణాల్లో ఆగ్రహ కారణమవుతున్నది. దేశ సామాజిక, రాజకీయ వ్యవస్థలోకి ఆర్‌ఎస్‌ఎస్ లోతుగా పాదుకుందని అందరికీ తెలుసు. ఒబిసి సెన్సెస్‌ను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించరాదని అది ఇప్పటికే చెప్పింది. కులగణనకు నోటిమాటగా తోడ్పాటిస్తూ, సామాజిక న్యాయం దిశగా ప్రయాణాన్ని నిలుపుచేయగలిగిన సరికొత్త భాష రూపొందించగల సామర్థ్యం దానికుంది.

భారత రాజ్యాంగంపట్ల గాఢమైన నిబద్ధత కలిగిన రాజకీయ పార్టీలన్నీ సామాజిక న్యాయం ఎజండాను బలపరిచేందుకు ఒకే వేదిక మీదకు రావాల్సిన సమయమిది. న్యాయమైన, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణం కోసం కులగణన ఫలితాలను నిజాయితీతో అమలు చేయటాన్ని ప్రాధాన్యత ప్రాతిపదికపై చేబట్టటం అవసరం.

# స్కానింగ్ సెంటర్ల దోపిడీకి అడ్డుకట్ట వేయండి

లేఖ

రాష్ట్రవ్యాప్తంగా స్కానింగ్ సెంటర్లు, వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు అమాయక ప్రజలను నిట్ట నిలువునా ముంచుతూ కోట్లాది రూపాయలను బహిరంగ దోపిడీ చేస్తూ వున్నారు. మన రాష్ట్రంలోని నగరాలలో, పట్టణాలు, మండలాలలో వీరి అవినీతికి అడ్డు అదుపు లేదు. వివిధ సీజన్‌లలో ప్రజలు ముఖ్యంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పేరు పొందిన జనరల్ మెడిసిన్ యం.డి డాక్టర్ లను ఆశ్రయించడంతో ప్రతీ వైద్యుడు ఆ రోగిని పరీక్షించి అన్ని రకాల పరీక్షలు చేయాలని తమకు అనుకూలంగా వున్న ప్రైవేట్ ల్యాబులుకి పంపుతూవున్నారు. ఇదే అదనుగా భావించి నిబంధనలకు విరుద్ధంగా అధికంగా డబ్బులు వసూలు చేస్తూ అటు డాక్టర్లకు తమ తమ ల్యాబుల నుండి కమీషన్ పంపుతూ వున్నారు. పరీక్షలో ఎలాంటి వ్యాధి లక్షణాలు లేకున్న కనీసం అయిదు వందల నుండి రెండు వేల రూపాయల మందులు రాస్తూ అటు మెడికల్ షాపుల ఆదాయాన్ని కూడా పొందుతూ వున్నారు. కొన్ని ల్యాబ్‌లలో వివిధ పరీక్షలు నిర్వహిస్తే రక్త కణాలు ప్లేట్‌లెట్స్ సంఖ్య తక్కువగా ఉన్నట్లు మరికొన్ని పెద్ద ఆసుపత్రులలో పరీక్షలు చేపిస్తే రక్త కణాలు అధికంగా వున్నట్లు ల్యాబ్ రిపోర్టులు వస్తూ వున్నాయి. ఆయా ల్యాబ్ లలో వానిని చూసి నిర్ధారించే పాథాలజీ డాక్టర్లు, మరియు ల్యాబ్ టెక్నీషియన్ లు ప్రామాణికంగా నిర్ధారణ చేయకుండానే రిపోర్టులు ఇస్తూ వున్నారనే ఆరోపణలు వినవస్తూ వున్నాయి. సర్కారు ఆదేశాలను తుంగలో తొక్కి వారు రోగుల్లో భయాన్ని కల్గిస్తూ అక్రమంగా అందిన కాడికి దోచుకుంటూ వున్నారు. అవసరం లేకున్నా డాక్టర్లు స్కానింగ్ తప్పనిసరని రోగులను కోరుతూ బలవంతంగా చేయిస్తూ వున్నారు. అయితే ఈ దోపిడీ పర్వంపై, ప్రజల ఇబ్బందులపై గతంలో అధికారులు స్కానింగ్ సెంటర్ నిర్వాహకులతో చర్చలు జరిపి ఫీజు తక్కువ చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆ ఆదేశాలను సైతం తుంగలో తొక్కుతున్నారు. నియమ నిబంధనలనుసైతం పెడచెవినపెడుతూ స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లను నిర్వహిస్తున్నారు. కనీసం రిసిప్ట్ కూడా ఇవ్వకుండా ముక్కుపిండి మరీ బిల్లులు వసూలు చేస్తున్నార నే ఆరోపణలు వస్తూ వున్నాయి. కోట్లాది రూపాయలు సంపాదిస్తూ అటు ప్రభు త్వం ఇటు ప్రజలను అధికారులను మోసం చేస్తున్న స్కానింగ్ సెంటర్లపై అధికారుల పర్యవేక్షణ తూతూ మంత్రంగా కనబడుతుంది. అన్ని జిల్లాలలో, పట్టణ కేంద్రాలలో వున్న స్కానింగ్ సెంటర్స్, ప్రైవేట్ ల్యాబ్‌లపై సంబంధిత అధికారులు దాడులు నిర్వహించి ఈ మోసపూరిత వ్యాపారానికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఎంతో వుంది.

కామిడి సతీశ్ రెడ్డి

# అబద్ధాలలో మేటి బిజెపి ప్రభుత్వం

కృష్ణ ఝా

కోవిడ్19 మరణాలకు సంబంధించి కేంద్రం తప్పుడు సమాచారం అందించి తప్పుదోవపట్టించిందని తాజా గణాంకాలు వెల్లడించాయి. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కొత్త కోవిడ్ మరణాల డేటా మహమ్మారి సమయంలో భయపడిన దానిని నిర్ధారించే విధంగావుంది. ప్రభుత్వం వైపు నుంచి భారీ నిర్వహ ణ లోపం ఉన్నట్లు మే 7వ తేదీన విడుదలైన పౌర నమోదు వ్యవస్థ (సీఆర్‌ఎస్) నివేదిక స్పష్టంచేసింది. కోవిడ్ మహమ్మారి ప్రారంభమైన 2020సంవత్సరంతో పోలిస్తే మహమ్మారి తీవ్రం గా విజృంభించిన 2021 ఏడాదిలో మృతుల సంఖ్య దాదాపు 21 లక్షలు ఎక్కువగా నమోదయ్యాయని సిఆర్‌ఎస్ నివేదిక వెల్లడించింది. కోవిడ్19 మరణాలకు సంబంధించి ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన సంఖ్య కన్నా ఇది దాదాపు ఆరు రెట్లు అధికం. కోవిడ్‌తో 2021 సంవత్సరంలో 3.32 లక్షల మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయినట్టు కేంద్ర ప్రభుత్వం అప్పట్లో అధికారికంగా ప్రకటించింది. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తన బాధ్యతలను ఏవిధంగా నేరపూరితంగా నిర్లక్ష్యం చేసిందో సిఆర్‌ఎస్ నివేదిక కళ్లకు కట్టినట్టు చూపింది. మానవ ప్రాణాలను కాపాడామని మోదీ ప్రభుత్వం డాంబికాలు పలికినప్పటికీ కోవిడ్ నిర్వహణలో దారుణంగా ఎలా విఫలమైంది మరోసారి స్పష్టమైంది. కోవిడ్ మహమ్మారికి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్యను అంచనావేసి వాస్తవాలు మాట్లాడే వారి నోరునొక్కివేసినట్టు కూడా తేటతెల్లమైనది.

మరణాల సంఖ్యకు సంబంధించి వివిధ రకాలుగా చెప్పి గందరగోళపరచడంలో మోదీ ప్రభుత్వ దురుద్దేశాలను తాజా నివేదిక బయటపెట్టింది. నిరాటంకంగా హిందూత్వపాలన సాగించాలన్న తన అజెండాకు కరోనా మృతుల సంఖ్య అడ్డంకిగా ఉన్నందునే వాస్తవ సంఖ్యలను తొక్కిపెట్టిందని స్పష్టమౌతోంది. లేకుంటే మోదీ ప్రభుత్వం, దాని మద్దతుదారులు తాజా నివేదిక ప్రాతిపదిక లేదా ఆ నివేదిక వచ్చిన ముగింపును వివాదం చేసేవారు. కరోనా మృతుల సంఖ్యను తక్కువ చేసి చెప్పడం ద్వారా యావత్ జాతినేకాకుండా ప్రపంచాన్నే తప్పుదోవ పట్టించిందన్న అపప్రదను మోదీ ప్రభుత్వం మూటకట్టుకుంది. దేశ జిడిపి విషయమే ఇందుకు పెద్ద ఉదాహరణ. మొదటిది చెడు వార్తలను పాతిపెట్టడం అయితే, రెండోది శుభవార్త ప్రతిరూపా న్ని ప్రదర్శించడం. అయితే, మోదీ ప్రభుత్వం తన ముందు పాలకుల కంటే మెరుగ్గా వ్యవహరించినట్టు ప్రచారం చేసుకునేందుకు పూర్తిగా శ్రమించింది. ఇది ఒక తెలివైన వ్యూహం, దీనిని సగటు ఓటరు మాత్రమే కాకుండా, ఒక నిర్దిష్ట విజయాన్ని చాటుకునే ఆధిపత్య మీడియా కథనం ద్వారా తీసుకున్న నిపుణులు కూడా తరచుగా పట్టించుకోరు.

దేశంలో కరోనా మహమ్మారికి ప్రాణాలు కోల్పోయిన వారి అధికారిక సంఖ్య 2025 మే నాటికి 5,33,665. అయితే, ఈ సంఖ్య మహమ్మారిలో వాస్తవ మరణాల సంఖ్య తగ్గుదల కంటే స్వల్పంగా అధికం. ఇటీవల, ప్రభుత్వం మరణానికి కారణాన్ని నిర్ధారించే వైద్య ధృవీకరణ నివేదిక, 2021ను విడుదల చేసింది, దీని ప్రకారం 2021లోనే మొత్తం మరణాలు మహమ్మారికి ముందు స్థాయిలతో పోలిస్తే 21లక్షలకు పైగా పెరిగాయి. అయితే, అందులో 5 లక్షల మరణాలు మాత్రమే కోవిడ్ మహమ్మారి సంబంధిత మరణాలని అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి. మహమ్మారి సంబంధిత మరణాలను దేశవ్యాపితంగా తక్కువ చేసి చూపించారని నివేదికలు ఘోషిస్తున్నాయి. మహమ్మారి ప్రారంభమైనప్పటి నుంచి దేశంలో కోవిడ్ మరణాలు 2021లో నమోదైన అదనపు మరణాలలో 5.2 శాతం మాత్రమే. సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్‌ఎస్) డేటా అనేది మహమ్మారి సమయంలో సంభవించిన మరణాల సంఖ్య ఎంత తక్కువగా ఉందో తెలిపే మొదటి అధికారిక గణాంకం. రాష్ట్రాల వారీగా మారుతూ ఉండే ఈ వ్యత్యాసం, వాస్తవ కోవిడ్19 మరణాల సంఖ్య గురించి అనిశ్చితిని కూడా సృష్టిస్తోంది, ఇది అధికారిక గణాంకాల కంటే చాలా ఎక్కువగా ఉందని ఇప్పుడు వెల్లడైంది. మహమ్మారి కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఎందరో సంఖ్య అధికారిక గణాంకాలలో కనిపించకుండా పోయింది. మహమ్మారి కారణంగా లక్షలాది మరణించినప్పటికీ కొన్ని రాష్ట్రాలు ప్రధానంగా ఉత్తర, పశ్చిమ రాష్ట్రాలు అధికారిక మరణాల సంఖ్య తక్కువగా పేర్కొంది.

> దేశంలో కరోనా మహమ్మారి బారినపడి ప్రాణాలు కోల్పోయిన వారి అధికారిక సంఖ్య 2025 మే నాటికి 5,33,665. అయితే, ఈ సంఖ్య మహమ్మారిలో వాస్తవ మరణాల సంఖ్య తగ్గుదల కంటే స్వల్పంగా అధికం. ఇటీవల, ప్రభుత్వం మరణానికి కారణాన్ని నిర్ధారించే వైద్య ధృవీకరణ నివేదిక, 2021ను విడుదల చేసింది, దీని ప్రకారం 2021లోనే మొత్తం మరణాలు మహమ్మారికి ముందు స్థాయిలతో పోలిస్తే 21లక్షలకు పైగా పెరిగాయి. అయితే, అందులో 5 లక్షల మరణాలు మాత్రమే కోవిడ్ మహమ్మారి సంబంధిత మరణాలని అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి.

ఒక సాధారణ, మహమ్మారిలేని సమయంలో దేశంలో ఏటా స్వల్పంగా 12 శాతం మాత్రమే పెరుగుతుంది. వృద్ధా ప్యం, జనాభా పెరుగుదల వంటి జనాభా మార్పుకారణంగా ఈ స్వల్ప శాతం పెరుగుదల కనిపిస్తుంది. అయితే, ఆరోగ సంరక్షణ చర్యలు మెరుగుదల, తగ్గుతున్న మరణాల రేటు ద్వారా ఇది భర్తీ అవుతుంది. 2021లో మరణాల పెరుగుదల రేటు ఆకస్మికంగా 26 శాతం పెరుగుదల అసాధారణమైనది. మహమ్మారి లేదా విపత్తులు వంటి అసాధారణ పరిస్థితులను ప్రతిబింబిస్తోంది. 2007, 2019 మధ్య, భారతదేశంలో సగటు వార్షిక మరణాలు 8.1మిలియన్ల నుంచి 8.6 మిలియన్ల వరకు ఉన్నాయి, సగటున సంవత్సరానికి 8.35 మిలియన్ (83.5 లక్షలు) మరణాలు సంభవిస్తున్నాయి. 2022లో విడుదలైన ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, 2020, 2021లో భారతదేశంలో "అదనపు" మరణాల సంఖ్య దాదాపు 47 లక్షలుగా ఉంది, ఇది ఆ రెండు సంవత్సరాలకు అధికారిక భారతీ య సంఖ్య 4.8 లక్షల కంటే దాదాపు 10 రెట్లు ఎక్కువ. దేశంలోని పెద్ద రాష్ట్రాలలో మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలలో తక్కువ లెక్కింపు జరిగింది. ఆ ప్రాంతాలలో, నివేదించిన కోవిడ్19 మరణాల సంఖ్య మహమ్మారి వల్ల సంభవించిన వాస్తవ ప్రాణనష్టంలో ఒక భాగం మాత్రమే అధికారిక గణాంకాలలో చూపించారు. ఉదాహరణకు, మధ్యప్రదేశ్‌లో 2020తో పోలిస్తే 2021లో 1,78,000 మరణాలు పెరిగాయి. అయితే, కోవిడ్19 మరణాలు అధికారికంగా 10,788 మాత్రమేనని చూపారు. అంటే అధికారిక కోవిడ్19 మృతుల సంఖ్య మొత్తం అదనపు మరణాల కంటే దాదాపు 65 రెట్లు తక్కువ.

అదేవిధంగా ఉత్తరప్రదేశ్‌లో 2021లో 4,78,682 అదనపు మరణాలు నమోదయ్యాయి. అయితే, అధికారికంగా కోవిడ్ మహమ్మారి మరణాలు 23,743గా చూపించారు. ఈ వ్యత్యాసాలు కేసుల సంఖ్యను బాగా తగ్గించి చూపాయి. అవి కేసులను తక్కువచేసి చూపడం, పేలవమైన డాక్యుమెంటేషన్ అనే విస్తృత సమస్యను ప్రతిబింబింపచేస్తాయి. ముఖ్యంగా 2021లో కోవిడ్ రెండో వేవ్‌లో దేశంలోని అనేక ప్రాంతాలలో ఇదే పరిస్థితి చోటుచేసుకుంది.

ఈ దారుణమైన పరిస్థితిలో కేరళ అత్యంత ఆదర్శవంతం గా నిలిచింది. కోవిడ్ మరణాలకు సంబంధించి తన నివేదికలో అత్యంత కచ్చితత్వాన్ని ప్రదర్శించింది. 2021లో రాష్ట్రంలో మరణాలలో గణనీయమైన పెరుగుదల కనిపించింది, 3,39, 648 మరణాలు సంభవించాయి, 2020తో పోలిస్తే ఇది 35.3 శాతం పెరుగుదల. కోవిడ్ వల్ల మరణించిన వారి మొత్తం సంఖ్య 72,139. దీని అర్థం మొత్తం అదనపు మరణాలలో కోవిడ్19 మరణాలు గణనీయమైన వాటాను కలిగి ఉన్నాయి, ఇది 2021లో జరిగిన మరణాలలో 21.2 శాతంగా ఉంది.

# భారత ఆర్థిక ప్రయాణానికి దిక్సూచి...కొనుగోలు నిర్వాహకుల సూచీ రహస్యం!

మన ఆర్థిక వ్యవస్థ ఎలా ముందుకు సాగుతోంది? మనం సరైన దారిలోనే ఉన్నామా? సామాన్యుడి జీవితంలో మార్పులు వస్తున్నాయా? ఇలాంటి ప్రశ్నలు మన మదిని తొలుస్తూనే ఉంటాయి. అయితే, ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే ఒక ముఖ్యమైన 'ముందస్తు సంకేతం' ఉందంటే మీరు నమ్ముతారా? అదే 'కొనుగోలు నిర్వాహకుల సూచీ' (పిఎమ్‌ఐ)! ఇది కేవలం ఒక సంఖ్య కాదు, మన ఆర్థిక ఆరోగ్యాన్ని ముందుగానే చెప్పే ఒక రహస్యమైన గొంతు.

**పిఎమ్‌ఐ అంటే ఏమిటి? దాని వెనుక ఉన్న మ్యాజిక్ ఏమిటి?**

ఈ సూచీని అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇది ఒక సర్వే లాంటిది. వ్యాపారాల్లో వస్తువులు కొనే ముఖ్యమైన వ్యక్తుల (కొనుగోలు నిర్వాహకులు) అభిప్రాయాలను సేకరించి లెక్కిస్తారు. ఒక స్కోరును ( సున్నా నుండి వంద వరకు). ఈ స్కోరును బట్టి ఆయా రంగాల్లో వ్యాపారం ఎలా ఉందో తెలుసుకోవచ్చు. ఒకవేళ స్కోరు 50 ఉంటే, వ్యాపారం నిలకడగా ఉందని అర్థం. ఎలాంటి పెద్ద మార్పులు లేవని సూచన. స్కోరు 50 కంటే ఎక్కువ ఉంటే, అద్భుతం! వ్యాపారం పుంజుకుంటుందని, అంతా సానుకూలంగా ఉందని సంకేతం. ఆర్థిక చక్రం వేగంగా తిరుగుతోందని చెప్పవచ్చు. ఒకవేళ స్కోరు 50 కంటే తక్కువగా ఉంటే మాత్రం కాస్తంత ఆందోళన చెందాలి. వ్యాపారం మందగిస్తోందని, ఆర్థికంగా అంతంతమాత్రంగానే ఉందని అర్థం. ఈ కొలమానం ఒక రకంగా చెప్పాలంటే, మార్కెట్‌లోని వేడిని ముందుగానే పసిగట్టే ఒక 'థర్మామీటర్' లాంటిది. కొనుగోలు చేసే వ్యక్తులు మార్కెట్‌లోని మార్పులను తొందరగా గమనించగలరు కాబట్టి, వారి అభిప్రాయాలు ఆర్థికవేత్తలకు ఒక విలువైన సమాచారాన్ని అందిస్తాయి.

**ముందుచూపుతో నిర్ణయాలు:**

పిఎమ్‌ఐ ఎలా ఉపయోగపడుతుంది ! ఈ సూచీ ఎందుకంత ముఖ్యం అంటే, మన స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వంటి పెద్ద లెక్కలు బయటకు రాకముందే ఆర్థిక వ్యవస్థలో ఏం జరుగుతుందో ఇది చెబుతుంది. ఒక అడుగు ముందుగానే భవిష్యత్తును ఊహించే శక్తి దీనికి ఉంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా దీనికి అంత ప్రాధాన్యం. ఆర్థిక మార్పులను ముందుగానే గుర్తిస్తే ఏం లాభం అనుకుంటున్నారా? అప్పుడే అసలు విషయం ఉంది. ప్రభుత్వం ముందుగానే మేల్కొని, ఆర్థిక వ్యవస్థను కాపాడటానికి లేదా మరింతగా పెంచడానికి కావలసిన చర్యలు తీసుకోవచ్చు. వ్యాపారాలు తమ భవిష్యత్ ప్రణాళికలను మార్చుకోవచ్చు. సామాన్యుడి జీవితం కూడా ఈ మార్పుల వల్ల ప్రభావితమవుతుంది కదా! డబ్బులెక్కడ పెట్టాలి? వడ్డీ రేట్లు ఎలా ఉంటాయి? అనే ప్రశ్నలకు పిఎమ్‌ఐ చెబుతుంది. పెట్టుబడి పెట్టేవారికి, ఆర్థిక నిపుణులకు ఈ సూచీ ఒక దిక్సూచిలాంటిది. దేశ ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి, ఎక్కడ పెట్టుబడి పెట్టాలో ఒక స్పష్టమైన అవగాహనకు రావడానికి ఇది సహాయపడుతుంది. అంతేకాదు, బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచాలా లేక తగ్గించాలా అనే నిర్ణయాలు తీసుకోవడానికి కూడా ఈ సూచీ గణాంకాలను పరిశీలిస్తాయి. వ్యాపారాలు ఎంత ఉత్పత్తి చేయాలో, ధరలు ఎలా ఉండాలో కూడా దీని ఆధారంగానే నిర్ణయిస్తాయి.

**పిఎమ్‌ఐలో ఎన్ని రకాలు:**

పిఎమ్‌ఐ ముఖ్యంగా మూడు రకాలు ఉంటాయి. అవి

1) తయారీ రంగ పిఎమ్‌ఐ: ఫ్యాక్టరీల్లో వస్తువులు ఎలా తయారవుతున్నాయో ఇది చెబుతుంది. కొత్త ఆర్డర్లు వస్తున్నాయా, ఉత్పత్తి పెరుగుతోందా, ఎంతమందికి ఉద్యోగాలు ఇస్తున్నారు వంటి విషయాలను పరిశీలిస్తుంది

2) సేవల రంగ పిఎమ్‌ఐ: బ్యాంకులు, ఆసుపత్రులు, స్కూళ్లు వంటి సేవలు అందించే రంగాల పనితీరును ఇది అంచనా వేస్తుంది. ఇక్కడ వ్యాపారం ఎలా ఉంది, కొత్తగా ఎంతమంది వస్తున్నారు వంటి విషయాలు ముఖ్యం.

3) సంయుక్త పిఎమ్‌ఐ: ఈ రెండు రంగాల గణాంకాలను కలిపి, మన మొత్తం ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో ఒక అంచనాకు వస్తారు. ఏ రంగం ఎక్కువ ముఖ్యమో దానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.

దీని కోసం ప్రతి నెలా కొన్ని కంపెనీల నుంచి సమాచారం సేకరిస్తారు. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి, ఉద్యోగాలు, డెలివరీ సమయం, నిల్వలు వంటి విషయాలపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటారు. వచ్చిన సమాధానాలను బట్టి ఒక ప్రత్యేకమైన ఫార్ములా ఉపయోగించి ఈ సూచీని లెక్కిస్తారు.

**అన్ని లెక్కలూ కరెక్టేనా? పిఎమ్‌ఐకి పరిమితులు ఉన్నాయా?**


పిఎమ్‌ఐ చాలా ఉపయోగకరమైనది. అయినప్పటికీ కొన్నిసార్లు ఇది తప్పుదారి పట్టించవచ్చు. ఎందుకంటే, ఇది కొద్దిమంది అభిప్రాయాలపై ఆధారపడి ఉంటుంది. అందరి అభిప్రాయాలు ఇందులో ఉండకపోవచ్చు. కొనుగోలు చేసే వారి వ్యక్తిగత ఆలోచనలు కూడా దీనిపై ప్రభావం చూపవచ్చు. వాతావరణంలో మార్పులు లేదా ఇతర తాత్కాలిక సమస్యల వల్ల కూడా గణాంకాలు మారవచ్చు. ఇది ఎక్కువగా తయారీ, సేవల రంగాల గురించి మాత్రమే చెబుతుంది. వ్యవసాయం వంటి ఇతర ముఖ్యమైన రంగాల గురించి అంతగా చెప్పదు. అందుకే పిఎమ్‌ఐ ఒక్కదాన్నే నమ్ముకుంటే సరిపోదు. మన ఆర్థిక వ్యవస్థ యొక్క పూర్తి చిత్రాన్ని చూడాలంటే జిడిపి వంటి ఇతర ముఖ్యమైన లెక్కలను కూడా పరిశీలించాలి.

ప్రపంచవ్యాప్తంగా చాలా సంస్థలు ఈ సూచీలను తయారు చేస్తాయి. మన భారతదేశంలో అయితే హెచ్‌ఎస్బిసి ఇండియా అనే సంస్థ ఈ పని చేస్తుంది. వారు దాదాపు.400 తయారీ సంస్థలు, 400 సేవా ప్రదాత సంస్థలు, మొత్తం 800 కంపెనీల నుంచి ప్రతి నెలా సమాచారం సేకరిస్తారు. దీని ద్వారా మన దేశంలోని తయారీ, సేవల రంగాలు ఎలా పనిచేస్తున్నాయో తెలుస్తుంది.

మన ప్రభుత్వం కూడా పిఎమ్‌ఐని చాలా ముఖ్యమైన సూచికగా భావిస్తుంది. ఆర్థిక వ్యవస్థ ఏ దిశగా వెళ్తుందో తెలుసుకోవడానికి ఇది సహాయపడుతుంది. జిడిపి కంటే ముందే సమాచారం అందుతుంది కాబట్టి, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడానికి లేదా మంచి జరిగితే మరింత ప్రోత్సహించడానికి వీలు కలుగుతుంది.

చివరిగా చెప్పేది ఏంటంటే, కొనుగోలు నిర్వాహకుల సూచీ మన ఆర్థిక ప్రయాణంలో ఒక ముఖ్యమైన గైడ్ లాంటిది. ఇది మనకు విలువైన సమాచారం ఇస్తుంది. కానీ, కేవలం దీనినే నమ్ముకుంటే సరిపోదు. ఇతర ఆర్థిక లెక్కలను కూడా పరిశీలిస్తూ, అప్రమత్తంగా ఉంటేనే మనం మన ఆర్థిక లక్ష్యాలను చేరుకోగలం. ప్రస్తుతానికి ఈ సూచీ మంచి సంకేతాలే ఇస్తోంది. ఈ ఉత్సాహాన్ని నిలబెట్టుకుంటూ, ముందున్న సవాళ్లను అధిగమిస్తే మన భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుంది.

జనక మోహన రావు దుంగ
8247045230



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి డ్రగ్స్..

### పంజాబ్‌లో ముఠా అరెస్ట్.. కుట్ర భగ్నం

**అమృత్‌సర్ :** పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి డ్రగ్స్‌ను అక్రమంగా తరలిస్తున్న ముఠా పోలీసులకు పట్టుబడింది. విశ్వసనీయ సమాచారం మేరకు పంజాబ్ పోలీసులు నిఘా వేసి ముఠాను అదుపులోకి తీసుకున్నారు. కుట్రను భగ్నం చేశారు. వాళ్ల నుంచి భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏకంగా 85 కిలోల డ్రగ్స్‌ను పోలీసులు సీజ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ డ్రగ్స్ విలువ వందల కోట్లలో ఉంటుందని అంచనా వేస్తున్నారు. అమృత్‌సర్‌కు చెందిన అమర్‌జోత్ సింగ్ జోతా సంధూను ఈ కుట్రలో ప్రధాన నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ పాకిస్థాన్ స్మగ్లింగ్ ముఠాను యుకె నుంచి లల్లీ అనే వ్యక్తి నడిపిస్తున్నాడని చెప్పారు. అమర్‌జోత్ నివాసం డ్రగ్స్ సరఫరాకు ప్రధాన కేంద్రంగా మారిందని పోలీసులు వెల్లడించారు. పాకిస్థాన్ నుంచి వచ్చిన మాదక ద్రవ్యాలను అతడే దేశంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడని తెలిపారు. పాకిస్థాన్‌లోని ఐఎస్‌ఐ ఏజెంట్లతోనూ ఈ ముఠాకు సంబంధాలు ఉన్నాయని అన్నారు. ముఠా నుంచి మరిన్ని విషయాలు రాబట్టేందుకు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

# పాకిస్థాన్‌పై భారత్ చర్యలు ‘ట్రైలర్’ మాత్రమే...

### అవసరమైతే పూర్తి సినిమా చూపేందుకు రె‘ఢీ’

### కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

### భుజ్ వైమానికదళం స్టేషన్‌ను సందర్శించిన మంత్రి



**భుజ్ (గుజరాత్) :** భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణులు పాకిస్థాన్‌కు ‘రాత్రి చీకటిలో ఒక పగటివెలుగును చూపించాయి’ అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆయన శుక్రవారం గుజరాత్‌లోని భుజ్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌ను సందర్శించి వైమానిక యోధులను ఉద్దేశించి మాట్లాడారు. ‘ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, తుదముట్టించడం నవ భారతదేశానికి నూతనంగా సాధారణం అయ్యింది’ అని చురక అంటించారు. పాకిస్థాన్ విషయంలో ‘మా చర్యలు ఇప్పటివరకు కేవలం ట్రైలర్ మాత్రమే చూపాం. అవసరమైతే మేం పూర్తి సినిమా చూపిస్తాం’ అని హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణులను ఉపయోగించిన విషయాన్ని మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ధృవీకరించారు. ఇస్లామాబాద్‌కు ఒక స్పష్టమైన దృఢమైన సందేశాన్ని పంపిస్తూ సిందూర్ ఆపరేషన్ ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. ‘ప్రస్తుత కాల్పుల విరమణ అంటే పాకిస్థాన్ ప్రవర్తనను భారతదేశం పరిశీలనలో ఉంచింది’ అని అర్థం చేసుకోవాలని రాజ్‌నాథ్ చెప్పారు. ‘పాకిస్థాన్ దేశం ప్రవర్తనను మెరుగుపర్చుకుంటే చాలా మంచిదే. కానీ ఏదైనా ఆటంకం కలిగిస్తానంటే అత్యంత కఠినాతి కఠిన శిక్ష సమాధానంగా వారికి ఇవ్వబడుతుంది’ అని భారత రక్షణ శాఖ మంత్రి అత్యంత ఘాటుగా హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడికి బదులిస్తూ మే 7న ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారతదేశం పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లో పాకిస్థాన్‌కు చెందిన 9ఉగ్రవాద మౌలికసదుపాయాల స్థావరాలను నాశనం చేసింది. గతవారం భారత్ నాశనం చేసిన ఉగ్రవాద మౌలిక సదుపాయాలను పాకిస్థాన్ పునర్నిర్మించడం మళ్లీ ప్రారంభించిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.ఇస్లామాబాద్ పాకిస్థాన్‌లోని సాధారణ పౌరుల నుంచి సేకరించిన దాదాపు రూ.14కోట్ల డబ్బును జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ అధిపతి మసూద్ అజ్‌హర్‌కు ఇచ్చిందని ఆరోపించారు.

**పాకిస్థాన్‌కు సాయాన్ని ఐఎంఎఫ్ పునరాలోచించాలి : రాజ్‌నాథ్ సింగ్**

పాకిస్థాన్ దేశానికి ఒక బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని పునరాలోచించాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)కి భారత్ విజ్ఞప్తి చేసింది. ఇస్లామాబాద్ దానిని ఉగ్రవాద మౌలిక సదుపాయాలకోసం ఉపయోగించవచ్చని సూచించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇక్కడ సైనిక సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ఐఎంఎఫ్ ఇచ్చే నిధులను పాకిస్థాన్ లేదా మరే ఇతర దేశంలోనూ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను సృష్టించడానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉపయోగించాలని భారతదేశం కోరుకోవడం లేదని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. నేటికాలంలో పాకిస్థాన్ ఎలాంటి ఆర్థిక సహాయమైనా ఉగ్రవాదానికి నిధుల కంటే తక్కువ కాదని నేను నమ్ముతున్నాను. పాకిస్థాన్‌కు ఒక బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం అందజేసే విషయాన్ని పునరాలోచించాలని భారతదేశం కోరుకుంటుంది. భవిష్యత్తులో కూడా ఎలాంటి ఆర్థిక సహాయం అందించకూడదని భారత్ కోరుకుంటోంది అని రక్షణ మంత్రి అంతర్జాతీయ ద్రవ్య నిధికి విజ్ఞప్తి చేశారు. మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం ఉదయం భుజ్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకుని, మొత్తం భద్రతా పరిస్థితిని సమీక్షించారు. భారత వైమానిక దళం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటాన్ని సమర్థవంతంగా నిర్వహించడాన్ని ఆయన ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సాయుధ బలగాలు శత్రువుపై ఆధిపత్యం ప్రదర్శించడమే కాకుండా వారిని నాశనం చేయడంలోనూ విజయం సాధించారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రశంసించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్‌ను రూపొందించారని తెలిపారు. మన వైమానిక దళం శౌర్యం, ధైర్యం, కీర్తితో ఉన్నత శిఖరాలను తాకిందని రక్షణమంత్రి ప్రస్తుతించారు. ఇక్కడి వైమానిక దళం స్థావరం ఇరు దేశాల మిలిటరీల మధ్య నాలుగు రోజుల ఘర్షణ సమయంలో పాకిస్థాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోవడంలో విజయం సాధించి ముందు భాగాన నిలిచిందన్నారు. పాకిస్థాన్‌కు ఒక బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని అంతర్జాతీయ ద్రవ్యనిధి చేస్తున్నది అంటే అంతర్జాతీయ సంస్థ ఐఎంఎఫ్ ఉగ్రవాదాన్ని పరోక్షంగా ప్రోత్సహిస్తోంది అని భావించాల్సి వస్తున్నదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

# వక్ఫ్ సవరణ చట్టంపై రెండు పిటిషన్లు ‘సుప్రీం’ తిరస్కృతి

### ప్రతీ ఒక్కరూ పేపర్లలో పేరు రావాలని కోరుకుంటున్నారని ‘సిజెఐ’ ధర్మాసనం ఆగ్రహం



**న్యూఢిల్లీ :** వక్ఫ్ (సవరణ) చట్టం2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాల్‌చేస్తూ తాజాగా దాఖలైన రెండు పిటిషన్ల విచారణకు శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రతీ ఒక్కరూ వార్తాపత్రికలలో తమ పేర్లు రావాలని కోరుకుంటున్నారని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ మే 20న జరుగనున్న పెండింగ్ కేసును నిర్ణయిస్తామని తెలియజేసింది. ఈ కేసులో తాత్కాలిక ఊరట అనే అంశంపై అత్యున్నత న్యాయస్థా నం విచారణ చేపట్టనుంది. తొలుత ఒక పిటిషన్ విచారణకు వచ్చిన వెంటనే కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యంతరం తెలిపారు. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలయ్యే పిటిషన్లకు ఒక ముగింపు అంటూ లేదా అని ధర్మాసనాన్ని అడిగారు. పిటిషన్ తరపున హాజరైన న్యా యవాది మాట్లాడుతూ తాను ఏప్రిల్ 8న పిటిషన్‌ను దాఖలు చేశానని, కొన్ని లోపాలు ఉన్నాయని లేవనెత్తుతూ అత్యున్నత న్యాయస్థానం రిజిస్ట్రీ పిటిషన్‌ను ఏప్రిల్ 15న తొలగించారని చెప్పారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ మాట్లాడుతూ ‘ప్రతీ ఒక్కరూ తన పేరును పేపర్లలో రావాలని కోరుకుంటున్నారు’ అని సిజెఐ గమనించారు. తన పిటిషన్‌ను పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో జత చేయాలని ఒక న్యాయవాది కోరినప్పుడు ‘ఆ విషయాన్ని మేం నిర్ణయిస్తాం’ అని తెలియేజేసిన ధర్మాసనం దానిని రద్దు చేసింది. ఎప్పుడైతే మరొక పిటిషన్ విచారణ కోసం వచ్చిందే అప్పుడు వెంటనే ధర్మాసనం ‘డిస్‌మిస్డ్’ అని చెప్పింది. పెండింగ్‌లో ఉన్న పిటిషన్లలో జోక్యం చేసుకోవడానికి అనుమతించాలని పిటిషనర్ తరుపు ఒక న్యాయవాది అభ్యర్థించగా ‘మాకు ఇప్పటికే జోక్యం చేసుకునే వ్యక్తులు చాలామంది ఉన్నారు’ అని ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. ఏప్రిల్ 5న అత్యున్నత న్యా యస్థానం ధర్మాసనం కేవలం 5 పిటిషన్లు మాత్రమే ధర్మాసనం ముందు వి చారణకు రానున్నట్లు నిర్ణయించింది. మే 15న సిజెఐ, జస్టిస్ ఆగస్టిన్ మా సిహ్ ప్రాతినిధ్యం వహించిన ధర్మాసనం ముందు వక్ఫ్ చట్టాన్ని సవాల్ చే స్తూ దాఖలైన పిటిషన్లు విచారణకు వచ్చాయి. దీనిపై బెంచ్ మాట్లాడుతూ మూడు అంశాలపై మే 20న విచారణ సందర్భంగా వాదనలను వింటామని స్పష్టం చేసింది.

## రాత్రికి రాత్రే పరివర్తన తెస్తుందనుకోవడం తగదు

### దశాబ్ధ కాలంగా కుంటుపడిన అభివృద్ధి ఒక్కసారిగా తిరిగిరాదు : ఫరూక్ అబ్దుల్లా



శ్రీనగర్ : గత సంవత్సరం ఏర్పడిన తమ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం జమ్ము కశ్మీర్‌లో రాత్రికి రాత్రే పరివర్తన తెస్తుందని ఆశించడం ‘అవాస్తవికం‘ అని నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు, గత దశాబ్ధంలో ఏర్పడిన కుంటుపడిన అభివృద్ధి ఒక్కసారిగా తిరిగి రాదన్నారు. ఉత్తర కుశ్మీర్ కుప్వారా జిల్లా క్రాల్ పోరాలోని రేషి గుండ్ ప్రాంతం లో జరిగిన ఒక సభలో ఫరూఖ్ అబ్దుల్లా పాల్గొని ప్రసంగించారు. ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ప్రభుత్వం ప్రభావవంతమైన పాలనను రూపొందించడంలో చురుకుగా వ్యవహరిస్తుందని, పౌరుల భాగస్వామ్యం గల పాలనతో పరివర్తన యుగానికి నాంది పలికిందని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. ప్రభు త్వం ఐదు సంవత్సరాలు ఉంటుందని, రాత్రికి రాత్రే ఈ ప్రాం తాన్ని మారుస్తుందని ఆశించడం అవాస్తవమన్నారు. గత దశాబ్దంలో మన ప్రాంతం ఎదుర్కొన్న అభివృద్ధిలో ఎదురైన అడ్డంకులను కేవలం క్షణాల్లో తిప్పికొట్టలేమని, ఎలాంటి మాయా పరిష్కారాలులేవని అబ్దుల్లా అన్నారు. జమ్ము కశ్మీర్ ప్రజలు గత దశాబ్దాలుగా కష్టాలను ఎదుర్కొన్నారని, పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన అన్ని వాగ్దానాలను నెరవేర్చడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సహకార విధానంతో, మన ప్రాంతం తిరిగి ఊపును పొందుతుందని విశ్వసిస్తున్నారు. మన పౌరులు త్వరలో అన్ని రంగాలలో గణనీయమైన మెరుగుదలను చవిచూస్తారని చెప్పారు.

## ఒమర్, ముఫ్తీ మధ్య ‘ట్వీట్స్ వార్ ’



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా, మాజీ సిఎం, పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీ ఒకరికొకరు విమర్శించుకున్నారు. పాకిస్థాన్‌తో జలాల ఒప్పందం గురించి వారిద్దరి మధ్య ట్వీట్ల వార్ జరిగింది. ఉత్తర కశ్మీర్‌లోని వులార్ సరస్సు పునరుద్ధరణకు 1987లో తుల్బుల్ నావిగేషన్ ప్రాజెక్ట్‌ను నాటి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. అయితే సింధు జలా ల ఒప్పదం ఉల్లంఘనగా పేర్కొంటూ పాకిస్థాన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో 2007లో ఈ ప్రాజెక్ట్ పనులు నిలిచిపోయాయి. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. ఈ నేపథ్యంలో ఆగిపోయిన తుల్బుల్ నావిగేషన్ ప్రాజెక్ట్‌ను మనం తిరిగి ప్రారంభించగలమా? అని సీఎం ఒమర్ అబ్దుల్లా శుక్రవారం ట్వీట్ చేశారు. జీలం నావిగేషన్‌తోపాటు విద్యుత్ ఉత్పత్తిని కూడా ఈ ప్రాజెక్ట్ పెంచుతుందని అందులో పేర్కొన్నారు. మరోవైపు భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ సిఎం ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం రెచ్చగొట్టే చర్యలను అవలంబిస్తున్నదని మెహబూబా ముఫ్తీ మండిపడ్డారు. దీనికి స్పందించిన ఒమర్ అబ్దుల్లా.. చౌకబారు ప్రచారం కోసం, సరిహద్దు అవతల ఉన్న కొందరిని సంతోషపెట్టేందుకు ముఫ్తీ చేస్తున్న గుడ్డి కోరిక ప్రయత్నమని ఆరోపించారు. అయితే ఎవరి ప్రసన్నం కోసం ఎవరు ప్రయత్నిస్తున్నారో అన్నది కాలం చెబుతుందంటూ ముఫ్తీ కౌంటర్ ట్వీట్ చేశారు.

## ఎన్‌కౌంటర్ స్థలం నుండి ఆయుధాలు స్వాధీనం



**ఇంఫాల్ :** ఇండో–మయన్మార్ సరిహద్దు సమీపంలో మణిపూర్‌లోని చందేల్ జిల్లాలో భద్రతా దళాలతో జరిగిన కాల్పుల్లో 10 మంది ఉగ్రవాదులు మరణించిన రెండు రోజుల తర్వాత, మృతులను గుర్తించడానికి ప్రస్తుతం ప్రయత్నాలు జరుగుతున్నాయని రక్షణ శాఖ పిఆర్‌ఒ శుక్రవారం తెలిపారు. పిఆర్‌ఒ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, ఆ ప్రాంతంలో తదుపరి ఆపరేషన్ల సమయంలో భద్రతా దళాలు 12 తుపాకులు, మందుగుండు సామగ్రి, రాకెట్ ఆధారిత గ్రెనేడ్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ఇండో–మయన్మార్ సరిహద్దు వెంబడి చందేల్ జిల్లాలోని న్యూ సామ్తాల్ గ్రామం సమీపంలో బుధవారం అస్సాం రైఫిల్స్ యూనిట్‌తో జరిగిన కాల్పుల్లో కనీసం 10 మంది ఉగ్రవాదులు మరణించారు. ‘తదుపరి కూంబింగ్ ఆపరేషన్లలో, ఏడు ఎకె47 రైఫిల్స్, ఒక ఆర్‌పిజి లాంచర్, ఒక ఎం4 రైఫిల్, నాలుగు సింగిల్‌బారెల్ బ్రీచ్‌లోడింగ్ రైఫిల్స్, మందుగుండు సామగ్రి, ఇతర యుద్ధ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారని ఆ ప్రకటన పేర్కొంది. ఆ ప్రకటన ప్రకారం, ఉగ్రవాదులు సరిహద్దు తిరుగుబాటు కార్యకలాపాలలో పాల్గొన్నట్లు అనుమానిస్తున్నారు.

# రెండు ఆపరేషన్లు.. ఆరుగురు ఉగ్రవాదులు హతం



**అవంతిపొరా :** పహల్గామ్ ఉగ్రదాడి తరువాత భద్రతా బలగాలు తమ దృష్టిని ఉగ్ర వ్యతిరేక కార్యకలాపాలపై సారించాయి. ఈ నేపథ్యంలో గత రెండురోజుల్లో దక్షిణ కశ్మీర్‌లో చేపట్టిన ఆపరేషన్‌లో ఆరుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు అధికారులు తెలిపారు. గత నెలలో జరిగిన ఉగ్రవాద కార్యకలాపాల పరిస్థితులపై భద్రతా సంస్థలు తమ వ్యూహాన్ని సమీక్షించాయి. తమ దృష్టి కార్యకలాపాలపైనే ఉందని కశ్మీర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి) వి కె బిర్ది అన్నారు. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలోని విక్టర్ ఫోర్స్ ప్రధాన కార్యాలయంలో విక్టర్ ఫోర్స్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్, మేజర్ జనరల్ ధనంజయ్ జోషి, సిఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ మితేష్ జైన్‌లతో ఐజిపి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వివిధ భద్రతా సంస్థలు గట్టిగా దృష్టి సారించడం, ఒకరికొకరు సమన్వయం చేసుకోవడంతో గత మూడు రోజుల్లో రెండు ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించాయని, ఈ ఆపరేషన్లలో ఆరుగురు ఉగ్రవాదులు అంతమొదించినట్లు బిర్ది చెప్పారు. భద్రత, నిఘా సంస్థల మధ్య సమన్వయం కారణంగానే ఈ విజయవంతమైన ఆపరేషన్లు సాధ్యమయ్యాయని, కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను అంతం చేయడానికి తాము నిబద్ధతతో ఉన్నామని, అటువంటి చర్యలను ఆపడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఐజిపి చెప్పారు. మంగళవారం, గురువారం పుల్వామా షోపియన్‌లోని కెల్లర్ ప్రాంతంలో, పుల్వామాలోని ట్రాల్‌లోని నాదర్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్లు జరిగాయి. రెండు ఆపరేషన్లలో కలిలి మొత్తం ఆరుగురు ఉగ్రవాదులు మరణించారు. 26 మంది ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత, భద్రతా దళాలు అనేక ప్రాంతాలను దృష్టి కేంద్రాలుగా గుర్తించాయని మేజర్ జోషి చెప్పారు. మంచు కరగడం తర్వాత ఉగ్రవాదులు ఎత్తైన ప్రాంతాలకు తరలి వెళ్లినట్లు తమకు నిఘా సమాచారం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని, తమ బృందాలను నిరంతరం ఎత్తైన ప్రాంతాలు, పర్వత ప్రాంతాలు, అడవులలో మోహరింపజేశామన్నారు. ‘మే 12వ తేదీన కెలర్ పర్వత శిఖరాల వద్ద ఉగ్ర బృందాలు దాక్కొని ఉన్నట్లు మాకు విశ్వసనీయ సమాచారం వచ్చింది. మర్నాడు ఉదయమే అక్కడ అనుమానాస్పద కదలికలను గుర్తించాము. దీంతో భద్రతా దళాలు వారిని చుట్టుముట్టాయి. వారు కాల్పులు జరపడంతో ఎన్‌కౌంటర్‌లో వారిని మట్టుబెట్టాయి. ఇక ట్రాల్ పరిసరాల్లోని సరిహద్దు గ్రామంలో రెండో ఎన్‌కౌంటర్ జరిగింది. అక్కడ మేము నిర్బంధ తనిఖీలు చేపట్టాం. ఉగ్రవాదులు వేర్వేరు ఇళ్లలో దాక్కొని కాల్పులు మొదలు పెట్టారు. ప్రజల ప్రాణాలను రక్షించడం ఇక్కడ మాకు సవాలుగా మారింది. కానీ, ఎట్టకేలకు ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టాం. ఈ రెండు ఎన్ కౌంటర్లలో మృతి చెందిన ఆరుగురిలో ఒకడైన షహిద్ కుట్టె రెండు పెద్ద దాడుల్లో నిందితుడు. జర్మనీ పర్యాటకులపై కూడా ఇతడు దాడి చేశాడు. ట్రాల్ ప్రాంత’ అని మేజర్ జనరల్ ధనుంజయ జోషీ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్లలో జమ్ముకశ్మీర్ పోలీస్, సైన్యంతోపాటు సిఆర్‌పిఎఫ్ దళాలు కూడా పాల్గొన్నాయి.

## పోలీసుల అదుపులో 13 మంది బంగ్లాదేశీయులు

### కంచె లేని వ్యవసాయ పొలాల గుండా భారత్‌లోకి ప్రవేశం



**న్యూఢిల్లీ :** ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా ఢిల్లీలో నివసిస్తున్నారనే ఆరోపణలతో ఐదుగురు మైనర్లతో సహా 13 మంది అనుమానిత బంగ్లాదేశ్ జాతీయులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మొహమ్మద్ రఫీకుల్ (50), ఖోటేజా బేగం (41), మొహమ్మద్ అనోవార్ హుస్సేన్ (37), మొహమ్మద్ అమీనుల్ ఇస్లాం (28), జోరినా బేగం (27), అఫ్రోజా ఖాతున్ (25), మొహమ్మద్ ఖాఖోన్ (20), హస్నా (19), ఐదుగురు మైనర్లు బంగ్లాదేశ్‌లోని ఖుదిగ్రామ్‌కు చెందినవారని పోలీసులు తెలిపారు. వీరందరిని ఢిల్లీలోని ఔచాండి గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ గ్రామంలో బంగ్లాదేశ్ జాతీయులు వసతి కోరుతున్నారనే నిర్దిష్ట నిఘా సమాచారం మేరకు ఈ ఆపరేషన్ నిర్వహించామని, వలపన్ని ఈ నెల 13వ తేదీన 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (క్రైమ్) ఆదిత్య గౌతమ్ తెలిపారు. విచారణలో తాము బంగ్లాదేశ్ జాతీయులమని అంగీకరించారని, భారతదేశంలో ఉండటానికి అనుమతించే చట్టపరమైన పత్రాలు తమ వద్ద లేవని చెప్పారన్నారు. రెండు సంవత్సరాల క్రితం బంగ్లాదేశ్ ఏజెంట్ జలీల్ అహ్మద్ సహాయంతో వారు భారతదేశంలోకి ప్రవేశించామని వెల్లడించినట్లు ఆ అధికారి తెలిపారు. వారంతా తమ గ్రామం నుండి బస్సులో భారత్–బంగ్లాదేశ్ సరిహద్దు వరకు ప్రయాణించి, కంచె లేని వ్యవసాయ పొలాల గుండా భారత భూభాగంలోకి ప్రవేశించారు. అక్కడి నుండి, వారు ఆటోరిక్షాను అద్దెకు తీసుకుని పశ్చిమ బెంగాల్‌లోని కూచ్ బెహార్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రైలులో ఢిల్లీకి చేరుకుని ఆ తరువాత బస్సు మార్గం ద్వారా హర్యానాలోని ఖర్ఖోడాకు చేరుకున్నారు. అనంతరం సిసానా గ్రామంలోని ఇటుక బట్టీలో కార్మికులుగా ఉపాధి పొందారు. ఈ నేపథ్యంలో వారి నుండి బంగ్లాదేశ్ గుర్తింపు పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# పిఒకె కోసం యుద్ధం నిర్ణయాత్మకంగా ఉండాలి

**రిటైర్డ్ డిజిఎంఒ అనిల్ భట్**

న్యూఢిల్లీ: యుద్ధం చేయడం అనేది చాలా తీవ్రమైన విషయమని, ఒకవేళ పాకిస్థాన్ ఆక్రమించిన కశ్మీరు భూభాగాన్ని (పి ఓ కె) తిరిగి స్వాధీనం చేసుకోవాలనుకుంటే అందుకోసం చేసే యుద్ధాన్ని చిట్టచివరి అవకాశంగా మాత్రమే ఎంపిక చేసుకోవాలని పదవీ విరమణ చేసిన డిజిఎంఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్) లెఫ్టినెంట్ జనరల్ అనిల్ కుమార్ భట్ అన్నారు. ఆధునికయుద్ధతంత్రంలో డ్రోన్లకు చాలా ప్రాధాన్యత వచ్చిందని, అంతరిక్షం,సైబర్‌దాడులకు కూడా ప్రాధాన్యత పెరిగిందని, ఇవన్నీ పాత తరం యుద్ధం నుండి భవిష్యత్ యుద్ధాలకు మళ్ళేందుకు ఒక నూతన మార్పును లిఖించనున్నాయన్నారు. చాలా దేశాలు ఇప్పుడు ఉపగ్రహ విధ్వంసక వ్యవస్థలను అభివృద్ధి చేశాయని, ఆత్మహత్యాసదృశ్యమైనస్థాయిలో దాడులు చేయడానికి సిద్ధంగా ఉండే ఉపగ్రహాలను సిద్ధం చేస్తున్నాయని, ప్రతికూలంగా పనిచేసే ఉపగ్రహాలను ధ్వంసంచేయగల ఉపగ్రహాలను తయారుచేస్తున్నాయన్నారు. ఇప్పుడు చైనా తయారు చేసిన కామికాజ్ ఉపగ్రహానికి కూడా ఇలాంటి లక్షణాలే ఉన్నాయని మాట్లాడుకుంటున్నారన్నారు. భూమిచుట్టూ తిరిగే ఉపగ్రహాలకు మరమ్మతులు చేసి, వాటికి తిరిగి ఇంధనశక్తిని నింపగలశక్తిసామర్థ్యాలను కూడా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఒక ఉపగ్రహం పనికి రాకుండా పోయిందంటే దానికి కారణం అందులో శక్తి పూర్తిగా లేకపోవడమేనని, వాటిని తిరిగి నింపితే పని చేసే పరిస్థితులు వచ్చాయన్నారు. భారతదేశానికి దాదాపు పది సైనిక ఉపగ్రహాలున్నాయన్నారు. వీటిని గస్తీ ప్రయోజనాలకోసం ఉపయోగిస్తున్నామనీ, కొత్తగా మరో 52 ఉపగ్రహాలను కూడా ఇలాంటి ప్రయోజనాల కోసం తయారుచేసే ప్రణాళికలున్నాయన్నారు. భారతదేశం ఇప్పుడు తన తాజా యుద్ధం ద్వారా పాకిస్థాన్‌కు సరికొత్త హెచ్చరికలు చేసిందని, మనదేశంపై చేసే ప్రతి ఉగ్రదాడికీ ఘాటైన జవాబు ఉంటుందని స్పష్టం చేసిందన్నారు. ‘‘మీరు ఎర్ర గీత దాటి వస్తే మేం వెనక్కు తిప్పికొడతాం’’ అనే ఒక కొత్త నింబంధన పెట్టామన్నారు. ఇక పాకిస్థానే నిర్ణయం తీసుకుని తన కారును ఎటు నడుపుకుంటూ వెళ్ళాలో నిర్ణయించుకోవాలన్నారు. యుద్ధాన్ని ప్రారంభించడం చాలా తేలిక, కానీ యుద్ధాన్ని ముగించడం చాలా కష్టం అని వాజ్‌పాయ్ ఒకనాడు చెప్పిన మాటను ఆయన గుర్తుచేశారు. రాబోయే యుద్ధాలన్నీ ఇక డ్రోన్లతోనే జరుగుతాయన్నారు. ఇప్పుడు టర్కీదేశం కూడా డ్రోన్లు సరఫరా చేసిందని తెలిసిందన్నారు. ఒక చిన్న డ్రోన్ ఖరీదు రూ.2 లక్షలు ఉంటుందన్నారు. ఈ డ్రోను ద్వారా రూ.30 కోట్లు విలువైన ఒక యుద్ధ శకటాన్ని ధ్వంసం చేయవచ్చునన్నారు.

పిఓకెను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి చేసే యుద్ధం అన్ని తలుపులూ మూసుకుపోయినప్పుడు చిట్టచివరి అవకాశంగా ఒక నిర్ణయాత్మకంగా ఉండాలన్నారు. 38 సంవత్సరాలపాటు సైన్యంలో పనిచేసిన అనిల్ కుమార్ భట్ పిటిఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, యుద్ధం కంటే వేరే మార్గాలు ఇంకా చాలా ఉంటాయన్నారు. ‘‘యుద్ధం అనేది కేవలం చిట్టచివరి అస్త్రం మాత్రమే, యుద్ధం చేయడం అంటే అది చాలా చాలా తీవ్రమైన విషయం, కానీ నాలుగు రోజుల్లో యుద్ధం ముగిసిపోయినందుకు చాలామంది యుద్ధోన్మాద మనస్తత్వం కలిగినవారు చాలా విచారపడుతున్నారు, యుద్ధాన్ని కొనసాగించి పి ఓ కెను స్వాధీనం చేసుకోలేదని అంటున్నారు, సోషల్ మీడియాలో నిరుత్సాహం వ్యక్తం చేసే సూచనలు చేస్తున్నారు,పాకిస్థాన్ ఆక్రమించిన కశ్మీరును స్వాధీనం చేసుకోవడానికి అసలు ఇదే సరైన అదునుగా భావించారు, కానీ భారతదేశం తన వ్యూహాత్మకమైన లక్ష్యాలను సాధించిన తర్వాత యుద్ధం ఒక అంతిమ అస్త్రంగానే ఉండాలి, యుద్ధం చేయకూడదు, ఇంకా వివరంగా చెప్పాలంటే, పిఓకెను తిరిగి వెనక్కు తెచ్చుకోవడానికి చేసే యుద్ధం చాలా నిర్ణయాత్మకంగా ఉండాలి, ఇది ఈ సమయంలో చేయాల్సింది కాదు, ఔను, భారత సైన్యం అందుకు సిద్ధంగానే ఉంది, యుద్ధం కొనసాగించి ఉంటే పరిస్థితులు అటువైపే దారితీసేవి’’ అని భట్ అన్నారు. 2020 జూన్‌లో భట్ పదవీ విరమణ చేశారు. దేశ అంతరిక్షరంగంలో ప్రైవేటు వ్యవస్థకు సంబంధించిన టెక్నాలజీని ముందుకు తీసుకువెళ్ళేందుకు ఆయన మార్గదర్శకత్వం వహించారు. ఆయన సైన్యంలో ఎంతో సీనియర్ అధికారి, దాదాపు నాలుగు దశాబ్దాల అనుభవంగల అధికారి, ఎల్లప్పుడూ భారత సైన్యం సర్వసన్నద్ధంగా ఉందన్న విషయాన్ని ధృవీకరించే ఉన్నతస్థాయీ అంచెలంచెల అధికార వ్యవస్థలో ఆయన పనిచేశారు. తక్షణ, దీర్ఘకాలిక యుద్ధ వ్యూహాలను తీర్చిదిద్దడంలో ఆయన సన్నిహితంగా పనిచేశారు. ప్రస్తుతం లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ డిజిఎంఓగా పనిచేస్తున్నారు. 2017లో భారత్–చైనా మధ్య డోక్లాంలో 73 రోజులపాటు సైనిక ప్రతిష్టంభన ఏర్పడినప్పుడు ఆయన అక్కడే పనిచేశారు. త్రివిధ దళాలకు ఆయన సమన్వయకర్తగా పనిచేశారు.

## నగల కోసం తల్లి దహన సంస్కారాలు అడ్డుకున్న కొడుకు

### తల్లి చితిపై పడుకొని నిరసన : కన్న కొడుకు నిర్వాకం



**జైపూర్ :** వెండి నగల కోసం తల్లి దహన సంస్కారాలను ఓ కొడుకు అడ్డుకున్నాడు. అంత్యక్రియలు నిర్వహించకుండా తల్లి చితిపై పడుకొని నిరసన తెలిపాడు. ఈ ఘటన రాజస్థాన్ జైపూర్‌లో చోటు చేసుకుంది. జైపూర్ గ్రామీణ ప్రాంతంలోని విరాట్‌నగర్‌లో నివాసం ఉండే 80 ఏళ్ల ఛీటర్ రీగర్ మే 3వ తేదీన ప్రాణాలు కోల్పోయింది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చనిపోయే వరకూ ఆమె తన పెద్ద కుమారుడు గిర్ధారి లాల్ వద్దే నివసించారు. ఇక అంత్యక్రియల కోసం ఆమె మృతదేహాన్ని బంధువులు, కుటుంబ సభ్యులు శ్మశానవాటికకు తీసుకెళ్లారు. అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతుండగా.. అక్కడ కుమారుల మధ్య వివాదం చెలరేగింది. చితికి నిప్పుపెట్టే ముందు ఆమె ఒంటిపై ఉన్న వెండి గాజులు, ఇతర ఆభరణాలను కుటుంబ పెద్దలు గిర్ధారి లాల్‌కు అప్పగించారు. దీంతో చిన్నకుమారుడు ఓంప్రకాష్ ఇందుకు అభ్యంతరం చెప్పాడు. వెండి గాజులు తనకు ఇవ్వాలని పట్టుబట్టాడు. ఇవ్వకపోతే దహన సంస్కారాలను జరగనివ్వనని హెచ్చరించాడు. అంతటితో ఆగకుండా తల్లి చితిపై పడుకొని నిరసన తెలిపాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు అతడికి ఎంత నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినలేదు. గాజులు తనకు ఇవ్వకుంటే.. తనను తాను దహనం చేసుకుంటానని బెదిరించాడు. ఎలాగోలా స్థానికులు అతన్ని బలవంతంగా చితి నుంచి బయటకు లాగారు. అతను తన తల్లి చితిపక్కనే కూర్చుని తన నిరసనను కొనసాగించాడు. ఇక చేసేదేమీ లేక ఆ ఆభరణాలను అతడికి అప్పగించడంతో దహన సంస్కారాలకు అంగీకరించాడు. ఈ గొడవ కారణంగా దాదాపు రెండు గంటలు ఆలస్యంగా అంత్యక్రియలు పూర్తి చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎన్‌డిపిఎస్ కేసులో
# బెయిలు తిరస్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్‌డిపిఎస్ చట్టం కింద శిక్ష అనుభవిస్తున్న నిందితులు ఇద్దరు దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. నిషేధిత ఆల్ప్రాజోలం తయారీలో పదేళ్ల శిక్షను ఎదుర్కొంటున్న హైదరాబాద్‌కు చెందిన బండారు హనుమంతరెడ్డి, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వాసంశెట్టి నరేష్‌లకు హైకోర్టు బెయిలు ఇవ్వడానికి నిరాకరించింది. మెదక్ జిల్లా జిన్నారంలోని వెంకట రాఘవ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 2016లో డిఆర్ఐ అధికారులు సోదాలు నిర్వహించి 132 కిలోల ఆల్ప్రాజోలంతోపాటు తయారీ యంత్రాలు, పరికరాలు, ముడిపదార్థాలు, రసాయనాలు సీజ్ చేశారు. ఇందులో ముగ్గురు నిందితులకు 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.3లక్షల జరిమానా విధిస్తూ 2022లో కిందికోర్టు తీర్పు చెప్పింది. దీనిని సవాలు చేస్తూ, వారిద్దరూ దాఖలు చేసిన హైకోర్టు కొట్టివేసింది. దీనిపై జస్టిస్ కె.లక్ష్మ ణ్ ఇటీవల విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు.

## త్రివేణి సంగమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
# కుటుంబ సమేతంగా పుష్కరస్నానాలు

స్వాగతం పలికిన మంత్రి శ్రీధర్ బాబు
నవరత్న హారతి కార్యక్రమంలో పాల్గొన్న భట్టి





**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/-కాళేశ్వరం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాల సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం కాళేశ్వరం క్షేత్రంలో పర్యటించారు. కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుండి బయలుదేరిన భట్టి విక్రమార్క రోడ్డు మార్గంలో శుక్రవారం సాయంత్రం త్రివేణి సంగమ సరస్వతి పుష్కర ఘాట్‌కు చేరుకున్నారు. ఆయన రాక సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు శాలువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం భట్టివిక్రమార్క దంపతులు కుటుంబ సభ్యులతో త్రివేణి సంగమంలో పుష్కర పుణ్యస్నానాలు ఆచరించారు. నదిలో వీరికి వేదపండితుల ఆధ్వర్యంలో సరస్వతీ పుష్కర సంకల్పసిద్ధి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి దంపతులు సరస్వతీ పుష్కర నదీమాతల్లికి సారె, చీర సమర్పించారు. అనంతరం సరస్వతీ పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన భారీ సరస్వతి మాత విగ్రహాన్ని దర్శించుకున్నారు. అనంతరం త్రివేణి సంగమ పుష్కర ఘాట్ వద్ద కాశీ పండితుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన నవరత్న హారతి కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొని ఆద్యంతం మహా క్రతువును కుటుంబ సభ్యులతో కలిసి తిలకించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ రాహుల్ శర్మ తదితర దేవాదాయ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**పుష్కర భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి : మంత్రి శ్రీధర్‌బాబు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో రెండో రోజు కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సరస్వతీ పుష్కర ఘాట్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సరస్వతి పుష్కర ఘాట్ ప్రాంతంలో భక్తులకు అందుబాటులో ఉండే సదుపాయాలు, సేవల ఏర్పాట్లను మంత్రి శ్రీధర్ బాబు పరిశీలించారు. పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్ల, భక్తులకు సరఫరా చేసే తాగు నీరు, ఆరోగ్య సదుపాయాలు, భద్రత ఏర్పాట్లను అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పుష్కరాలకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.
రోజు రోజుకూ భక్తుల రద్దీ పెరుగుతుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. స్వచ్ఛత, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, శాసన సభ్యుడు మక్కన్ సింగ్, పరిశ్రమల శాఖ జిఎం సిద్దార్థ, డిఆర్డీఓ నరేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టాళ్లు ఏర్పాటు చేసిన వారితో ఫోటోలు దిగి వారిని అభినందించారు.

# మూసీ హద్దుల నిర్ధారణపై హైడ్రా మేధోమథనం

నాలాల నెట్‌వర్కుపైనా నిపుణుల అభిప్రాయాల సేకరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాలుష్యం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం, ఇలా కారణాలేమైనా అసాధారణమైన వర్షాలకు నగరం అతలాకుతలం అవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో వర్షాకాలం వరదముప్పు తప్పించడానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా మేధోమథనం చేసింది. 'మూసీనది సరిహద్దు గుర్తింపు, ఓఆర్ఆర్ లోపల నాలా నెట్‌వర్క్‌తో పాటు వెడల్పుల నిర్ధారణ' అనే అంశంపై శుక్రవారం హైడ్రా సదస్సును నిర్వహించింది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుతో ఎలాంటి సంబంధం హైడ్రాకు లేనప్పటికీ మూసీ ఆక్రమణలపై హైడ్రాకు అందుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో అసలు ఆ నది సరిహద్దుల నిర్ధారణ ఎలా చేపట్టాలనే విషయమై చర్చించింది. చెరువుల ఎఫ్‌టిఎల్‌ను గుర్తించిన విధంగానే మూసీ నది ఎంఎఫ్ ఎల్ (మాగ్జిమమ్ ఫ్లడ్ లెవెల్)ను గుర్తించేందుకు గ్రామ, రెవెన్యూ రికార్డులను దృష్టిలో పెట్టుకుని సరిహద్దులు నిర్ధారించాలని కొంతమంది సూచించారు. మూసీ పరివాహక ప్రాంతం హైడ్రాలజీ నివేదికలు, ఎన్ఆర్ఎస్‌సి శాటిలైట్ ఇమేజీలు, సర్వే ఆఫ్ ఇండియా రికార్డులను కూడా పరిశీలించి, మూసీ హద్దులను నిర్ధారించి నిర్మాణాలు జరగకుండా చూడాలని పలువురు హైడ్రాకు సూచించారు. నగరంలో 1908, 1954, 2000, 2008 సంవత్సరాలలో కురిసిన భారీ వర్షాలు, అప్పటి పరిణామాలను చర్చించి, మూసీ నదీ పరీవాహకంలో ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలన్నారు.

**నాలాల్లో ఆటంకాలు లేకుండా..**

నగరంలో నాలాలు కుంచించుకుపోకుండా చూడాలని పలువురు సూచించారు. జిహెచ్ఎంసి పరిధిలో 940 ప్రాంతాల్లో కల్వర్టులున్నాయని, అక్కడ చెత్త పేరుకుపోవడంతో వర్షపు నీరు సాధారణంగా వెళ్లడంలేదన్నారు. పలు చోట్ల నాలాల లింకు కట్ అయ్యిందని, దానిని పునరుద్ధరించాలన్నారు. కొన్ని చోట్ల కుంచించుకుపోయాయని, అక్కడ నిర్మాణాలకు ఎలాంటి ముప్పు లేకుండానే కుదిరితే విస్తరణ లేదంటే మళ్లింపు చేయాలని పలువురు సూచించారు. నగర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినప్పుడు రహదారుల వెడల్పు విషయంలో ఎలాంటి ఆలోచన చేస్తున్నామో నాలాల నిర్మాణంలో కూడా అదే పాటించాలని పలువురు పేర్కొన్నారు. నాలాల తీరుతెన్నులపై సమగ్ర సర్వే చేసి సరైన ప్రణాళికలు సూచించాలని పలువురు తెలిపారు. ఈ సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్, రిటైర్డ్ ఈఎన్‌సి జియాఉద్దీన్, జిహెచ్‌ఎంసి నీటిపారుదల విభాగం ఎస్‌సి నారాయణ, రెవెన్యూ, సర్వేఆఫ్ ఇండియా, ఇరిగేషన్, హైడ్రాలజీ, ఎస్ ఎన్‌డిపి, ఎన్ఆర్ఎస్‌సి, జిహెచ్ఎంసి, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పరేషన్‌తో పాటు అర్బన్ డెవలప్‌మెంట్‌లో భాగస్వామ్యం అవుతున్న పలు సంస్థలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.




# నకిలీ డాక్యుమెంట్లు విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** సరూర్ నగర్ కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ అక్రమ దందాకు పాల్పడుతున్న ముఠాను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు.శుక్రవారం ఎల్.బి నగర్ లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ క్యాంప్ కార్యాలయంలో సి పి సుధీర్ బాబు మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక డబ్బులకు ఆశపడిన సరూర్ నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సాత్విక్ ఎంటర్ ప్రైజెస్ పేరుతో నోటరీ షాపు నిర్వహిస్తున్న భానుప్రకాశ్,సాగరిక దంపతులు నకిలీ కులము,ఆదాయం,బర్త్ సర్టిఫికెట్ల తో పాటు భూ క్రయ విక్రయాలకు సంబంధించిన ఫేక్ డాక్యుమెంట్లు,ఫోర్జరీ పత్రాలు సృష్టించి అధిక డబ్బులకు విక్రయిస్తున్నారని ఆయన వెల్లడించారు.ఇందుకోసం నిందితులు కొందరు వ్యక్తులతో చేతులు కలిపి ఓ వ్యవస్థనే ఏర్పాటు చేశారని వెల్లడించారు.గత తొమ్మిది సంవత్సరాలుగా ఈ దందా నడిపిస్తున్న భార్యాభర్తలకు తోడు మరి కొంతమందిని కలుపుకొని ముఠాగా ఏర్పడి నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారం సాగుతున్నట్లు సిపి సుధీర్ బాబు తెలిపారు.ముఠా సభ్యులు ఒక్కోక్క నకిలీ డాక్యుమెంట్ను రూ.5వేల నుంచి రూ.20వే వరకు విక్రయిస్తున్నారని సి పి సుధీర్ బాబు వివరించారు.
ఈ కేసులో మొత్తం 13 మంది భాగస్వాములుగా ఏర్పాడి నకిలీ సర్టిఫికెట్ల దందాకు పాల్పడుతున్నట్లు సిపి తెలిపారు.అందులో తోట వెంకట భాను ప్రకాష్,తోట సాగరిక,ఎస్.డి ఫరోజ్ అలీ,అడ్డగూడూరు చంద్రశేఖర్,అడ్డగూడూరు అనిల్, ఎండి జలీల్, పులుసు మల్లేష్ గౌడ్, ప్రవీణ్, దుడ్డు సుధీర్ కుమార్, ముదాస్ సార్, జిల్లా కిషోర్ కుమార్, చంచల నిఖిల్, సత్య ప్రభువు లపై యేసు నమోదు చేయగా వీరిలో ఆరుగురు అరెస్టు చేయగా మరో ఏడుగురు పరారీలో ఉన్నట్లు సిపి పేర్కొన్నారు.నకిలీ సర్టిఫికెట్ల దందా విషయం తెలిసిన వెంటనే స్పందించి కేసును చేదించిన ఎల్బీనగర్ ఎస్ఓటి, సివిల్ పోలీసులను సిపి సుధీర్ బాబు అభినందించారు. అరెస్టు చేసిన వారిని కోర్టులో హాజరుపరిచి,పరారీలో ఉన్న వారిని వీలైనంత త్వరలో పట్టుకొని కోర్టులో హాజరుపరిచడం జరుగుతుందని రాచకొండ సిపి సుధీర్ బాబు స్పష్టం చేశారు.

# మంత్రివర్గ విస్తరణను అడ్డుకుంటున్న సిఎం రేవంత్ రెడ్డి

బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొత్త మంత్రివర్గ విస్తరణను అడ్డుకుంటున్న సూత్రధారి, కుట్రదారుడు సిఎం రేవంత్ రెడ్డి అని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో తన నివాసంలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. రాష్ట్రం దివాలా తీసిందని సిఎం ప్రకటించినా కూడా, డిప్యూటీ సిఎం భట్టి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సిఎం, భట్టికి విభేదాలు ఉన్నాయన్నారు. ఉద్యోగుల విషయంలో రేవంత్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి వర్గంలో విబేధాలు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రికి మంత్రుల మద్దతు లేదన్నారు. రాష్ట్రంలో ఫైనాన్షియల్ ఎమర్జెన్సీని పెట్టి సంక్షేమ పథకాలు, ఉద్యోగుల బకాయిలు ఎగ్గొట్టేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక ఎమర్జెన్సీ స్టేట్‌మెంట్‌ను మిగతా మంత్రులు వ్యతిరేకిస్తున్నారని, మంత్రి మండలి రెండుగా చీలిందని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రికి హైకమాండ్‌కు గ్యాప్ కంటిన్యూ అవుతోందన్నారు. అందుకే మొన్న రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చినా కూడా రేవంత్‌ను పలకరించలేదని తెలిపారు. రేవంత్ వ్యాఖ్యలు పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో లేకుండా చేసేలా ఉన్నాయని బహిరంగగానే కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని తెలిపారు. ఫైనాన్సియల్ ఎమర్జెన్సీ పెట్టాలనే ఆలోచనతోనే చీఫ్ సెక్రటరీగా రామకృష్ణ నియామకం జరిగిందన్నారు. సమీక్షలు అన్ని ముఖ్యమంత్రి నివాసంలో పెట్టడంతో సీనియర్ మంత్రులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొన్ని శాఖల్లో రేవంత్ జోక్యం చేసుకోవడం మంత్రులకు నచ్చడం లేదన్నారు. భూముల వ్యవహారంలో సిఎం, రెవెన్యూ మంత్రి మధ్య దూరం పెరిగిందన్నారు. మంత్రి వర్గంలో అనుకూలం కంటే వ్యతిరేక మంత్రులే ఎక్కువ అని రేవంత్ భావిస్తున్నారని, అందుకే మంత్రి వర్గ విస్తరణను ముఖ్యమంత్రి ఆపుతున్నారని వివరించారు. తనకు అనుకూలమైన వారికి మంత్రి పదవులు వచ్చే అవకాశం లేదని, తన దగ్గరున్న ముఖ్యమైన శాఖలు కొత్త వారికి వెళ్తే, ఆ శాఖలపై పట్టు పోతుందనే భయం రేవంత్‌కు ఉందన్నారు.

## తొలిసారిగా 17 మారుమూల
# నక్సల్ ప్రభావిత గ్రామాలకు విద్యుత్ సరఫరా

**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్ ప్రభావిత మోహ్లా-మన్‌పూర్-అంబాఘర్ చౌకి జిల్లాలోని దాదాపుగా ప్రవేశించలేని పర్వతాలు, దట్టమైన అడవుల మధ్య ఉన్న పదిహేడు గ్రామాలకు మొదటిసారిగా సరఫరా గ్రిడ్ నుండి విద్యుత్ సరఫరా లభించిందని అధికారులు శుక్రవారం తెలిపారు. ముఖ్యమంత్రి మజ్రతోలా విద్యుదీకరణ యోజన కింద రూ.3 కోట్లతో జరిగిన విద్యుదీకరణ ద్వారా సుమారు 540 కుటుంబాలు ప్రయోజనం పొందుతాయని వారు తెలిపారు. కఠినమైన భూభాగం కారణంగా, నక్సలైట్ ముప్పు మధ్య ఈ ప్రాంతాలకు చేరుకోవడం చాలా సవాలుగా ఉంది. ఈ గ్రామాల్లో గ్రిడ్ ద్వారా విద్యుత్ సరఫరా అందించడం ఒక లక్ష్యం కంటే తక్కువ కాదని అధికారిక ప్రకటన తెలిపింది. గ్రామాలకు బల్బులు వెలిగించడానికి సౌర విద్యుత్ అందుబాటులో ఉంది, కానీ నిర్వహణ సమస్యలను ఎదుర్కొన్నారు. అనేక గ్రామాల్లో సౌర ఫలకాలు దొంగిలించబడ్డాయి, దీని వలన పిల్లలు కిరోసిన్ దీపాల కింద చదువుకోవాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. 17 గ్రామాల్లోని 540 కుటుంబాలలో, ఇప్పటివరకు 275 కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు లభించాయి. మిగిలిన ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించే పని కొనసాగుతోందని ఒక అధికారి తెలిపారు. ఈ ప్రాంతంలోని ఇతర గ్రామాలకు త్వరలో విద్యుత్ అందించబడుతుందని ఆయన అన్నారు.

## మద్యం కుంభకోణం కేసులో
# ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టు





**విజయవాడ:** వైసిపి హయాం నాటి మద్యం కుంభకోణం కేసులో ఒకేసారి రెండు పెద్ద వికెట్లు పడ్డాయి. సుదీర్ఘ విచారణ తర్వాత నాటి సిఎం కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, జగన్ ఓఎస్‌డి కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. 3 రోజుల పాటు ప్రశ్నించిన సిట్ బృందం మద్యం కేసులో వీరి పాత్రపై స్పష్టత తీసుకున్న తర్వాత ఇద్దరినీ అరెస్టు చేసినట్టు గురువారం సాయంత్రం ప్రకటించింది. ఇవాళ ఉదయం నుంచి 9గంటల పాటు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌డ్డిని సిట్ విచారించింది. వీరిద్దరూ ఏ31, ఏ32 నిందితులుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి మే 16 వరకు తదుపరి చర్యలు చేపట్టవద్దని ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, విచారణకు హాజరుకావాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని విజయవాడలోని సిట్ కార్యాలయంలో అధికారులు 3 రోజులుగా విచారించారు. వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో.. నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, జగన్ ఓఎస్‌డి కృష్ణమోహన్ రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను ఇటీవల సిట్ నిందితులుగా చేర్చింది. ఈ కేసులో ఏ 33 నిందితుడుగా ఉన్న గోవిందప్ప మంగళవారం అరెస్టయిన విషయం తెలిసిందే.

**సుప్రీం కోర్టులో చుక్కెదురు..**

ఎపి మద్యం కుంభకోణం కేసులో సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డికి ముందస్తు బెయిల్ నిరాకరించింది. ఈ ఇద్దరు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేసింది. పిటిషనర్లకు వ్యతిరేకంగా అన్ని సాక్ష్యాలు ఉన్నాయని తెలిపింది. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వలేమని పేర్కొంది. వీరికి గతంలో ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. ఈ తీర్పును ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం విచారణ జరిపింది. ముందస్తు బెయిల్ ఇస్తే విచారణాధికారి చేతులు కట్టేసినట్లు అవుతుందని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పింది. రెగ్యులర్ బెయిల్‌కు అప్లై చేస్తే నిబంధనలు, మెరిట్స్ ప్రకారం హైకోర్టు, ట్రయల్ కోర్టులు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

# ఫైనాన్స్ వ్యాపారుల ఇళ్లల్లో పోలీసుల సోదాలు

ఆరుగురిపై కేసులు నమోదు
:ఎసిపి రమణమూర్తి వివరాలు వెల్లడి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా అధిక వడ్డిలకు నగదు ఇస్తున్న ఫైనాన్స్ వ్యాపారులు, చిట్టిల నిర్వహకుల ఇళ్లపై పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నగర ఏసిపి రమణమూర్తి నేతృత్వంలో పోలీసులు ఏకకాలంలో దాడులు చేసి సోదాలు చేపట్టారు. ఇందుకు సంబంధించి పట్టణ ఏసిపి ఎస్. వెంకట రమణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని పాకబండ బజారు, టీఎన్‌జీఓస్ కాలనీ, వేణుగోపాల్‌నగర్, పంపిగ్ వెల్ రోడ్డు, గాంధీనగర్, అల్లీపురం, కొత్త గూడెం, మంచుకొండ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా చిట్టీలు, రోజువారి గిరిగిరి ఫైనన్స్, అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్న వ్యాపారుల ఇళ్లలో ఆయా పోలీసు స్టేషన్‌ల సిబ్బందితో కలసి సోదాలు నిర్వహించారు. ఎనిమిది ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో లక్షల విలువ చేసే 62 ఖాళీ బ్యాంక్ చెక్కులు, 82 ప్రాంసరీ నోట్లు, 12 చిట్టి పుస్తకాలు లభ్యమైనట్లు తెలిపారు. చిట్టిల నిర్వాహకులు సభ్యుల నుంచి నగదు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా వారిని ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా వివిదాలు, ఘర్షణలు, దాడులకు దిగుతుండటంతో బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేస్తుండటంతో ఈ సోదాలు చేపట్టినట్లు ఏసిపి తెలిపారు. ఈ సోదాలలో 6 వ్యాపారులను గుర్తించి వారిపై ఖమ్మం వన్ టౌన్, టూ టౌన్, ఖానాపురం హవేలీ, రఘునాథపాలెం పోలీసు స్టేషన్‌లలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని రోజు వారి గిరిగిరి పేరుతో అధిక వడ్డీలకు నగదు వసూలు చేస్తే అటువంటి వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఏసిపి రమణమూర్తి హెచ్చరించారు. ఎవరైనా అనధికార చిట్టీలు, ఫైనాన్స్ వ్యాపారాలు నిర్వహిస్తే స్థానిక పోలీసు స్టేషన్‌లలో సమాచారం ఇవ్వాలని నగర వాసులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# దోహా డైమండ్ లీగ్ నీరజ్ చోప్రా సరికొత్త రికార్డు



90 మీటర్ల మార్కును దాటేశాడు..

భారత స్టార్ జావెలిన్ త్రో అథ్లెట్ నీరజ్ చోప్రా చరిత్ర సృష్టించాడు. తొలిసారి తన కెరీర్‌లో 90 మీటర్ల మార్కును అధిగమించాడు. దోహా డైమండ్ లీగ్ మూడో రౌండ్‌లో 90.23 మీటర్లు విసిరాడు. ఇప్పటి వరకు నీరజ్ అత్యుత్తమ ప్రదర్శన 89.94 మీటర్లు. 2022లో స్టాక్ హోమ్ డైమండ్ లీగ్‌లో జావెలిన్‌ను విసిరాడు. దోహాలో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన నీరజ్ అందుకు తగినట్లుగానే మంచి ఆరంభం అందించాడు. మొదటి రౌండ్‌లోనే 88.84 మీటర్లు విసిరాడు. ఇక రెండో రౌండ్‌లోనూ బాగానే విసిరినా.. అది ఫౌల్ అయింది. ఇక మూడో రౌండ్‌లో తన బెస్ట్‌ను అందించాడు. ఏకంగా 90+ మీటర్లు విసరడం విశేషం. నీరజ్ చోప్రా తర్వాత జులియన్ వెబర్ (89.06 మీటర్లు), అండర్సన్ పీటర్స్ (85.64 మీటర్లు) నిలిచారు.

# ఇంగ్లాండ్ టూర్‌కు ఇండియా-ఏ జట్టును ప్రకటించిన బిసిసిఐ

ముంబయి : త్వరలో జరగబోయే ఇంగ్లాండ్ టూర్ కోసం ఇండియా-ఏ జట్టును బిసిసిఐ ప్రకటించింది. ఈ జట్టు ఇంగ్లాండ్ లయన్స్ జట్టుతో రెండు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడనుంది. అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్న ఈ జట్టులో.. ధ్రువ్ జూరెల్ వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యాడు. యశస్వి జైస్వాల్, కరుణ్‌నాయర్‌లకూ చోటు కల్పించారు. శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ రెండో మ్యాచ్‌కు జట్టులో చేరతారు.

**మే 30న మొదటి మ్యాచ్..** జూన్ 6న రెండో మ్యాచ్ జరగనుంది. ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌లో భాగంగా ఈ జట్టు సీనియర్ సభ్యుల జట్టుతో జూన్ 13న ఓ మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత వారం అనంతరం ఇంగ్లాండ్‌తో టీమ్‌ఇండియా ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది.

ఇండియా-ఏ జట్టు ఇదే: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశస్వి జైశ్వాల్, కరుణ్ నాయర్, ధ్రువ్ జురెల్ (వైస్ కెప్టెన్), సుతార్, తనుష్ కొటియన్, ముకేశ్ కుమార్, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా, కంబోజ్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, సర్ఫరాజ్ ఖాన్, తుషార్ దేశ్‌పాండే, హర్ష్ దూబే.



# బడా బాబుల జోలికి వెళ్లని హైడ్రా

పేదల ఇళ్లనే కూలుస్తున్న వైనం
టిడిపి సికింద్రాబాద్ అధ్యక్షుడు సాయిబాబా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా పేరుతో కొత్త అలజడిని సృష్టించి, కోర్టులు మొట్టికాయలు వేసి వారించినా వినకుండా, పూర్వాపరాలు పరిశీలించకుండా పేదవాడి భూమిని నిర్దాక్షిణ్యంగా పేదవాడి ఇళ్లను కూల్చివేసే ప్రభుత్వం, ఎంతో మంది బడాబాబుల ఆస్తుల జోలికి వెళ్లడం లేదని సికింద్రాబాద్ పార్లమెంటు అధ్యక్షులు సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంతో మంది రాజకీయ నాయకులు, బడా బాబుల విలాసమంతమైన కబ్జా నిర్మాణాల జోలికి వెళ్లకుండా కేవలం పేద ప్రజల ఇల్లు కూల్చివేస్తున్నారని విమర్శించారు. పలుకుబడి ఉన్న నాయకులు చెరువుల్లో చెరువులో నిర్మాణాలు చేపట్టినా వారి జోలికి వెళ్లడం లేదన్నారు. రాజకీయ నాయకుల కబ్జాలను కాపాడటానికే హైడ్రా అవతరించిదని ఆరోపించారు. ముందుగా నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం సరైనదికాదన్నారు. అధికార పార్టీ నాయకులు, ఇతర రాజకీయ నాయకులు నిజంగా హైడ్రా పేరు సార్థకత కలగాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచించి, ఈ కూల్చిన ఇళ్లకు అనుమతులు ఎవరిచ్చారనే అంశంతో పాటు హైడ్రాపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి నల్లెల కిషోర్, పి.బాలరాజు గౌడ్, ఎస్.ప్రకాష్, కృష్ణస్వామి పాల్గొన్నారు.

# కోర్టు మేనేజర్ల పనితీరుపై రాష్ట్రాలకు నివేదిక

దిగువ న్యాయస్థానాలకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ :** దేశంలో కోర్టు మేనేజర్ల పనితీరుపై నిబంధనలను సవరించడం లేదా కొత్త నిబంధనలు తయారు చేసి ఆ నివేదికలను ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలకు సమర్పించాలని సుప్రీంకోర్టు శుక్రవారంనాడు దేశంలోని అన్ని న్యాయస్థానాలకు ఆదేశించింది. మూడు నెలల వ్యవధిలోపు ఈ నివేదికలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాషిశ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు మేనేజర్లను నియమించాలని దమూడవ ఆర్థిక సంఘం (2010–2013) సిఫార్సు చేసింది. దాని ప్రకారం న్యాయమూర్తుల పనితీరులో సహకారం అందజేసేందుకు వీలుగా పాలనాపరమైన విధుల నిర్వహణకుగాను ఈ కోర్టు మేనేజర్ల నియామకాలు జరిగాయి. జిల్లాస్థాయి కోర్టులలో, హైకోర్టులలో ఈ కోర్టు మేనేజర్లు ఉంటారు. 2018లో అసోం నిబంధనలను ఆసరాగా చేసుకుని ఈ నిబంధనలు తయారు చేశారు. ''కోర్టు మేనేజర్ల పనితీరుపై కొత్త నిబంధనలు తయారు చేయడం లేదా ఉన్న నిబంధనలలో సవరణలు చేయడం ద్వారా హైకోర్టులు రాష్ట్రాలలో ప్రభుత్వాలకు నివేదికలు ఇచ్చి ఆమోదం పొందాలి, మూడునెలల వ్యవధిలో ఈ ఆమోదం జరగాలి'' అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. హైకోర్టులకుగానీ, రాష్ట్రాలలో ప్రభుత్వాలకుగానీ ఈ కోర్టు మేనేజర్ల పనితీరులో మార్పులు చేర్పులు చేసుకోవడానికి, సవరణలు చేసుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఉందని జస్టిస్ గవాయ్ సారథ్యానగల ధర్మాసనం ప్రకటించింది. హైకోర్టులలో కోర్టు మేనేజర్లను నియమించినప్పుడు వారు హైకోర్టు రిజిస్ట్రార్స్, లేదా రిజిస్ట్రార్ జనరల్ పర్యవేక్షణలో, వారి ఆదేశాల ప్రకారం నడచుకోవాలని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.

# కలుపు మందు తాగి బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బంధువులు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన చీకటి దీప్తి (28) గంగారం గ్రామంలో స్థానిక సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతుంది. ఈ నెల 14 బుధవారం తల్లిదండ్రులు మందలించటం తో, మనస్థాపంతో ఇంటి ఆవరణలో ఉన్న కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు నిమిత్తం ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున చీకటి దీప్తి మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రైతులకు త్వరితగతిన పట్టాలు

ప్రజాపక్షం /తిరుమలగిరి సాగర్ : పైలట్ ప్రాజెక్టులో భాగంగా రాజవరం,నెల్లికలు రెవిన్యూ పరిధిలో భూ సర్వే ను పర్యవేక్షించిన మాజీ సిఎల్పి నేత కుందూరు జానారెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌లు అటవీ శాఖ అధికారులతో కలసి భూ సర్వే ను పరిశీలన చేసి త్వరగా పట్టాలు రైతులకు అందించాలని రెవెన్యూ అధికారులను శుక్రవారం ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైలెట్ రైతుల పనులను వేగవంతంగా పూర్తిచేసి పట్టాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, తిరుమలగిరి తాసిల్దార్ అనిల్ కుమార్, వట్టాల శ్రీనివాస్, పోలేపల్లి మల్లయ్య, చిన్న మైసయ్య, రైతులు మహిళలు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

ప్రజాపక్షం/ఆత్మకూర్(యం): మండలంలోని లింగరాజుపల్లి, పల్లెర్ల గ్రామాలలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా సమయానికి లారీలను పంపాలని లారీల గుత్తేదారును హెచ్చరించారు. ఆయన వెంట తహసిల్దార్ లావణ్య, ఆర్ఐ మల్లికార్జునరావు పాల్గొన్నారు.






## డెంగ్యీ పట్ల అప్రమత్తం

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: ప్రతి ఒక్కరు డెంగ్యీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, రాబోయే వర్షకాలంలో ఎప్పటికప్పుడు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి కోటా చలం అన్నారు. జాతీయ డెంగ్యీ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక సూర్యాపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి కోటా చలం మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఏడిఎస్ ఈజిప్ట్ అనే దోమ ద్వారా ఒకరినుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని అన్నారు. దోమలు ఇండ్ల పరిసరాలలో ఉన్న గ్లాబులు, తొట్లు, డ్రమ్ములు, ట్యాంకులలో నీటి నిల్వ ఉన్న చోట నీటిలో గుడ్లుపెట్టి వృద్ధి చెందుతాయని అన్నారు. జిల్లా మలేరియాప్రొగ్రాం అధికారి డాక్టర్ నాజీయ మాట్లాడుతూ డెంగ్యూవ్యాధి నమోదైన ప్రాంతంలో ఇండ్లలో దోమల నివారణకు మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో స్ప్రే చేయించాలన్నారు. ప్రజలందరు పడుకునే ముందు దోమ తెరలు వాడి దోమలు కుట్టకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయ మనోహరి, అశ్రీత, ఎఎంవో మోతిలాల్, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస రాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడ్డ కార్యకర్తలకే పదవులు

మహబూబ్‌బాద్ ఎమ్మెల్యే భూక్యా మురళినాయక్



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకే పదవులు దక్కుతాయని మహబూబ్‌బాద్ ఎమ్మెల్యే, పిసిసి పరిశీలకులు భూక్యా మురళినాయక్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసిసి అదేశాల మేరకు డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్ అధ్యక్షతన జరిగిన పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ బలపడాలంటే ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని, అర్హులైన నాయకులకు ఖచ్చితంగా పదవులు వస్తాయన్నారు. నాయకత్వం అందరికి అవకాశం ఇస్తుందని, క్షేత్రస్థాయిలో పనిచేసి కాంగ్రెస్ పార్టీకి మద్దతును పెంచాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయాన్ని సాధించేందుకు మనం అందరం కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహా పరిశీలకులు చత్రురావు, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బుచ్చిరెడ్డి మరణం వామపక్ష పార్టీలకు తీరని లోటు

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/చౌటుప్పల్ : మండలంలోని పంతంగి గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సీనియర్ నాయకుడు చిట్యాల బుచ్చిరెడ్డి మరణం ఈ ప్రాంత పేద ప్రజలకు, వామపక్ష పార్టీలకు తీరని లోటని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. చిట్యాల బుచ్చిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా స్వగ్రామం పంతంగికి వెళ్లి ఆయన పార్థివదేహం పై పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తొలితరం కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా కామ్రేడ్ కందాల రంగారెడ్డితో పనిచేసి ఈ ప్రాంతంలో పేద ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుండే వారన్నారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు పాల్గొన్నారు.

## సమాజానికి యువత ఆదర్శంగా...

జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్

ప్రజాపక్షం /హాలియా: చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజానికి నవ నిర్మాతలుగా ఎదిగి ప్రజలకు నేటి యువత ఆదర్శంగా ఉండాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ అన్నారు. గురువారం రాత్రి హాలియా పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మిషన్ పరివర్తన్ కార్యక్రమంలోఎస్పి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేసేందుకు సాధన చేయాలన్నారు.మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని,నేర నియంత్రణకు తోడ్పాలన్నారు. మిషన్ పరివర్తన్ ద్వారా మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారికి టెస్టుల ద్వారా గుర్తించి జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారిలో పరివర్తన తీసుకురావడానికి పోలీస్ వ్యవస్థ కృషి చేస్తుందన్నారు. విలేజ్ పోలీసింగ్ ద్వారా ప్రజలు మెరుగైన సేవలు వినియోగించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు, హాలియా సీఐ జనార్దన్ గౌడ్, ఎస్సై సతీష్ రెడ్డి, విపిఓ సరిత తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తా

మున్సిపాలిటీలో నూతన జనరేటర్, జెసిబి, రోబోటిక్ జట్టింగ్ మిషన్లను ప్రారంభించిన మంత్రి వెంకట్‌రెడ్డి



ప్రజా పక్షం/నల్లగొండ: మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు.శుక్రవారం నల్లగొండ మున్సిపాలిటీలో 15వ ఫైనాన్స్, మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.106.10 లక్షలతో నూతనంగా కొనుగోలు చేసి ఏర్పాటు చేసిన జనరేటర్, జెసిబి , ల్యాడర్ ను, అదేవిధంగా పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లినిక్ కు సంబంధించి వెల్స్ ఫార్గో అందజేసిన రోబోటిక్ జట్టింగ్ మిషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణంలో ప్రతి వార్డును అభివృద్ధి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్లు, తాగునీటి సమస్య లేకుండా అన్ని అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత మున్సిపాలిటీ అధికారులను మంత్రి ఆదేశించారు. వార్డులలో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపాలిటీ పబ్లిక్ హెల్త్ ఎస్ ఇ వెంకటేశ్వర్లు, ఈ ఈ మేడి రాములు, ఏఈ వగ్గే ప్రవీణ్ భార్గవ్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సమద్, ఆలకుంట్ల మోహన్ బాబు, కేసాని వేణుగోపాల్ రెడ్డి, గడిగ శ్రీనివాస్, బొజ్జ శంకర్, శ్రీనివాస్ , ఆమీర్ , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాష్ట్రంలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మిర్యాలగూడ మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. రైతుల కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోని మంచి దిగుబడులు సాధించాలని, పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు సాగునీటి సమర్థ వినియోగం, తక్కువ యూరియా, వాడకంపై అవగాహన కల్పించారు. విత్తనాల లభ్యత, పంట కోతలు, విత్తనాల కొనుగోలు సమయంలో రశీదులను భద్రపరచడం, సమగ్ర పురుగు, తెగుళ్ల మందుల వినియోగం, చెట్లు నాటడం వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ లింగయ్య, కేవీకే శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ, జిల్లా ఉద్యాన అధికారి అనంతరెడ్డి, నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి, మత్స్యశాఖ అధికారి కిశోర్, కృష్ణనాయక్, శ్రీనివాస్ రావు, చలపతిరావు, జిందా, రాంబాబు, నరసింహా పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/దేవరకొండ : ధాన్యం కొనుగోలు సెంటర్లలలో వీలైనంత త్వరగా రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన నియోజకవర్గ సిపిఐ కౌన్సిల్ సమావేశానికి హాజరైన పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అకాల వర్షాలతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటి పాలు అవుతూ రైతులు ఆవేదన చెందుతున్నారని, ఐకేపి, ప్రభుత్వ ధాన్యపు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం అయిందని, దేశాన్ని కార్పొరేట్‌లకు తాకట్టు పెట్టి దివాళా తీయించిందని అన్నారు. మోదీ నమ్మిన బంటు ఆదానికి ప్రభుత్వ రంగ సంస్థలను దోచి పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. విపక్ష పార్టీల నాయకులపై సిబిఐ, ఈడిలను ప్రయోగిస్తున్న మోడీ ప్రభుత్వం ఆదానిపై ఎందుకు ప్రయోగించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంపై మోడీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల పక్షాన కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. నూనె వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కనకాచారి, వెంకటయ్య, మైనోద్దిన్, వెంకటయ్య, జయరాములు, అచ్చయ్య, పాండురంగారెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

## రహదారిని ఆక్రమించి నిర్మాణం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని కలాల్‌వాడలో సిమెంట్ రహదారిని ఆక్రమించి మారం శ్రీనివాస్ అనే వ్యక్తి గదులు నిర్మిస్తున్నాడని పనులను అడ్డుకోవాలని స్థానికులు గురువారం మున్సిపల్ కమీషనర్ యూసుఫ్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా స్థానికుడు జయిని రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఏండ్ల తరబడి వినియోగించిన సిమెంట్ రహదారిని ఆక్రమించి నిర్మాణం చేపడుతుండగా స్థానికంగా నడిచి వెళ్లే వారికి, వాహనదారులకు ఇబ్బందులు కలుగుతుందన్నారు. గతంలో తాము అధికారులకు ఫిర్యాదు చేయడంతో కొంతకాలం నిర్మాణం ఆపేశారని, తిరిగి నిర్మాణం చేపడుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు. వినతిపత్రం అందచేసిన వారిలో గుండా రమేష్, వెంకటమ్మ, మదన్, దుర్గయ్య, రాంబాబు, లక్ష్మీ , శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పుష్పలత, కస్తూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మిల్లులకు ధాన్యం తరలించాలి

జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు

ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్ : ధాన్యం త్వరితగతిన కాంటాలువేసి మిల్లులకి తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని మోప్మా ఆధ్వర్యంలో నిర్వహించే రాయినిగూడెం, బాలెంల పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎర్కారం, పిల్లలమర్రి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 90శాతం ధాన్యం కొనుగోలు పూర్తి చేశామని, మిగిలిన ధాన్యం సాధ్యమైనంత త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేస్తామని, లారీలను సర్దుబాటు చేసి కొనుగోలు కేంద్రాలకు పంపించాలని, ఆకాల వర్షాలకు వడ్లు తడుస్తుండటంతో టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. మిల్లుల వద్ద ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకుని మూడు రోజులలో కాంటాలువేసి ధాన్యం మిల్లులకు తరలించాలని సూచించారు. ఇప్పటి వరకు రాయినిగూడెం కొనుగోలు కేంద్రం నుండి 6220 క్వింటాళ్లు, బాలెంల నుండి 17000 క్వింటాళ్లు, పిఎసిఎస్ పిల్లలమర్రి నుండి 13,333 క్వింటాల్లు, ఎర్కారం నుండి 17వేల క్వింటాళ్లు మిల్లులకి తరలించినట్లు తెలిపారు. అదే విధంగా తిరుమలగిరి మండలంలోని ఎఎస్‌ఆర్ రైస్ మిల్లును అకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన లారీలను ఎక్కువ మంది హమాలీలతో దిగుమతులు చేసుకోవాలని అదేశించారు. ఆయన వెంట తహసిల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్, సెంటర్ ఇన్‌ఛార్జిలు ఫణిమా, పుష్పలత, వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

కలెక్టర్ బి. ఎం సంతోష్ అధికారులకు ఆదేశం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి



ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి : జిల్లాలో లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాలో లో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకం పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలన్నారు. గ్రామ పంచాయతీ వారీగా లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తిచేసి, ఎంతమందికి ఇళ్లు కేటాయించారో, ఎంతమందిని అర్హులుగా గుర్తించారో, ఎంతమందిని నిరాకరించారో స్పష్టమైన జాబితా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత లేనివారి నిరాకరణకు గల కారణాలను కూడా జాబితాలో పేర్కొనాలని తెలిపారు. ఎంపీడీవోలు ప్రత్యేక అధికారులతో సమన్వయం చేసి ఇందిరమ్మ ఇళ్లు పరిశీలనను పూర్తి చేయాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరగాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో ఎంపిక జరగాలని అన్నారు. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి అర్హత ఉన్నవారిని మాత్రమే ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు, డిపిఓ నాగేంద్రం, ఈ.డి.ఎస్సీ కార్పొరేషన్ రమేష్ బాబు, ఎల్డీయం శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యక్రమాలను అరికడతాం

జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్

నల్లగొండలో కార్డెన్ అండ్ సెర్చ్...

500 ఇళ్లల్లో సోదాలు..

సరియైన పత్రాలు లేని 165 మోటార్ బైక్స్ , నాలుగు ఆటోలు,గంజా చాక్లెట్స్, రెండు హుక్కా పార్ట్, ఒక ఎయిర్ గన్ సీజ్



ప్రజాపక్షం /నల్లగొండ టౌన్: నేరాల నియంత్రణకై అనుమానిత వ్యక్తుల సమాచారం సమీప పోలీస్ స్టేషన్ కు అందించాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ సూచించారు. శుక్రవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పి మాట్లాడుతూ నల్లగొండ వన్ టౌన్ పరిధిలో గల మాన్యంచెల్కా లో శుక్రవారం తెల్లవారు జామున ఒక డిఎస్‌పి,8 మంది సీఐలు 24 యస్.ఐలు మొత్తం కలిపి 320 మంది పోలీస్ సిబ్బంది,ఒక ఎక్సప్లసివే డాగ్,నార్కోటిక్ డాగ్ తో దాదాపు 500 ఇళ్లల్లో సోదాలు చేయగా, సరియైన పత్రాలు లేని 165 వాహనాలు, నాలుగు ఆటోలు, గంజా చాక్లెట్స్, రెండు హుక్కా పార్ట్, ఒక ఎయిర్ గన్ సీజ్ చేయడం జరిగిందని తెలిపారు.ఎక్కువగా జార్ఖండ్,ఉత్తర ప్రదేశ్,బీహార్ రాష్ట్రాలకు చెందిన 150 అనుమానితులను గుర్తించడం జరిగిందని తెలిపారు.అలాగే నలుగురు రౌడీ షీటర్స్ అదుపులో తీసుకోగా వీరిలో ఒకరి వద్ద నుండి ఎయిర్ గన్ స్వాధీనం చేసుకోవడం జరిగిందనీ అన్నారు. మొత్తం 30 మందిని గాంజా టెస్ట్ నిర్వహించగా 8 మంది సేవించినట్టు టెస్టులో రిపోర్ట్స్ రావడం జరిగిందని, వీరు ఎక్కడి నుంచి కొనుగోలు చేసి సేవించారనే దానిపైన విచారణ జరుపుతున్నామని తెలిపారు.ముఖ్యంగా కమ్యూనిటి కాంటాక్టులో భాగంగా పట్టణంలో కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా, నేర నియంత్రణకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి శివరాం రెడ్డి,సీఐలు రాజశేఖర్ రెడ్డి, రాఘవరావు, ఆదిరెడ్డి, కొండల్ రెడ్డి, నాగరాజు, రాజశేకర్, సీఐ మహాలక్ష్మయ్య, కరుణాకర్ ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం సేకరణలో పకడ్బందీ చర్యలు

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/చండూరు : ధాన్యం కొనుగోలు సేకరణలో ఏలాంటి జాప్యానికి తావులేకుండా పకడ్బందీతో ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకొని చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం చండూరు మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భవిత స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. పాఠశాలలోని రెండు గదులను కేటాయించి అన్ని సౌకర్యాలను కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం అంగడిపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు గాను సంబంధిత అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రైతులు నుంచి తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతులు ఎవరు అధైర్య పడవద్దని చివరిగింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. రైతుల నుండి ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం నిల్వలు ,మిల్లులకు తరలించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎక్కడైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చండూరు ఆర్డీవో శ్రీదేవి, డిఈఓ భిక్షపతి, మండల స్పెషల్ ఆఫీసర్ రామకృష్ణ ,తహసీల్దార్ దశరథ , ఎంపిడిఓ యాదగిరి , ఎంఈఓ సుధాకర్‌రెడ్డి , అమరేందర్‌రెడ్డి , ఫణీంద్ర పాల్గొన్నారు.



## సేంద్రీయ ఎరువులతో భూసారం పెరుగుదల

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రైతులు రసాయన ఎరువులవాడకాన్ని తగ్గించాలని, సేంద్రీయ ఎరువులతోనే భూసారం పెరుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయశాస్త్రవేత్తలు జ్యోతి, అరుణకుమారి తెలిపారు. కల్వకుర్తి మున్సిపాలిటిపరిధిలోని సిలార్‌పల్లిలో కాంగ్రెస్ యువనాయకులు సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సునిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు హాజరై మాట్లాడుతూ ప్రతిరైతు పంటమార్పిడి పద్ధతి పాటించాలని సూచించారు. పంటమార్పిడితో తెగుళ్లు దరికి చేరవని, మంచిపంట దిగుబడి వస్తుందన్నారు. యూరియావాడకాన్ని తగ్గించాలని, సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు ,సూచనలు పాటించాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఎరువుల దుకాణాల్లో ఏవైన విత్తనాలు, మందులుగానికొంటే రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ చందన, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

## తాగునీరు ప్లాంట్ ప్రారంభించిన ఎస్పీ



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో కమ్యూనిటీ ప్యూర్ వాటర్ సంస్థ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి కింద మారుమూల గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ గురించి కమ్యూనిటి ప్యూర్ వాటర్ సంస్థ నుంచి మేనేజర్ రమేష్ మాట్లాడటం జరిగింది. సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరావు, ముజీబ్, సంతోష్, నర్సింహ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## జర్నలిస్టుకు ఘననివాళి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన రాష్ట్రీయ సహారా ఉర్దూదినపత్రిక జర్నలిస్టు ఖాజాతాహెర్ నిజామోద్దిన్ అహ్మద్ అకాల మృతిపట్ల టియూడబ్ల్యూజె(ఐజెయు) నాగర్‌కర్నూల్ జిల్లా నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం పట్టణంలోని జర్నలిస్టు నివాసానికివెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించి , కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుగా విధులు నిర్వర్తిస్తున్న తాహెర్ అకాల మృతి జర్నలిస్టు లోకానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో టియూడబ్ల్యూజె(ఐజెయు) సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, కందికొండ మోహన్, కొండకింది మాధవరెడ్డి, తాలుకా కార్యదర్శి సాయిలుసాగర్, కార్యనిర్వాహక కార్యదర్శి మహ్మద్‌ధర్వేష్, సభ్యులు మహ్మద్‌నజీర్ అహ్మద్, ముబీన్‌అహ్మద్‌ఖాన్, రాష్ట్రీయసహారా ఉర్దూ దినపత్రిక జిల్లా స్టాఫ్‌రిపోర్టర్ షేక్ ఫరీద్‌అహ్మద్, సియాసత్ దినపత్రిక జర్నలిస్టు మహ్మద్‌బాసిత్, కుటుంబసభ్యులు ఉన్నారు.

## పెండింగ్ బిల్లులు ఇవ్వాల్సిందే



**ప్రజాపక్షం/ధన్వాడ :** మండల కేంద్రంలోని లక్ష్మీ వాడలో మురుగు కాల్వల నిర్మాణం అస్తవ్యస్తంగా ఉండింది. లక్ష్మీ వాడలో అండర్ గ్రౌండ్ పైప్ లైన్ నిర్మాణ పనులు చేపట్టి మురుగునుంచి కాపాడాలంటూ ఆ వీధి ప్రజలు అంజన్నను కోరడంతో ఆ వీధిలో అండర్ గ్రౌండ్ పైప్ లైన్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ నేటికీ బిల్లులు రాలేదు అధికారులు స్పందించి అంజన్నకు బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. గ్రామాలలోని అండర్ గ్రౌండ్ పనులు చేయించిన అంజన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ అభివృద్ధి చేయడంలో చాటిలేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కేంచే భాస్కర్, ఇర్ఫాన్ అహమ్మద్ కేంచే శ్రీనాథ్‌తో పాటు పలువురు మైనారిటీ యువకులు పాల్గొని వినతి పత్రం అందించారు.

## వాహన తనిఖీలు




**ప్రజాపక్షం/నర్వ :** మండల పరిధిలోని కల్వలలో రహదారిపై స్థానిక ఎస్సై కురుమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం వెహికిల్ చెకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంఆయన మాట్లాడుతే ఎలాంటి పత్రాలు లేకుండా వాహనాలు నడపకూడదని నంబర్ ప్లేట్ లేని వాహనాలను, ట్యాంపరింగ్ చేసిన, సగం నంబర్ ప్లేట కలిగి ఉన్న వాహనదారులపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. తప్పనిసరి హెల్మెట్ ధరించాలని మద్యం తాగి వాహనాలు నడిపితే ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. మైనర్లు వాహనాలు నడిపి ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే క్రిమినల్ కేసులు తప్పవని ఎస్సై అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువుకట్ట రహదారి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామంలో చెరువు కట్ట మీద పోయే బాట ఎడమ వైపు కుడివైపు ముళ్ల కంపలు ఎక్కువ పెరగడంతో రైతులకు, ట్రాక్టర్లకు, ఎద్దుల బండ్లకు, ఇంకా ఇతర వాటికి కూడా చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. ముళ్ల కంపలను హిటాచి మిషన్ తో తీసివేయడం జరుగుతుంది. ఈ చెరువు కట్ట మధ్యభాగాలలో బండ్లు ఇరువైపులా రావడానికి వెడల్పు చేయడం జరుగుతుంది. ఈ విషయాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్, లక్ష్మణ్ నాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడం జరిగింది. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే మెగారెడ్డికి రైతులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్, లక్ష్మణ్ నాయుడు, రామన్ గౌడ్, ప్రభాకర్ గౌడ్ , కదిరే రాములు, రవి, రమేష్ , బాలరాజు, నవీన్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## డెంగీ నివారణపై ర్యాలీ




**ప్రజాపక్షం/బిజినేపల్లి :** జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం మండలపరిధిలోని లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దోమకాటు వ్యాధులపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించినట్లు లట్టుపల్లి వైద్యాధికారి డాక్టర్ టి. ప్రసన్న తెలిపారు. దోమకాటుతో మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, బోదకాలు, మెదడువాపువంటి వ్యాధులు వ్యాపిస్తాయని, వాటి నివారణకు లార్వాదశలోనే నివారించాలన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది గ్రామాలలో, గిరిజనతండాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ తేజస్విని, డాక్టర్ మేఘనారెడ్డి, సూపర్‌వైజర్ బాలమణి, ఆరోగ్య కార్యకర్తలు అబ్దుల్ సలీం, విజయలక్ష్మి , వరలక్ష్మి , ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొనుగోలు ప్రకియలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్


**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** అచ్చంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రైతులు తీసుకువచ్చిన వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ పరిశీలించారు. అకాలవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మార్కెట్లో అధికారులు తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాలవర్షాల ప్రభావంనుంచి ధాన్యాన్ని రక్షించేందుకు రైతులు టార్పాలిన్ కప్పి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా వర్షంవల్ల తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి, పాడి క్లీనర్ ద్వారా శుభపర్చి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ధాన్యం నాణ్యత, రైతుల అవసరాలు, డబ్బు చెల్లింపులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. హమాలీలు, లారీలను అదనంగా ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే ఎంపిక చేసిన మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఇప్పటివరకు రైతులతో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, రైతులకు డబ్బుల చెల్లింపులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్‌డిఓ మాధవి, తహసీల్దార్ చంద్రశేఖర్, డిఎస్‌డిఓ శ్రావణ్, డిటి హేమ్లానాయక్, శాఖల అధికారులు ఉన్నారు.

**ఇందిర సౌరగిరిజలవికాస పథకం ద్వారా గిరిజన రైతులకు ఆర్థికస్వావలంభన**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఇందిరసౌరగిరి జలవికాసం పథకానికి పైలట్ ప్రాజెక్టు ప్రారంభ పనులు వేగవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. అటవీహక్కుల చట్టం ఆర్‌ఓఎఫ్‌ఆర్‌కింద భూమి హక్కులు కలిగి ఉన్న గిరిజన రైతుల ఆర్థిక, జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి ఇందిర సౌరగిరి జలవికాస పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 18న ఈపథకాన్ని ప్రారంభిస్తున్నారని వివరించారు. ఇందిరసౌరగిరి జలవికాసపథకం ద్వారా రాష్ట్రంలోని 2.10లక్షలమంది గిరిజన రైతుల భూములకు విద్యుత్, సాగునీటి సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. మాచారం గ్రామంలోపైలట్ ప్రాజెక్టు ద్వారా ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు కలిగి ఉన్న 27మంది గిరిజన రైతుల 50 ఎకరాలకు సౌరశక్తితోకూడిన నీటిపారుదల అందించడానికి 16 బోర్లను వేసి స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందించేందుకు ఏర్పాటు చేశారు. ఇందిరాసౌరగిరి జలవికాసపథకంలో సౌరశక్తితో నడిచే నీటిపారుదల సౌకర్యం మాత్రమేకాకుండా, బిందుసేద్యం ద్వారా ఉద్యానవన పంటలకు మద్దతుతో నిమ్మ మొక్కలు, బత్తాయి మొక్కలు, మామిడిమొక్కలు, అవకాడ మొక్కలు, కొబ్బరి మొక్కలు, వెదురు మొక్కలను నాటి శాశ్వత దిగుబడి ప్రారంభమయ్యేవరకు ఇతర పంటల ద్వారా మధ్యంతర ఆదాయ మద్దతు కూడా అందించేందుకు ఈపథకం ద్వారా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలైన అవకాడో, వెదురు, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్ అంజీర్‌వంటి పంటలు గిరిజనులు సాగు చేసేందుకు కార్యచరణ రూపొందించుకొని ఉద్యానశాఖ అధికారులు గిరిజన రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, మన్ననూర్ ఐటిడిఎపిఓ రోహిత్ గోపిడి, డిటిడిఓ ఫిరంగి, డిపిఓ మోహన్‌రావు, జిల్లా ఉద్యానవన అధికారులు జగన్, లక్ష్మణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# లక్ష్యాలకు అనుగుణంగా ప్రగతి సాధించాలి

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నిర్దేశించిన లక్ష్యాల టార్గెట్‌లకు అనుగుణంగా ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.జయచంద్ర మోహన్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డా.శైలజ ప్రోగ్రాం అధికారులు కోఆర్డినేటర్లతో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత నీటి ద్వారా ప్రభలే వ్యాధుల సంక్రమణ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే జాతీయ కార్యక్రమాలైన క్షయ, లెప్రసీ, మలేరియా, ఎన్.సి.పి డి వంటి వ్యాధులను నివారించడానికి లక్ష్యాలకు తగ్గట్టు ప్రగతి సాధించే విధంగా ప్రతి ప్రోగ్రాం అధికారి దృష్టి సారించాలని సూచించారు. హెల్త్ వెల్నెస్ సెంటర్లు ఎన్ని ఉన్నాయి? ఎన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి? నిర్మాణ దశలో ఎన్ని ఉన్నాయి? మొదలైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు మొదలు పెట్టని సెంటర్‌లపై తొందరగా ప్రణాళిక రూపొందించి నిర్మాణాలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. శ్యామ్, మ్యామ్ పిల్లలపై దృష్టి సారించి వారి ఆరోగ్య స్థితిలో మెరుగు పరిచే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమీక్షలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుధేష్ణ, డాక్టర్ అనూష, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు అశోక్ కుమార్, ఎంపిహెచ్ఈఓలు విజయ్ కుమార్, గోవిందరాజు, డిపిఓ బిక్షపతి, ఎన్క్యాస్ క్వాలిటీ మేనేజర్ గౌతమ్, టిబి సూపర్ వైజర్ శ్రీధర్, ఎల్డీ కంప్యూటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పంటలపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలోని సిలర్‌పల్లి గ్రామంలో శుక్రవారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తలుఅనే కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్,శాస్త్రవేత్తలు జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు పాల్గొని పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్‌లు జ్యోతి, అరుణకుమారి, ఏఇఓ చందన, ప్రియాంక, కాంగ్రెస్‌పార్టీనాయకులు సతీష్, అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

## పదోన్నతులు మరింత బాధ్యత పెంచుతాయి



**ప్రజాపక్షం/వీపన గండ్ల :** పదోన్నతులు పోలీసులకు మరింత బాధ్యతను పెంచుతాయని, నిజాయితీగా ప్రజలకు సేవలు అందించాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. వీపనగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న చంద్రారెడ్డికి ఎస్‌ఐగా పదోన్నతి లభించడంతో జిల్లా ఎస్పీ పదోన్నతి చిహ్నాన్ని జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో చంద్రారెడ్డికి పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ పోలీసు శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. పదోన్నతులు పొందిన వారు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. పోలీసు శాఖలో క్రమ శిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు, గౌరవ మర్యాదలు లభిస్తాయని అన్నారు.

# పిల్లలమర్రి మహావృక్షం భద్రత ఏర్పాట్ల పరిశీలన

మిస్ వరల్డ్ 2025 బ్యూటీ కాంటెస్టెంట్ల పిల్లలమర్రి మహావృక్షం సందర్శన : జిల్లా ఎస్పీ డి.జానకి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మిస్ వరల్డ్ 2025 బ్యూటీ కాంటెస్టెంట్ల పిల్లలమర్రి మహావృక్షం సందర్శన జిల్లా ఎస్పీ డి.జానకి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ప్రపంచ ప్రఖ్యాత మిస్ వరల్డ్ 2025 (72వ ఎడిషన్) కాంపిటీషన్‌లో పాల్గొంటున్న 22 మంది సుందరీమణులు మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పిల్లలమర్రి మహావృక్షాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖ వారి కోసం ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లా ఎస్పీ డి.జానకి స్వయంగా కార్యక్రమ స్థలాన్ని పరిశీలించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక పోలీసు అధికారులతో సమన్వయం చేసుకొని, సుందరీమణుల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసే విధంగా చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా సిబ్బంది విస్తృత మోహరింపు, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ వంటి ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పిల్లలమర్రి మహావృక్షం వలె ప్రాచీన ప్రకృతి వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయడం గర్వకారణం విదేశాల నుండి వచ్చిన ప్రతినిధులు మన సంస్కృతిని, పర్యావరణాన్ని నేరుగా అనుభవించగలిగే అరుదైన అవకాశంగా ఇది నిలుస్తుంది. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన పోలీస్ శాఖ ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగలగడం ఆనందంగా ఉంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, పర్యాటక శాఖ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పిల్లలమర్రి ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు లభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# సాగుకు సిద్ధం చేసుకోవాలి

డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** వర్షాకాలసాగుకు రైతన్నలు నేలను అన్నిరకాలుగా సిద్ధం చేసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు నిర్వహించిన కార్యక్రమంలోభాగంగా శుక్రవారం తాడూరు మండలంలోని యత్మతాపూర్ గ్రామంలో రైతులకు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతన్నలు వర్షాకాలం సమీపిస్తుండటంతో ప్రస్తుతంపడుతున్న వర్షాలను లోతుగా దుందుకొని నేల తయారు చేసుకోవాలని సూచించారు. ఏనేలలో ఎలాంటి రకాల విత్తనాలను సాగు చేసుకోవాలో రైతులకు సూచించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం పాలెం కీటకశాస్త్రవేత్త డాక్టర్ శైల వర్షాకాలంలో పంటలలో వచ్చే వివిధరకాల పురుగులపై నివారణ చర్యలు ఏవిధంగా చేపట్టాలో తెలిపారు. అనంతరం మండల వ్యవసాయఅధికారి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ ముందుగా కరివేపాకు వేపకానుగా చెట్లను రైతులు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కార్తీక్, ఆదర్శరైతులు పాల్గొన్నారు. అదేవిధంగా తాడూరు మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో డాక్టర్ చరణ్‌తేజ్ మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తల అధికారుల సలహాలు సూచనలు సకాలంలో మంచిదిగుబడులు పొందవచ్చన్నారు. సమగ్ర యాజమాన్య వ్యవసాయ పద్ధతులపై మాట్లాడుతూ ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడటంవల్ల జరిగే నష్టాల గురించి క్షుణ్ణంగా వివరించారు. అనంతరం డాక్టర్ నీమాపర్వీన్ మాట్లాడుతూ రైతన్నలు డీలర్ల దగ్గర విత్తనాలు కొన్నప్పుడు తప్పకుండా రశీదులు పొంది భద్రపర్చుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం రైతన్నలు ఎక్కువగా వ్యవసాయ పొలం గట్లపైన శ్రీగంధం ఎర్రచందనం మునగ కరివేపాకు లాంటి చెట్లను సాగు చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల భవిష్యత్తులో మంచి లాభాలు ఉంటాయని రైతులకు సూచించారు. రైతన్నలతోపాటు ఇతరులు కూడా పెరట్లో తమకున్న తక్కువ స్థలంలో చిన్న చిన్న వర్మీకంపోస్టు ఎరువును సులువుగా తయారుచేసుకోవచ్చని వివరించారు. కళాశాల విద్యార్థులు రసాయన ఎరువుల మోతాదుకు మించి ఎక్కువగా వాడితే వచ్చే నష్టాలపై అవగాహన చేశారు. దీనిలో భాగంగా రైతన్నలకు చార్టులద్వారా చూపించారు. విద్యార్థులు స్రవంతి ఫౌజియా, మధుకర్, హరినాథ్, ప్రదీప్, గ్రామ మాజీసర్పంచ్, ఎంపిటిసిలు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## కెటిఆర్, హరీష్‌ను కలిసిన ఉప్పల



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** బిఆర్‌ఎస్‌పార్టీవర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీమంత్రి హరీష్‌రావును హైదరాబాద్‌లోవారినివాసంలో శుక్రవారం మిషన్ భగీరత మాజీ వైస్‌చైర్మన్, ఉప్పలచారిటబుల్‌ట్రస్టుచైర్మన్ ఉప్పలవెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని బిఆర్‌ఎస్‌పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అండగా ఉండటంకోసం చేయాల్సిన కార్యక్రమాలగురించి మాజీమంత్రులతో చర్చించినట్లు ఉప్పల వెంకటేష్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఎండగడుతూ పోరాటం చేయాలని మాజీ మంత్రులు కేటిఆర్, హరీష్‌రావు సూచించినట్లు పేర్కొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో డెంగీ నివారణ



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పరిసరాలు పరిశుభ్రతతోనే డెంగీని నివారించవచ్చని కల్వకుర్తి డిప్యూటి డిఎంహెచ్ఓ భీమానాయక్ తెలిపారు. శుక్రవారం జాతీయడెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీనిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా డెంగ్యూపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ శ్రీనివాస్, రఘుపతిపేట్ పిహెచ్‌సివైద్య సిబ్బంది, కల్వకుర్తి క్లస్టర్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


# దరఖాస్తులు సమర్పించండి

పార్టీ నేతలకు ఎమ్మెల్యే పిలుపు

**ప్రజాపక్షం/ జడ్చర్ల :** పిసిసి ఉపాధ్యక్షుడు, మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ డి.సాంబయ్య శనివారం జడ్చర్లకు రానున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులతో ఆయన మాట్లాడుతారని ఈ కార్యక్రమానికి అన్ని మండలాలకు చెందిన ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావాలనుకొనే వారు సాంబయ్యకు తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సాంబయ్య జడ్చర్లలోని చంద్రాగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతారని చెప్పారు. అలాగే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కావాలనుకోనే వారి నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి కావాలనుకొనే వారు జిల్లా కాంగ్రెస్ (డిసిసి) కార్యాలయం నుండి దరఖాస్తును తీసుకొని, దానిని పూర్తి చేసి, తమ ఫోటోతో పాటుగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి జడ్చర్ల నియోజకవర్గం పరిధిలోని జడ్చర్ల, మిడ్జిల్, ఊర్కొండ, నవాబుపేట, రాజాపూర్, బాలానగర్ మండలాలకు, జడ్చర్ల పట్టణానికి చెందిన ముఖ్య నేతలు అందరూ హాజరు కావాలని అనిరుధ్ రెడ్డి పిలుపునిచ్చారు.

# గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్ళవద్దు

జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీములతో ప్రజలు అప్రమత్తంగా వుండాలి ప్రజల సొమ్ము దోచుకోనేందుకు సైబర్ నేరగాళ్ళు రోజు, రోజుకి కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకోనేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారు. మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు. గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు, పెరుగుతున్నాయి. అని నిత్యవసర సరుకులు, గృహోపకరణాల, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు , క్రిప్టో కరెన్సీ మొదలగు వాటి పేర్లు చెప్పి ప్రజలకు ఆర్థిక మోసాలకు గురిచేసే మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మీ క్రింద ఎక్కువ మంది ఎజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని ఎస్పీ అన్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్థికంగా మోసం చేస్తూ చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చేప్తే అది మోసమని గ్రహించాలి, లేదంటే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు, అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం గొలుసుకట్టు మార్కెటింగ్‌లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే, ఇలాంటి నెట్వర్క్‌లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరు వెళ్ళవద్దు. సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి అనుమానస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకె ఫైల్స్ లాంటివి డౌన్లోడ్ చేయవద్దు. మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు.


ఫోకస్



# మనం ఒంటరేనా?

## కాలంతో సంబంధం లేని విశ్వం

న్యూటన్ సిద్ధాంతం ప్రకారం విశ్వంలోని ప్రదేశానికి పొడవు, వెడల్పు, ఎత్తు అనే మూడు పరిమాణా లుంటాయి. ఈ పరిమాణాలకు, కాల (time) పరిమాణానికి సంబంధం లేదు. ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం ద్వారా విశ్వంలోని మూడు పరిమాణాలకు కాల పరిమాణాన్ని కూడా జతపరిచాడు. అంటే ఆయన సిద్ధాంతం ప్రకారం విశ్వంలోని పరిమాణాలు నాలుగు. ఇక విశ్వంలో నాలుగు శక్తులుంటాయి. అవే గురుత్వ, విద్యుదయస్కాంత, దుర్బల, ప్రబల కేంద్రక శక్తులు. వీటిలో గురుత్వ




శక్తి తప్ప మిగతా మూడూ కణ సిద్ధాంతాన్ని అనుసరిస్తాయి. అంటే ఇవి విడివిడిగా ఉండే ప్యాకెట్ల లేదా క్వాంటంలాగా విశ్వంలో ఉంటే, గురుత్వ శక్తి మాత్రం ఖాళీ లేకుండా, అవిచ్ఛిన్నంగా వ్యాపించి ఉంటుంది. ఈ నాలుగు శక్తులనూ ఒకే తాటి పైకి తేవడానికి 'స్ట్రింగ్ థియరీ'ని ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతం ప్రకారం 11 పరిమాణాలు ఉంటాయి. అయితే విశ్వంలోని నాలుగు పరిమాణాలకు అదనంగా ఉండే 7 పరిమాణాలు మన కంటికి కనబడని అత్యంత సూక్ష్మ ప్రదేశాలకే పరిమితమై ఉంటాయి. ఉదాహరణకు సాలెగూడులోని పోగులు మన కంటికి ఒకే పరిమాణంలో కనిపిస్తాయి. అదే మైక్రోస్కోపులో చూస్తే అవే పొడవు, వెడల్పు, లోతు అనే మూడు పరిమాణాల్లో కనిపిస్తాయి. అలాగే స్ట్రింగ్ సిద్ధాంతంలోని తంత్రులలో ఉండే పదకొండు పరిమాణాలు ఉన్నాయనడానికి ఖగోళ, కణ శాస్త్రవేత్తలు వాడే సున్నితమైన పరికరాల ద్వారా సాక్ష్యం లభిస్తుంది.



విశ్వం అంత పెద్దదిగా ఉంటే, మనం మాత్రమే జీవించే జీవులు కావాలా? అనేది మరో ప్రశ్న. అనేక గ్రహాలు, నక్షత్ర వ్యవస్థలు ఉన్నాయి. కొన్ని బహుశా జీవానికి అనుకూల వాతావరణం కలిగి ఉండవచ్చు. మానవ జాతి ఎప్పటి నుంచో 'వెనకటి ఉనికి'ను వెతుకుతోంది. ప్రస్తుతం ఎస్ఇటిఐ (సెటి), జేమ్స్ వెబ్ టెలిస్కోప్ వంటి పరికరాలు ఇతర గ్రహాలపై జీవ సూచనలు వెతుకుతున్నాయి. నాసా, ఇస్రో వంటి సంస్థలు అంతరిక్షమంతటా సంకేతాల కోసం కృషి చేస్తున్నాయి. క్వాసార్లు, పల్సార్లు విశ్వంలోని అత్యంత శక్తివంతమైన వస్తువులు. ఇవి గాలాక్సీల హృదయంలో వెలుగుతున్న శక్తి కేంద్రీకృత కేంద్రాలు. పల్సార్లు: శబ్ద తరంగాలుగా మారే న్యూట్రాన్ నక్షత్రాలు. ఇవి ఒకదిశగా రెగ్యులర్‌గా రేడియో తరంగాలను పంపుతుంటాయి. నెబ్యులా అనేది నక్షత్రాల జనన గదులు. ఇవే భవిష్యత్తులో నక్షత్రాలు అవుతాయి. స్థూలంగా చెప్పాలంటే, ఈ విశ్వం మనకు ఎన్నో రహస్యాలు చూపిస్తున్నది. వాటిని అర్థం చేసుకోవాలంటే మానవ మేధస్సు, విజ్ఞానం, కృషి అన్నీ చేతులు కలపాలి. భగోళశాస్త్రం అనేది కేవలం శాస్త్రం కాదు. అది ఒక తాత్విక ప్రయాణం, మన స్థితిని అర్థం చేసుకునే సాధనం. మన విశ్వంలో సుమారు 200 బిలియన్ గాలాక్సీలు ఒక్కో గాలాక్సీలో వేల కోట్ల నక్షత్రాలు ప్రతి నక్షత్రం చుట్టూ అనేక గ్రహాలుఈ స్థాయిలో గణనలు చూస్తే, జీవం అనేది కేవలం భూమిపైనే ఉండే అరుదైన పరిణామం అనే భావన సందేహాస్పదంగా మారుతుంది. అనేక ఎక్స్‌ప్లానెట్లు (భూమిని పోలిన ఇతర గ్రహాలు) గుర్తించారు. హాబిటబుల్ జోన్ లేదా జీవానికి అనుకూల స్థలం అక్కడ ఉండవచ్చనే వాదన వినిపిస్తున్నది. ప్రతి నక్షత్రం చుట్టూ ఒక 'గోల్డిలాక్స్ జోన్' ఉంటుంది. దానిలో నీరు ద్రవంగా ఉనికిలో ఉండగలదు. ఇక్కడే జీవం పుట్టే అవకాశమూ ఎక్కువ. ఈ జోన్‌లో ఉండే అనేక గ్రహాలను కెప్లర్, జేమ్స్ వెబ్ టెలిస్కోప్‌లు గుర్తించాయి. ఉదాహరణకు కెప్లర్ 452బిని గుర్తించారు. ఇది భూమిలాంటి గ్రహం. మనకు అత్యంత సమీపమైన ఎక్స్‌ప్లానెట్. జీవానికి అవసరమైన మూలకాలు విశ్వవ్యాప్తమా? అనే ప్రశ్నకు కూడా సమాధానాలు కనుగొనే ప్రయత్నం జరుగుతున్నది. భూమిపైన జీవానికి అవసరమైన ముఖ్యమైన మూలకాలుగా కార్బన్ నైట్రోజన్, ఆక్సిజన్, సల్ఫర్ వంటి మూలకాలను పేర్కొంటారు. ఇవి అంతరిక్షంలోనూ, గ్రహనక్షత్ర వ్యవస్థలలోనూ పుష్కలంగా కనిపిస్తున్నాయి. అంటే జీవం తలెత్తే శక్తులు విశ్వంలో అన్ని చోట్ల ఉన్నట్టు తెలుస్తోంది. దీనిని నిర్ధారించుకోవడానికి శాస్త్రీయ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎలియన్లను వెతకడం ఎలా జరుగుతోంది. అంతరిక్షంలో నుండి వచ్చే రేడియో సిగ్నల్స్‌ను విశ్లేషించడంలో శాస్త్రవేత్తలు నిమగ్నమయ్యారు. దూర గ్రహ వాతావరణాలను విశ్లేషిస్తూ, ఆక్సిజన్, మీథేన్, వాటర్ వేపర్ వంటి జీవ సంబంధ సూచనల కోసం జేమ్స్ వెబ్ టెలిస్కోప్ వెతుకుతోంది. మంగళగ్రహంపై జీవ సంబంధ తాలూకు ఆధారాలను గుర్తించేందుకు శోధనలు జోరందుకున్నాయి. మన ఊహలకు అందిరిని తిలో జీవజాలం ఉండే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మన గ్రహంపై జీవానికి అనుకూలమైన వాతావరణం ఒక రీతిలో ఉంటే, విశ్వంలోని మరే ఇతర గ్రహం లేదా గ్రహాలపై మరో రకమైన జీవజాలానికి అనువైన వాతావరణం ఉండవచ్చని కొందరి భావన. భూమిపై జీవం నీరు ఆధారితంగా ఉంది. కానీ ఇతర గ్రహాలపై అమోనియా ఆధారిత జీవం లేదా సిలికాన్ ఆధారిత జీవం ఉండవచ్చు. ఉష్ణోగ్రతలకూ తట్టుకునే జీవులు (ఎక్స్‌ట్రీమోఫైల్స్) ఉండే అవకాశముంది .అంటే, జీవాన్ని మన భూమి ప్రమాణాలతో మాత్రమే అంచనా వేయకూడదు. ఊహ, కల్పనలు, వాస్తవం అనేవి మూతు దృక్కోణాలు. ఎలియన్‌లపై ప్రజల ఊహలను కొన్ని ప్రయత్నాలు... మరికొన్ని ప్రయోగాలు ప్రభావితం చేశాయి. కొన్ని ఎగిరే పళ్లాలు (అన్‌ఐడెంటిఫైడ్ ఫ్లయింగ్ ఆబ్జెక్ట్స్ (యుఎఫ్ ఒ)లు ప్రభుత్వాలు దాచేస్తున్నాయని నమ్మే వారు ఉన్నారు. కానీ, ఏలియన్స్ భూమిని సంప్రదించినట్టుగానీ, యుఎఫ్ ఒలు భూమిపైకి వచ్చాయని లేదా చక్కర్లు కొట్టాయనిగానీ చెప్పడానికి ఏ ఒక్క ఆధారం కూడా నమోదు కాలేదు. అయితే, మనం ఒంటరేనా? అనే ప్రశ్న మరోసారి తలెత్తినా, శాస్త్రవేత్తలు పూర్తిగా కొట్టిపారేయడానికి వీల్లేదనే అంటున్నారు. విశ్వం మన ఊహకు అతీతమైనది. జీవం పుట్టుక కేవలం భూమిపై మాత్రమే జరుగుతుందన్న అభిప్రాయం మరింత పొతద పుతోంది. శాస్త్రం, తాత్వికత, కల్పన.. ఇవన్నీ కలసి మనలో ప్రశ్నలు రేపుతున్నాయి. విదేశీ జీవం నిశ్చయంగా ఉండే అవకాశమే ఎక్కువ, కానీ అది ఎప్పుడు, ఎలా బయటపడుతుందనేది కాలమే చెప్పాలి.

## కాలాన్ని మింగేస్తున్న బ్లాక్ హోల్స్!

బ్లాక్‌హోల్స్ లేదా కృష్ణ బిలాలు అనేవి కాలాన్ని తినేస్తున్న గుట్టుచప్పుడుకాని రహస్య ప్రాంతాలు. ఇవి సృష్టిలోనే అత్యంత భయానకమైనవేగానీ ఆసక్తికరమైనవి. వాటి గాఢత కారణంగా, కనీసం కాంతి కూడా వాటి నుంచి బయటకు వెళ్లదు. ఈ బ్లాక్ హోల్స్ చుట్టూ 'ఇవెంట్ హొరైజన్' అనే గమ్యం ఉంటుంది. ఇది దాటితే తిరిగి రావడం అసాధ్యం. వాటిలో నిక్షిప్తమైన 'సింగ్యులారిటీ' వద్ద సాపేక్ష సూత్రాలు, క్వాంటం సూత్రాలు అన్నీ పని చేయకపోవచ్చు. అలా చూసినపుడు ఇది ఒక 'కాలానికి ద్వారం' కావచ్చనే అభిప్రాయం బలపడుతుంది. ఒక వేళ అదే జరిగితే, మనం భవిష్యత్తులోకి వెళ్ళగలగడం సాధ్యమా? శాస్త్రవేత్తలు ఈ ప్రశ్నకు సమాధానం కోసం ప్రయత్నిస్తునే ఉన్నారు. డార్క్ మ్యాటర్ లేదా డార్క్ ఎనర్జీ కనిపించవుగానీ, విశ్వాన్ని ప్రభావితం చేసే శక్తులు. విశ్వంలో మనం చూస్తున్న పదార్థం కేవలం 5 శాతం మాత్రమే. మిగిలిన 95 శాతం



డార్క్ మ్యాటర్, డార్క్ ఎనర్జీల రూపంలో ఉంటుంది. డార్క్ మ్యాటర్ వాటా సుమారు 25 శాతం. ఇది కనిపించదు. కానీ ఆకర్షణ శక్తిని కలిగించి గాలాక్సీల కదలికపై ప్రభావం చూపుతుంది. ఇక డార్క్ ఎనర్జీ సుమారు 70 ఆక్రమిస్తుంది. ఇది విశ్వ విస్తరణను వేగంగా కొనసాగిస్తుంది. ఇది ప్రతిక్షణం విశ్వాన్ని పెద్దదిగా చేస్తోంది. ఇవన్నీ మనకు చూపించకపోయినా, వాటి ప్రభావాలు మాత్రం ఖచ్చితంగా లభ్యమవుతున్నాయి. కానీ ఇవి నిజంగా ఏమిటి? వాటి మూలం ఏమిటి? అనే ప్రశ్నలు ప్రస్తుతానికి శాస్త్ర రంగంలో అర్థంగాని అంశాలుగానే ఉన్నాయి.

## ఆధునిక భౌతిక శాస్త్రంలో కీలక మలుపు 'స్ట్రింగ్'

స్ట్రింగ్ సిద్ధాంతాన్ని ఆధునిక భౌతికశాస్త్రంలో కీలక మలుపుగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇది ఒక అత్యంత అద్భుతమైన, క్లిష్టమైన సిద్ధాంతం. ఇది విశ్వంలోని మూలభూత కణాలను, శక్తులన్నింటినీ ఒకే క్రమంలో వివరించేందుకు శాస్త్రవేత్తలు రూపొందించిన విధానం. సాధారణంగా మనకు తెలిసిన 'క్వార్కులు', 'లెప్టాన్లు', 'గ్లూమ్స్' వంటివి పాయింట్ మాదిరిగా ఉండే మూలభూత కణాలుగా భావిస్తాం. కానీ స్ట్రింగ్ సిద్ధాంతం ప్రకారం, ఈ కణాలు నిజంగా చిన్న చిన్న "స్ట్రింగ్"ల మాదిరి ఉంటాయి. అవి ఒక పరిమిత పొడవున్న తూనికలులాగా కనిపిస్తాయి. ఈ స్ట్రింగ్‌లు వంపులు, కంపనాల రూపంలో కంపిస్తుంటాయి. ఒక్కో రకంగా కంపించే స్ట్రింగ్ ఒక రకమైన మూలకణాన్ని ఏర్పరుస్తుంది. ఉదాహరణకి, ఒక విధంగా కంపించే స్ట్రింగ్ ఫోటాన్ (ప్రకాశ కణం)లా పనిచేస్తుంది.. ఇంకొక రకంగా కంపించే స్ట్రింగ్ ఎలక్ట్రాన్‌లా పనిచేస్తుంది.



### ముఖ్య లక్షణాలు..

ఏకీకృత సిద్ధాంతం: స్ట్రింగ్ సిద్ధాంతం గురుత్వాకర్షణ, ఎలక్ట్రోమాగ్నెటిజం, బలమైన, బలహీన అణు బలాలను కలిపే ప్రయత్నం చేస్తుంది.

**బహుళ ఆయామాలు:** ఈ సిద్ధాంతం ప్రకారం విశ్వం 10 లేదా 11 ఆయామాలుగా ఉంటుంది (మనం అనుభవించేది మాత్రం 4 మాత్రమే) పొడవు, వెడల్పు, ఎత్తు, కాలం).

**సూపర్‌సిమ్మెట్రీ:** ప్రతి కణానికి ఒక 'భాగస్వామ్య కణం' ఉందని భావిస్తుంది. ఇది సూపర్‌సిమ్మెట్రీ సిద్ధాంతంతో కలిసిపోతుంది.

**గ్రావిటాన్ ఉనికి:** గురుత్వ బలాన్ని వివరించే గ్రావిటాన్ అనే తాత్విక కణాన్ని ఈ సిద్ధాంతం అంచనా వేస్తుంది.

### స్ట్రింగ్ సిద్ధాంత ప్రయోజనాలు..

విశ్వం ఎలా ఏర్పడిందో, మూల కణాలు ఎలా ప్రవర్తిస్తాయో మెరుగ్గా వివరించగలదు. 'బిగ్ బ్యాంగ్' తర్వాత జరిగిన పరిణామాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. క్వాంటం గురుత్వాన్ని పొందే మార్గాన్ని చూపుతుంది. అయితే, ప్రయోగాత్మకంగా ఈ సిద్ధాంతాన్ని సరిచూసేందుకు తగిన సాంకేతికత ఇంకా లేదు. గణిత పరంగా ఇది చాలా క్లిష్టమైనది. బహుళ ఆయామాల ఉనికిని ధ్రువీకరించడం ఇప్పటికీ కష్టమే. మొత్తం మీద స్ట్రింగ్ సిద్ధాంతం విశ్వంలోని గూఢమైన ప్రకృతిని అర్థం చేసుకోవడంలో ఒక అద్భుత ప్రయత్నం. శాస్త్రీయ అభిప్రాయాన్ని విస్తృతంగా మార్చే శక్తి దీనికి ఉంది. ప్రస్తుతానికి ఇది ఇంకా అభివృద్ధిలో ఉన్న సిద్ధాంతమే.

---

## నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలం

మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఉస్తేల సృజన



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** పెరుగుతున్న నిత్యావసర వస్తువల ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైయ్యాయని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ మహిళా సమాఖ్య మహాసభలో ఉస్తేల సృజన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో కేంద్రం విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల పేరుతో సుందరాంగులందరిని పిలిపించి తెలంగాణ వంటకాలను, పుణ్యక్షేత్రాలను, తెలంగాణ కట్టుబొట్టు సాంప్రదాయాలను చూపించడం మంచిదే కాని, తెలంగాణ ఆడపడుచుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వరంగల్‌లో సుందరాంగులకు కాళ్లు కడిగించడం సరైందికాదన్నారు. దాసర్ల దుర్గమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వరు, మహిళా సమాఖ్య నాయకులు ఎర్రబోతు పద్మ, ఎస్‌కె.షమీం, శాంతి, సిపిఐ మండల కార్యదర్శులు ఎండి.సయీద్, ధీరావత్ లింగానాయక్, జిల్లా యాదగిరి, పోలేపల్లి ఉదయ్‌కుమార్, ఎర్ర ప్రమీల, పోలేపల్లి మమత, లింగంపల్లి సైదమ్మ, కోటమ్మ, మచ్చ శైలజ, సైదమ్మ, రజియా, సుశీల, సీత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## సంస్థాగత ఎన్నికలకు సిద్ధమవ్వండి...

సిపిఐ నేతలు మొహ్మద్ మౌలానా, దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రాబోవు సంస్థాగత ఎన్నికలకు పార్టీశ్రేణులు సిద్ధమవ్వాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఖమ్మం రూరల్ మండల సమితి సమావేశాన్ని వెన్నం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు...ఖమ్మం రూరల్ మండలంలో సిపిఐ బలీయమైన శక్తిగా ఉందన్నారు. దీనికి మరింత వన్నె తెచ్చేలా కార్యకర్తలు, నాయకులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. బిజెపి చేస్తున్న మతతత్వ రాజకీయాలతో ప్రజలకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ స్వార్థ రాజకీయమే లక్ష్యంగా మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. కేబుల్ బ్రిడ్జి, రిటైనింగ్‌వాల్, తాళ్లేసితండ వద్ద ఇండ్లు, భూములు నష్టపోతున్న బాధితులకు నష్టపరిహారం అందించాలని మహాసభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, అజ్మీరా రామ్మూర్తినాయక్, సిద్ధినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, పగీళ్ల వీరభద్రం, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని అణిచివేయాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్




**ప్రజాపక్షం/చిట్యాల :** దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న ఉగ్రవాదాన్ని పూర్తిగా అణిచివేసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో సిపిఐ మండల మహాసభ శుక్రవారం స్థానిక గోపగోని నర్సింహ్మా ప్రాంగణంలో జరిగింది. మహాసభకు ముఖ్య అతిధిగా నెల్లికంటి సత్యం హాజరై మహాసభ జెండాను ఆవిష్కరించి ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. దేశ సమగ్రత, అంతరంగిక భద్రత విషయాలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకోవడం సరైనది కాదని విమర్శించారు. టెర్రరిజం పేరుతో భారతదేశాన్ని ఇబ్బందుల పాలు చేసే చర్యలను దేశం యావత్తు ముక్త కంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ఆదాని, అంబానీలకు కట్టబెడుతూ ప్రైవేట్‌పరం చేస్తున్నాడన్నారు. సామాన్యులు, పేదలు వాడే నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతూ, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలపై జిఎస్‌టి పేరుతో పన్నులు వేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం ఆందోళన చేస్తున్నప్పటికి వాటిని పట్టించుకోకుండా కార్మిక చట్టాలను మార్పులు చేస్తూ ప్రజా హక్కులను కాల రాస్తున్నాడని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను మార్పులను చేసే విధానానికి నిరసనగా జులై 9న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన విధానాలను మార్చుకోక పోతే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సత్యం అన్నారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలో సాగునీరు అందించే బి వెల్లంల, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువ పనులను వెంటనే పూరి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురుమిద్దె శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, అర్హులకు పెన్షన్‌లు ఇవ్వాలని కోరారు. మహాసభకు పార్టీ మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం అధ్యక్షత వహించగా, గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు, మండల కార్యదర్శి ఎండి అక్బర్, నాయకులు జిల్లా యాదయ్య, షేక్ షరీఫ్, సీమ అంజయ్య, కేతరాజు అంజయ్య, దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, జిల్లా లక్ష్మయ్య, దేవేందర్, గోపగోని శేఖర్, బొడిగె బక్కశెట్టి, పానుగుల శివ, నర్రా శేఖర్‌రెడ్డి, దూదిగాని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడాలి

ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

**ప్రజాపక్షం/వరంగల్‌ప్రతినిధి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్ తమ్మెర పోతన భవన్‌లో వరంగల్ జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రమేష్ మాట్లాడుతూ ఈనెల 20న జరగాల్సిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు, ప్రత్యేక పరిస్థితుల అనుగుణంగా జూలై 9 కి తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ 29 కార్మిక చట్టాలను రక్షించుకునే వరకు కేంద్రప్రభుత్వంపై పోరాటాన్ని ముమ్మరం చేస్తామన్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సాగర్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్, ఎఐఎఫ్టియు న్యూ జిల్లా కార్యదర్శి మురళి, సిఐటియు జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి. ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్. పాశం రవి, యాకూబ్, అక్కెనపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




## అనుమతులు లేకున్నా అడ్మిషన్లు చేస్తున్న శ్రీచైతన్య స్కూల్‌పై చర్యలు

ఎఐఎస్‌ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతి లేకున్నా అడ్మీషన్లు నిర్వహిస్తూ విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేస్తున్న శ్రీ చైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం డిమాండ్ చేశారు. విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతి లేకుండా అడ్మీషన్లు నిర్వహిస్తున్న కార్పోరేట్ విద్యాసంస్థ శ్రీచైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎఒ నాగజ్యోతికి ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి రఘురాం మాట్లాడారు. భవనం పూర్తి కాక ముందే శ్రీ చైతన్య విద్యాసంస్థ పేరుపై బ్రోచర్లు ప్రింట్ చేసి అడ్మీషన్లు చేస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే జిల్లా విద్యాధికారులు స్పందించి శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖాధికారులు స్పందించకపోతే ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు అంజలి, నవీన్, కృష్ణ, రమేష్, కార్తీక్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం సరికాదు

సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి :** ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలుతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజలకు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం సరైంది కాదని ఆయన అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అందజేస్తున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పంపిణి విషయంలో అధికారులు వెనుక పడ్డారని ఆవేధన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు నీటి సమస్యలు లేకుండా, రుణమాఫీ, రైతులకు విత్తనాలు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పట్టణ కార్యదర్శి ఎస్ అరుణ్‌కుమార్, ఏఐటియూసి వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, బిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కమలే రామదాస్, నాయకులు బెజ్జంకి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

## సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ జీతాలు చెల్లించండి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ వినతి



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** కుమురం భీం ఆసిఫాబాద జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, రోగుల సంరక్షణ, భద్రతా సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల భవిష్య నిధి (ఇపిఎఫ్) పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. ఈ మేరకు ఎఐటియుసి ఆధ్వర్యంలో కాగజ్ నగర్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య సేవల సమన్వయ కర్త (డిసిహెచ్‌ఎస్) చెన్నకేశవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ గత ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులు వారి కుటుంబాలతో కలిసి పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల గురించి అడిగినప్పుడల్లా కాంట్రాక్టర్లు రేపుమాపు అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. గత ఏడాది కాలంగా కార్మికులకు ఇపిఎఫ్ చెల్లించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని కాగజ్ నగర్, సిర్పూర్ టి, బెజ్జూర్, తిర్యాణి, వాంకిడి, జైనూర్ సిహెచ్‌సిలలో పనిచేస్తున్న సిబ్బంది ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి జీతాలు చెల్లించని కాంట్రాక్టర్ లేదా ఏజెన్సీలను నల్ల జాబితాలో పెట్టాలని, లేనిపక్షంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## మహిళలకు సర్టిఫికెట్లు అందజేత



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మాల్ గ్రామంలో టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ నేర్చుకున్న మహిళలలకు జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. రంగారెడ్డి జిల్లా జన శిక్షణా సంస్థాన్ కోఆర్డినేటర్ అంజలిదేవి, టీచర్ జ్యోతి, గ్రామ పెద్దలతో కలిసి మహిళలలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.80 మంది మహిళలకు మూడు నెలలు శిక్షణ ఇచ్చామని నిర్వాకులు తెలిపారు. నేర్చుకున్న పనితో మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చిన్నోళ్ళ పద్మ జాంగీర్, కాంగ్రెస్ పార్టీ యాచారం మండల కార్యదర్శి బట్టు శ్రీనివాస్, దేరంగుల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## 20న నిరసనలు, ర్యాలీలు

ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జూలై 9కి వాయిదా వేసినట్టు ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి తెలిపారు. 20న జరిగే సాధారణ సమ్మె పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న పరిశ్రమలు, కార్యాలయాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శేషరాజు పల్లి శ్రీదేవి, ఏఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు మందుల కృష్ణ, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రమావత్ సక్రు నాయక్, ఏఐటియుసి మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు పాల్గొన్నారు.

## మన్సూరాబాద్ పెద్ద చెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు

జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** మన్సూరాబాద్ పెద్ద చెరువులో మురుగునీరు కలవకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా మన్సూరాబాద్ పెద్ద చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీరు చెరువుల్లో కలవకుండా జిహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు జాగ్రతలు చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, వేమన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి,మెరిశెట్టి సంతోష్, కవితారెడ్డి పాల్గొన్నారు.

## కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాలనీల సమస్యల పరిష్కారానికి తన కృషి ఉంటుందని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని శుభోదయ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో విద్యుత్ దీపాలు, పార్కులకు ప్రహరీ గోడపై పెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి సమయంలో పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్ దృషికి తీసుకొచ్చారు. పార్కుకు అన్ని విధాలు వసతులు కల్పిస్తామని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేస్తామన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రమావత్ హేము నాయక్, కాలనీ అధ్యక్షులు నరసింహ, సభ్యులు గాఫర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహాల జియో ట్యాగింగ్



**ప్రజాపక్షం/గండిపేట:** ఇందిరమ్మ గృహాల జియో ట్యాగింగ్‌ను మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ గృహాల మొదటి జాబితాలో ఎంపికైన లబ్దిదారుల ఇంటి వద్ద జియో ట్యాగింగ్ చేస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మొదటి జాబితాలో 23 మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు తెలియజేశారు కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్, బిల్ కలెక్టర్ శ్రీధర్ వర్మ ,లక్ష్మారెడ్డి, వార్డు ఆఫీసర్ నరసింహ, ఆపరేటర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర యాజమాన్య పద్ధతిలో విత్త-నాలు వేస్తే పంట దిగుబడి



**ప్రజాపక్షం/షాబాద్:** సమాగ్ర యాజమాన్య పద్ధతిలో విత్తనాలు విత్తితే పంటల దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పి.సతీష్ సూచించారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రైతు మార్కెట్‌లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి ప్రధాన పంటలు, మార్కెటింగ్ గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి బి.వెంకటేష్ విత్తన సబ్సిడి గురించి, యంత్రీకరణ పద్దతుల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పాండు, పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి టి.గీత, వ్యవసాయ విద్యార్థులు ప్రవీణ్ కుమార్, స్నేహాతోపాటు రైతులు పాల్గొన్నారు.

## సమర్థంగా సంక్షేమ పథకాల అమలు



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని యాచారం ఇన్‌చార్జి ఎంపిడిఒ శైలజ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వన నర్సరీలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో అందరు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఇంజనీర్ శివ శంకర్‌రెడ్డి, పంచాయతి కార్యదర్శి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో సమస్యలు రాకుండా ఏర్పాట్లు

అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలి

జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలంలో నగర ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ అన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం వర్షాకాల సన్నద్ధతపై జిహెచ్ఎంసి ఇంజనీరింగ్, ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్‌లతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పూడికతీత పనుల పురోగతి, వాటర్ లాగిన్ పాయింట్లు, వర్షాలతో సంభవించే సంక్షోభ పరిస్థితుల పరిష్కారంపై చర్చించి, పలు సూచనలు చేశారు. జోన్‌ల వారీగా సమస్యల పరిష్కారాలపై సమీక్షించారు. నగరంలోని ప్రధాన నాలాలు, వర్షపు నీటి డ్రెయిన్‌లను వేగవంతంగా పూర్తిగా శుభ్రం చేయాలని ఆదేశించారు. వరదనీరు నిలిచే ప్రాంతాలకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్, జిహెచ్ఎంసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను అవసరం మేరకు ఏర్పాటు చేయాలన్నారు. మాన్సూన్ సీజన్‌లో నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతమైన సేవలు అందించేందుకు అన్నిశాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

**వర్షాలలో వేగంగా సమస్యలు పరిష్కరించాలి..** మొబైల్ రెస్పాన్స్ టీమ్ వాహనానికి జిహెచ్ఎంసి లోగోతో సైనేజి బోర్డు పెట్టాలని, వారి ఫోన్ నెంబర్లను అన్ని పోలీస్‌స్టేషన్‌లో (ఎస్‌హెచ్‌ఓ) ఇవ్వాలన్నారు. జిహెచ్ఎంసి, ట్రాఫిక్ పోలీస్‌శాఖల మధ్య సమన్వయం ఉండేలా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలు నివారించేందుకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను ముందస్తుగా సిద్ధం చేయాలని సూచించారు. మాన్సూన్ సమయంలో సమస్యలకు వేగంగా పరిష్కరించేలా ఆయా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న డిప్యూటీ ఈఈ, ఏఈలు 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని, పోలీస్ కంట్రోల్ రూం వద్ద జిహెచ్ఎంసి స్టాఫ్ షిఫ్ట్ సిస్టమ్ 24 గంటల పాటు పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

**త్వరలోనే అన్ని శాఖలతో సమన్వయ సమావేశాలు..** ప్రధాన సమస్యగా ఉన్న వరదనీరు నిలిచే ప్రాంతాలలో సమస్య పరిష్కారానికి పోలీస్ ఏసిపి, జోనల్ కమిషనర్ సంయుక్తంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మాన్సూన్‌లో మిగతా శాఖలు భాగస్వామ్యులుగా ఉన్న శాఖలతో సమన్వయ సమావేశం త్వరలో ఏర్పాటు చేస్తామని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. వీధి లైట్‌ల సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తున్నట్లు, ఇప్పటి వరకు వచ్చిన పిర్యాదులలో 70 శాతం పరిష్కరించినట్లు తెలిపారు. జడ్‌సి, ఇంజనీరింగ్ నిర్వహణ శాఖ అధికారులు తరచూ పరిశీలన చేయాలన్నారు.

### రోడ్డు తవ్వకాలు జరిపిన వెంటనే మరమ్మతులు చేయాలి : జోయల్ డేవిస్

అదనపు పోలీస్ కమిషనర్(ట్రాఫిక్) జోయల్ డేవిస్ మాట్లాడుతూ రోడ్డు తవ్వకాలు చేసి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. చెట్లు పడిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందన్నారు. వర్షాల సందర్భంగా వాహనాలు బ్రేక్ డౌన్ అయ్యే సందర్భంలో సమస్య ఎదురవుతుందని, జిహెచ్ఎంసి పెద్దక్రేన్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో జోనల్ కమిషనర్లుహేమంత్ కేశవ్‌పాటిల్, అనురాగ్ జయంతి, ఎన్.రవికిరణ్, వెంకన్న, అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవ్ రావు, చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, సి.ఈ సహదేవ్ రత్నకార్, జోనల్ ఎస్‌ఈలు మహేశ్వర్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డ్రగ్ కంట్రోల్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ లు కలిసి పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని డ్రగ్ కంట్రోల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అన్నారు. ఎక్సైజ్, డ్రగ్స్ కంట్రోల్ అధికారుల సమన్వయ సమావేశం అబ్కారీ భవన్లో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో రెండు శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రాణహాని, మత్తు కలిగించే నిషేదిత మందుల వినియోగం, డ్రగ్స్, గంజాయి, ఇతర రకాల డ్రగ్స్ వినియోగంతో యువత నష్టపోతున్నారన్నారు. ఎక్సైజ్, డ్రగ్స్ కంట్రోల్ అధికాలు కలిసి పని చేయడానికి ఉన్న అవకాశాలు ఏమిటి అనే అంశంపై చర్చించుకోవాలని, కలిసి దాడులు చేయడానికి ప్రాంతాలను గుర్తించి ముందుకు సాగాలన్నారు. రెండు విభాగాల్లో సమాచార వ్యవస్థను వృద్ది చేసుకోవడానికి నలుగురితో కూడిన కామన్ ఇంటెలిజెన్స్ బృందాలను ఏర్పాటు చేసుకోవాలని, ఇండస్ట్రియల్, ఫోరెన్సిక్ ల్యాబ్లు, జాయింట్ ట్రెయినింగ్, రైడ్స్, వాట్సాప్ గ్రూప్, ఇంటర్నేట్లో జరుగు తున్న డ్రగ్, డ్రగ్స్ వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యచరణకు ఒక రూట్‌మ్యాప్ తీసుక రావాలన్నారు. సమన్వయ సమావేశంలో ఎక్సైజ్ శాఖజాయింట్ డైరెక్టర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, డ్రగ్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ రామ్‌ధన్, డిప్యూటి కమిషనర్లు కెఎబి శాస్త్రీ, పి.దశరథ్, అడిషనల్ ఎస్‌పి భాస్కర్, అసిసెంట్ డైరెక్టర్ డి.సరిత, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవీ, ఎస్‌టి ఎఫ్ టీమ్ లీడర్లు అంరెడ్డి, ప్రదీప్‌రావు, తుల శ్రీనివాసరావు, తిరుపతియాదవ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీ నారాయణ, చైతన్య, గోవింద్ సింగ్, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

## రక్షణ దళాలకు సంఘీభావంగా రైల్వే అధికారుల ఫ్లాగ్‌మార్చ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ నేతృత్వంలో శుక్రవారం 'ఆపరేషన్ సిందూర్' విజయానికి గుర్తుగా సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ప్రధాన కార్యాలయం రైల్ నిలయం నుండి సంగీత్ జంక్షన్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ కంట్రోలర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (జి) ఉదయనాథ్ కోట్ల, భారత్ స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్ ఎ.కె.రావత్; డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్ఆర్.షెల్‌కెతో పాటుఅధికారులు, రైల్వే సిబ్బంది, దక్షిణ మధ్య రైల్వే స్కౌట్స్, గైడ్స్ నుండి వాలంటీర్లు ఆర్‌పిఎఫ్ సిబ్బంది ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. 'ఆపరేషన్ సింధూర్' విజయంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఉగ్రవాదాన్ని అణచివేయడంలో భారత సాయుధ దళాలు ప్రదర్శించిన పరాక్రమానికి సంఘీభావాన్ని తెలియజేయడం ఈ ఫ్లాగ్ మార్చ్ లక్ష్యం అని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు.

## నిమ్స్‌లో స్లిట్ ల్యాంప్ ప్రారంభం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పిల్లల్లో దృష్టి లోప నివారణకు, రుమటాలజీ రోగుల చికిత్స నిమిత్తం నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) లోని పీడియాట్రిక్ విభాగం ఇమ్యునాలజీ, రుమటాలజీ క్లినిక్‌లో రూ.4లక్షల విలువైన అత్యాధునిక స్లిట్ ల్యాంప్‌ను శుక్రవారం నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ప్రారంభించారు. కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, ఎల్వీపిఇఐ వైద్యులు డాక్టర్ ప్రశాంత్ గార్గ్ , యువెటిస్ స్పెషలిస్ట్‌లు డాక్టర్ బసు, డాక్టర్ షస్తాప్, నిమ్స్ వైద్యులు డాక్టర్ కీర్తి వర్దన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మ్యాన్‌హోల్స్‌లో చెత్త, వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నంబర్ 2 రియాసత్ నగర్ పరిధిలోని మలక్ పేట్, నల్లగొండ చౌరస్తా లో సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్యను పరిష్కరించారు. ఇక నుంచి ఎవరైనా మ్యాన్ హోల్స్ లలో చెత్త, వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. జెట్టింగ్ యంత్రాన్ని ఉపయోగించి సిల్ట్‌ను బయటికి తీసి మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు. ఈ ప్రాంతాల్లో తరుచూ సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫిర్యాదులు నమోదవ్వడంతో అధికారులు డీ సిల్టింగ్ పను చేపట్టారు.. అయితే మ్యాన్ హోల్స్‌లలో నుంచి బ్లాంకెట్స్, బెడ్ షీట్లు, బట్టలు, ప్లాస్టిక్ వస్తువులు ఇతర ఘన పదార్థాలను గుర్తించారు. తద్వారా ఆ ప్రాంతంలో సీవరేజ్ ఓవర్ ఫ్లో అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. వాస్తవానికి స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఇక్కడ డీసిల్టింగ్ పనులు నిర్వహించి సిల్ట్ అంతా తొలగించారు. కానీ మళ్లీ అందులో వ్యర్థాలు వేయడం ద్వారా పేరుకుపోయి మళ్లీ ఓవర్ ఫ్లో అవుతుంది. ప్రజల అవగాహన లేమితోనే సమస్య మళ్లీ ఉత్పన్నమవుతుందని అధికారులు తెలిపారు. ప్రజలలో అవగాహన, వారి నుంచి సరైన సహకారం లేకుంటే ఇలాంటి స్పెషల్ డ్రైవ్ లు ఎన్ని నిర్వహించినా సమస్యలు ఇలాగే వస్తాయని అధికారులు సూచించారు. తమ ప్రాంతాల్లో సిల్ట్ ఛాంబర్లు ఏర్పాటు చేసుకుంటే, ఘన వ్యర్థాలు అందులోనే ఆగి మ్యాన్ హోళ్లలోకి మురుగు నీరు మాత్రమే ప్రవహిస్తుందని, తద్వారా వాటిలో నుంచి వచ్చే వ్యర్థాలు మ్యాన్ హోళ్లలో కలవకుండా ఉంటాయని అధికారులు సూచించారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మీ



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం సాధ్యమని, దోమలను నియంత్రించేందుకు ప్రజలందరు కృషి చేయాలని, ప్రజల ఆరోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలనే విషయాన్ని గమనించాలని షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం జాతీయ డెంగ్యు దినోత్సవం సందర్భంగా షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఫరూఖ్‌నగర్ గాంధీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ దోమలు కుట్టకుండా చూద్దాం..పుట్టకుండా చూద్దాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడేగా పాటిద్దాం..దోమల అంతానికి కళ్లెం వేద్దామని నినాదాలు ఇస్తూ ర్యాలీ కొనసాగించారు. ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలందరు కృషి చేయాలని, నీరు నిల్వలేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని దోమలను నియంత్రించేందుకు ప్రజలందరు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కార్తీక్, డాక్టర్ జగదీష్, డాక్టర్ సంధ్య, డాక్టర్ బిందు, డాక్టర్ ఉష, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, హెల్త్ సూపర్ వైజర్లు అమృత, శ్రీరామ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై అసత్య ఆరోపణలు సరికాదు

షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు చేయడం లేదని బిజెపి నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ అన్నారు. శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబర్ ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ద్వార మార్కెట్ యార్డు పరిధిలో ఇప్పటి వరకు 24వేల 630 ధాన్యం బస్తాలను కొనుగోలు చేసినట్లు వివరించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యానికి టెండర్లు వేయడం జరుగుతుందని, మార్కెట్‌కు అన్నదాతలు తీసుకువచ్చిన ధాన్యం ఎక్కడ తడిసిపోలేదన్నారు. తేమ శాతం బట్టి క్వింటాల్ ధాన్యానికి రూ.2320 నుండి 2350వరకు చెల్లించడం తోపాటు అదనంగా రూ.500బోనస్ ఇస్తున్నామని గుర్తు చేశారు. వాస్తవాలను పక్కన పెట్టి ఆసత్య ఆరోపణలు చేయడం బిజెపి నాయకులు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్, వెంకట్‌రెడ్డి, మల్లేష్, సురేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమం, అభ్యున్నతికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** మహిళల సంక్షేమం, అభ్యున్నతికి మొదటి ప్రాధాన్యత కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారం గ్రామంలో జై భీమ్.. జైబాపు.. జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగానికి సంబంధించిన పుస్తకాలను గ్రామంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మహిళలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని, ఎవరు అధైర్య పడొద్దని సూచించారు.

**పార్కులపై ప్రత్యేక దృష్టి పెట్టండి**

షాద్‌నగర్ మున్సిపాలిటీలో ఉన్న పార్కులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులోని ప్రభుత్వ పార్కు స్థలంలో రూ.8లక్షలతో చిన్న పిల్లల ఆట వస్తువుల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పార్కు స్థలాలను పరిరక్షించే బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెర్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మాజీ కౌన్సిలర్ శాంతమ్మ, నాయకులు అగ్గనూరి బస్వం, చెంది తిరుపతిరెడ్డి, జమ్రుద్‌ఖాన్, మహ్మద్ ఇబ్రహీం, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వీధి జంతువుల పునరుత్పత్తి నియంత్రణకు చర్యలు...** వీధి జంతువుల పునరుత్పత్తి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీధి కుక్కల నుండి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను సందర్శించిన తూంకుంట కమిషనర్



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** తూంకుంట మున్సిపల్ పరిధిలోని జిహెచ్ఎంసి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటగోపాల్ శుక్రవారం సందర్శించారు. కాలనీ వాసులకు నీటి సరఫరా, విద్యుత్ తదితర వసతులు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగామాట్లాడుతూ తూంకుంటలోని డబుల్ బెడ్‌రూమ్‌లలో ఇప్పటివరకు 456 కుటుంబాలు గృహప్రవేశాలు చేయడం జరిగిందన్నారు. ఈ కుటుంబాలకు అందుతున్న మౌలిక సదుపాయలను స్వయంగా అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఇఇ సునీత, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## సిపిఐ కాప్రా మండల నూతన కమిటి ఎన్నిక

**ప్రజాపక్షం/కాప్రా :** సిపిఐ కాప్రా మండల కార్యదర్శిగా దర్శనం యాదగిరి, సహాయ కార్యదర్శులుగా జి.లక్ష్మి నారాయణ, మోతె రాజేశ్వరిలు ఎన్నికయ్యారు. కాప్రా మండల పార్టీ 2వ మహాసభలో జరిగిన నూతన కమిటి ఎన్నికల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి డిజి సాయిలు గౌడ్, సహాయ కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, ఉమామహేష్‌లు మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేస్తూ త్వరలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గం మాజీ ఎంపిటిసి, జిల్లా కార్యవర్గ సభ్యుడు తోటపల్లి శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు దశరథ, ఎస్. శంకర్‌రావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింలు, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప, సత్యం, కురుమయ్య, మండల మహిళా అధ్యక్షురాలు జయమ్మ, పి.లక్ష్మణ్, ఎఐటియుసి అంబాల ఎల్లయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బహదూర్ పల్లి డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల వద్దకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం బహదూర్‌పల్లి డబుల్ బెడ్ రూమ్ సొసైటీ సభ్యులు, లబ్ధిదారులను, సంబంధిత ప్రభుత్వ అధికారుల ముందు వారి సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపరని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, బహుదూర్ పల్లి డబుల్ బెడ్ రూమ్ లో పేద ప్రజల దగ్గర నుండి పైసలు వాసులు చెయ్యడన్ని సొసైటీ సభ్యులను తీవ్రంగా ఖండించారు. డబుల్ బెడ్ రూమ్‌లో ఉన్న త్రాగునీటి సమస్యలు, డ్రైనేజి సమస్యలను పరిష్కరిస్తానని ప్రభుత్వం నుండి వచ్చిన నోటీసుల వల్ల ఆందోళన చెందొద్దని ఆ నోటీసులకు రిప్లై లెటర్ రాసి సంబంధిత అధికారుల ఇవ్వాలని పేద ప్రజలపై మళ్ళీ ఇలాంటివి పునరావృతం చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, బహదూర్ పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సాదు యాదవ్, సంబంధిత ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, బహదూర్ పల్లి సీనియర్ నాయకులు, డబుల్ బెడ్ రూమ్ సొసైటీ సభ్యులు, డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా చేవెళ్ల ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య జన్మదిన వేడుకలు శుక్రవారం నవాబుపేట్ మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆయన పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని మాణిక్య ప్రభు మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేను ఆయన నివాసంలో వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోని ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పిఎసిఎస్ చైర్మన్ పోలీస్ రామిరెడ్డి, ఎఎంసి చైర్మన్ గీత సింగ్ నాయక్, ఏఎంసి డైరెక్టర్లు ఎండి.ఖదీర్, నర్సింహా రెడ్డి, చిట్టి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకు లు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కుల్కచర్ల నూతన ఎస్ఐగా వి.రమేష్

**ప్రజాపక్షం/కుల్కచర్ల:** పరిగి నియోజకవర్గంలోని కుల్కచర్ల మండల నూతన ఎస్ఐగా వి,రమేష్ పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో కుల్కచర్ల ఎస్ఐగా పనిచేసిన అనేవష్‌రెడ్డి బదీలపై వెళ్లగా, తాండూర్ టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌ను కుల్కచర్ల ఎస్ఐగా బాదిలై రావటం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని తెలిపారు. ప్రజల పరిరక్షణ ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని అన్నారు.

## వందేళ్ల ఆలయంలో రాజగోపురం శిఖర ప్రతిష్ట



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** నేరేడ్‌మెట్‌లోని ప్రధాన రహదారిలో ఉన్న శ్రీ అన్నపూర్ణసహిత కాశీ విశ్వనాథ దేవాలయం వందేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని, 19న నూతనంగా నిర్మించిన రాజగోపురం శిఖర ప్రతిష్ట, సతీసమేత నవగ్రహ దేవతా విగ్రహాల ప్రతిష్టాపన జరుగుతాయని ఆలయ నిర్వాకులు తెలిపారు. ప్రతిష్టాపన కార్యక్రమంలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి, చెన్నూను ఎమ్మెల్యే గడ్డం వెంకటస్వామి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

# ప్రజల పక్షాన పోరాడేది సిపిఐ మాత్రమే



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రజల పక్షాన నిరంతరం పోరాడేది కేవలం సిపిఐ పార్టీ మాత్రమే అని పార్టీ మేడ్చల్/మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి డిజి సాయిలు గౌడ్ అన్నారు. శుక్రవారం రొయ్యల గిరిజ అధ్యక్షతన వినాయక నగర్ సిపిఐ కార్యాలయంలో జరిగిన మండల నాలుగవ మహాసభలో ఆయన మాట్లాడారు. ముందుగా పార్టీ సీనియర్ నేత కొంగ ప్రభాకర్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిలు గౌడ్ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల కోసం పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ నెల 25న ఇసిఐఎల్ సమీపంలో జరిగే జిల్లా మహాసభలో 400మంది ప్రతినిధులతో సభ నిర్వహిస్తున్నామన్నారు.

ఈ సమావేశానికి ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, ఎమ్మెల్సీ ఎన్నికంటి సత్యం, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విఎస్ బోస్ తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. ఆగస్టు 19 నుండి 22 వరకు నాలుగు రోజుల పాటు కుత్బుల్లాపూర్ మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు.

రైతు సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహ, మండల కార్యదర్శి టి. యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శి లు కాసర్ల నాగరాజు, కె.అశోక్‌కుమార్, పి. సత్యనారాయణ, బి.యాదగిరి, జయరాములు, ప్రభాకర్, రాములు, వెంకటరమణ, లింగం, ఎండి యూసూఫ్, కలమ్మ, లక్ష్మ మ్మ, వెంకటేశం, ప్రజానాట్య మండలి నాయకులు వెంకటాచారి, తదితరులు ఈ సభలో పాల్గొన్నారు.

# డెంగీ నివారణ చర్యలు చేపట్టాలి

### డిఎంహెచ్ఒ డా.ఉమాగౌరి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** డెంగీ వ్యాధికి మూలాలైన దోమల పెరుగుదలను నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో ఆరోగ్యకార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఒ) డాక్టర్ ఉమాగౌరి సూచించారు. దీనికోసం వైద్యారోగ్య శాఖ జిహెచ్ఎంసి తో సమన్వయంతో కృషి చేయాలన్నారు. జాతీయ డెంగీ దినోత్సవ సందర్భంగా మేడ్చల్ జిల్లాలోని ఆల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్షా సమావేశం అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీ వ్యాధికి పూర్తి స్థాయిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు చికిత్సలు ఉచితంగా లభిస్తున్నాయన్నారు. జిల్లా ఎన్‌సివిబిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ వర్షాకాలంలో దోమకాటు వల్ల వచ్చే వ్యాధులను నివారించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. దోమల లార్వాలు పెరిగి దోమలుగా మారక ముందే వాటిని నిర్మూలించే చర్యలు చేపట్టాలన్నారు. ఆల్వాల్ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్వేత మాట్లాడుతూ డెంగీ లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని పిహెచ్‌సిలకు కానీ, బస్తీ దవాఖానాలకు గానీ వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపించుకొని అవసరమైతే వైద్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. కౌశిక్, మల్కాజిగిరి జిహెచ్ఎంసి సీనియర్ ఎంటమాలజి అధికారి వెంకటేశ్వర్లు, కీసర డివిజన్ సబ్ యూనిట్ అధికారి కె.వినోద్, జిల్లా కళాజాత బృందం, హెల్త్ సూపర్‌వైజర్లు గొంగ దయ్య, అరుణ, జంగయ్య, ఆరోగ్య, ఆశా కార్యకర్తలుపాల్గొన్నారు.



# విద్యార్థులకు అనుగుణంగా బోధనా విధానం

*సాంకేతికపై పట్టు అవసరం * బోధనా సామర్థ్యం పెరగాలి

### ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణా తరగతుల్లో కలెక్టర్ గౌతం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో భాగంగా విద్యారంగంలో వస్తున్న మార్పులు, అధునాతన సాంకేతికత విధానాలను ఎప్పటికప్పుడు తమ విద్యా బోధనలో చేకూర్చుకొనే విధంగా ఉపాధ్యాయులు తమకు తాము నవీకరించుకోవాలని (అప్‌డేట్ ) జిల్లా కలెక్టర్ గౌతం సూచించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధిస్తున్న సమయంలో విద్యార్థులందరూ ఒకే విధంగా అవగాహన చేసుకొని నేర్చుకోలేరని, వివిధ రకాలుగా ఉండే విద్యార్థులకు అనుగుణంగా బోధనా విధానాన్ని మార్చుకోవటం అవసరమని, దీనికోసం అందుబాటులో ఉండే సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. వేసవి సెలవుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనాపర ఆధునిక శిక్షణను అందించటం హర్షించదగిందన్నారు. దీనికోసం ఉపాధ్యాయులు సాంకేతికపై పట్టు సాధించుకొంటూ అన్ని రకాల పద్ధతులను తెల్సుకొని విద్యనందించటమే ఉపాధ్యాయుల గొప్పదనమన్నారు. జిపిటి ఏఐ యాప్‌ను వినియోగించుకొని విద్యారంగాన్ని మరింత మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల్లో చదవటం, రాయటం, పఠించటం వంటి ప్రాథమిక నైపుణ్యాలను పెంచటానికి ఉపాధ్యాయులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తమంతట తాము బోధనా సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. శిక్షణా తరగతుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులు తమ అనుభవాల మేరకు సలహాలు, ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్‌మోహన్, జిల్లా విద్యాశాఖాధికారి విజమలక్ష్మి , ఉప్పల్ తహసీల్దార్ వాణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు మీ–సేవ ఆపరేటర్ల నూతన కార్యవర్గం ప్రమాణం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ మీసేవ ఆపరేటర్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యవర్గ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నేడు (శనివారం) శామీర్‌పేట మండల కేంద్రంలోని బృందావన్ ఇన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని అధ్యక్షులు కొత్త కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని ప్రతి జిల్లా నుంచి టిఎంఒఎ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# 20 క్వింటాళ్ల నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత




**ప్రజాపక్షం / కొడంగల్ :** ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా నకిలీ పత్తివిత్తనాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తులపై పలు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసిన ఘటన కొడంగల్‌లో చోటుచేసుకుంది. పరిగి డిఎస్‌పి శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని అంగడిరాయిచూర్ గ్రామానికి చెందిన మల్లారి పెద్ద మల్లప్ప కర్నాటకలోని ముథేళ్‌లోని ఎర్రప్పనేని కొండప్ప ఎరువుల దుకాణం నుంచి దాదాపు 35 బస్తాల పత్తి విత్తనాలను కొనుగోలుచేసి తన ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా గుట్టుచప్పుడు కాకుండా నిల్వ చేయడం జరిగింది. మల్లప్ప కొత్తపల్లి గ్రామానికి చెందిన మంగలి వెంకటయ్యకు తాను కొనుగోలు చేసిన 20 క్వింటాళ్ల లూజ్ పత్తి విత్తనాలను పంపించేందుకు ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో పక్కా సమాచారం మేరకు శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో పోలీసులు రంగప్రవేశం చేసి అట్టి లూజ్ నకిలి పత్తివిత్తనాలు ఉన్న దాదాపు 35 సంచులను స్వాధీనం చేసుకున్నారన్నారు. వీటి విలువ అక్షరాల 45 లక్షల పైనే ఉంటుందని పోలీసులు వెల్లడించారు. నకిలీ పత్తి విత్తనాలను కొనుగోలు చేయడం, వాటిని విక్రయించడం పట్ల ఇరువురి వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

అదేవిధంగా గత నాలుగు రోజుల క్రితం హైద్రాబాద్‌లోని కాటేదాన్ నుంచి గుల్లర్భలోని షాబాద్‌కు రాత్రి సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా కల్తీ అల్లం పేస్ట్, కల్తీ మంచినూనె పట్టుకోవడం జరిగిందని అక్రమ రవాణా చేస్తున్న వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరితో పాటు సిఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ, ట్రైనీ ఎస్ఐ రాజ్‌కుమార్‌లతో పాటు పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

## అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం : ఎంపిడిఒ గమ్య



**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ గమ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించాలని, ఎన్ఆర్‌జిఎస్ పనులు సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. పనులు జరిగే ప్రదేశంలో మెడికల్ కిట్ త్రాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. పరిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని, కార్యదర్శులు ఎప్పటికప్పుడు రికార్డులను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గ్రామంలో ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ రాజేష్, ఈసి వీరేంద్రబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గోన్నారు.

# నిబంధనల ప్రకారం ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

### కలెక్టర్ ప్రతీక్‌జైన్




**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటర్ పరీక్షలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమిక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సప్లిమెంటరీ పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహిస్తున్నందున దానికనుగుణంగా ఆర్టీసి రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మెడికల్ డిపార్ట్మంట్ ద్వారా మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షలకు ఇబ్బంది లేకుండా విద్యుత్తు అందించాలన్నారు. పోస్టల్ డిపార్మెంట్ పార్సెల్స్ కోసం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని అన్నారు. పరీక్షలు ఈనెల 22 నుండి 28వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పరీక్షలు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2.30 నుండి 5.30 వరకు నిర్వహిస్తామని అన్నారు. వికారాబాద్ జిల్లాలోని 10 పోలీస్ స్టేషన్ల పరిధిలో 20పరీక్ష కేంద్రాలలో మొదటి సంవత్సరం జనరల్ 5217, ఒకేషనల్ లో 457 ద్వితీయ సంవత్సరం జనరల్ 5217, ఒకేషనల్ 457లో 314 విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా మెడికల్ ఆఫీసర్ వెంకటరమణ, ఆర్‌టిసి డిపో మెనేజర్ ఆరుణ, జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్, నర్సింహరెడ్డి, సత్తయ్య, సురేశ్వర స్వామి, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**25వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించాం:** రాష్ట్ర మంత్రి ఉత్తమ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వికారాబాద్ జిల్లాలో వరి ధాన్య సేకరణపై మంత్రి ఆరా తీయగా జిల్లాలో 128 వరి కొనుగోలు కేంద్రాల్లో వరి కొనుగోలు ప్రక్రియను మొదలు పెట్టామని, ఇప్పటికీ 25వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన తెలిపారు.

కేంద్రాల్లో మౌలిక సుదుపాయాలతో పాటు కావలసిన తాడిపత్రిలు సంచులు, తేమ యంత్రాలను ఏర్పాటు చేశామని మంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డిఆర్‌డిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## క్యాన్సర్ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వినాయకనగర్ ప్రాంతంలో నివసిస్తూ గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్న ఎం. సోమరాజు వైద్య చికిత్సలకు గాను విస్సు ట్రస్ట్ శుక్రవారం రూ.41 వేలు ఆర్థిక సాయం అందించింది. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో ఈ ఆర్థిక సాయాన్ని చెక్‌ను ఎమ్మెల్యే ట్రస్ట్ చైర్మన్ బంగారు తాతారావుతో కల్సి అందించారు. విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం మల్కాజిగిరి మల్లేష్, ట్రస్ట్ సభ్యులు రమేష్, శ్రవణ్ కుమార్, సుకుమార్, పరశురాంరెడ్డి, గోపాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# షరతుల్లేకుండా సబ్సిడీ రుణాలు

### బిసి సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కె.రాజుకుమార్

**ప్రజాపక్షం/తాండూరు:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేయబోతున్న రాజీవ్ యువవికాస్ పథకంలో ఎలాంటి షరతుల్లేకుండా సబ్సిడీ రుణాలు అందించాలని బిసి సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజుకుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాస్ ఫథకంలో బ్యాంకర్ల జోక్యం తగదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో 5లక్షల మంది నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాస్ ద్వారా రూ.6కోట్ల రుణాలు అందజేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రకటించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో సుమారుగా 16లక్షల 25వేల పైగా నిరుద్యోగులు నాలుగు కేటగిరిల్లో రుణాలకు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి షరత్తులు లేకుండా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రుణాల మంజూరులో బ్యాంకులు, స్థానిక నేతల జోక్యం లేకుండ అర్హులైన వారందరికి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



## 10 లక్షల వ్యయంతో పైప్‌లైన్ పనులు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి డివిజన్‌లోని సర్దార్ పటేల్‌నగర్ ప్రాంతంలో వర్షపు నీటి నివారణ కోసం రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టిన పైప్ లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ శుక్రవారం ప్రారంభించారు. నాణ్యతా పరంగా ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఎఇ నవీన్, రమేష్, రాములు, సాయిబాబా, చంద్రయ్య,శ్రీధర్‌రెడ్డి, సుబ్బారావు, రవిరాజు, రాజేష్,రామ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# క్రీడ

# ఐపిఎల్‌కు వానముప్పు..



ఆర్‌సిబి, కోల్‌కతా మ్యాచ్ జరిగేనా..?

ఐపిఎల్ 2025 సీజన్ రీస్టార్ట్ ముందు అభిమానులకు బ్యాడ్ న్యూస్. ఐపిఎల్ 2025 రివైజ్డ్ షెడ్యూల్‌లో భాగంగా నేడు బెంగళూరు వేదికగా జరగాల్సిన ఆర్‌సిబి వర్సెస్ కేకేఆర్ మ్యాచ్ రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మ్యాచ్‌కు భారీ వర్షం ముప్పు పొంచి ఉంది. భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్ 2025 సీజన్‌ను వారం రోజులు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరగడంతో బీసీసీఐ.. ఐపీఎల్ 2025 టోర్నీని తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే 17 మ్యాచ్‌లకు సంబంధించిన రివైజ్డ్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ షెడ్యూల్ ప్రకారం తొలి మ్యాచ్‌లో ఆర్‌సిబి, కేకేఆర్ తలపడుతున్నాయి. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**బెంగళూరులో వర్షాలు..**

ప్రస్తుతం బెంగళూరులో సాయంత్రం వేళ వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజులుగా సాయంత్రం వేళ వర్షం పడింది. వర్షం కారణంగా గురువారం ఇరు జట్ల ప్రాక్టీస్ సెషన్స్ రద్దయ్యాయి. మైదానంలో భారీ నీరు చేరి చెరువుగా మారడంతో ఆర్‌సిబి స్టార్ బ్యాటర్ టిమ్ డేవిడ్ చిన్న పిల్లాడిలా గంతులేసాడు. బట్టలు విప్పి.. వర్షపు నీటిలో డైవ్ చేస్తూ ఆడుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో కూడా వైరల్‌గా మారింది.

**అల్పపీడనం కారణంగా..**

అరేబియా సముద్రంలో అల్పపీడనం కారణంగా శనివారం కూడా వర్షం పడే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే ఆర్‌సిబి, కేకేఆర్ మ్యాచ్ సజావుగా సాగుతుందా? లేదా? అనే సందేహాలు నెలకొన్నాయి. వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే ఇరు జట్లకు చెరో పాయింట్ లభిస్తుంది. ఆర్‌సీబీ అధికారికంగా ప్లే ఆఫ్స్ చేరుతుంది. కానీ ఆ జట్టు టాప్-2లో నిలవాలంటే ఆఖరి రెండు మ్యాచ్‌లు గెలవాల్సి ఉంటుంది. మరోవైపు కేకేఆర్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమిస్తోంది. ఆర్‌సీబీ ఇప్పటి వరకు 11 మ్యాచ్‌ల్లో 8 గెలిచి 16 పాయింట్లతో పాయింట్స్ టేబుల్ రెండో స్థానంలో కొనసాగుతోంది. కేకేఆర్ 12 మ్యాచ్‌ల్లో 5 విజయాలు, ఓ మ్యాచ్ రద్దవ్వడంతో 11 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. ఆ జట్టు చివరి రెండు మ్యాచ్‌లకు రెండు గెలిచినా ప్లే ఆఫ్స్ చేరేది కష్టమైన పరిస్థితి నెలకొంది. ఆర్‌సీబీతో మ్యాచ్ రద్దయితే అధికారికంగా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమిస్తోంది.

**ముఖా ముఖి పోరు..**

ఇరు జట్లు ముఖా ముఖి పోరులో కేకేఆర్‌దే పై చేయిగా ఉంది. ఇప్పటి వరకు ఇరు జట్లు 35 సార్లు తలపడగా.. కేకేఆర్ 20, ఆర్‌సీబీ 15 విజయాలు సాధించాయి. ఈ సీజన్ ఆరంభ మ్యాచ్‌లో కేకేఆర్‌ను ఆర్‌సీబీ ఓడించింది.

## ప్లే ఆఫ్స్‌కు దూరమైనా..

### రికార్డులు మాత్రం సన్‌రైజర్స్‌వే!




ఐపిఎల్ అంటేనే పవర్ హిట్టర్లు, పరుగుల వరదకు కేరాఫ్. అలాంటి ఈ పొట్టి క్రికెట్ లీగ్‌లో రికార్డు బ్రేకర్లు చాలామందే. కానీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మాత్రం ప్రత్యేకం అని చెప్పాలి. నిరుడు అత్యధిక స్కోర్‌తో రికార్డులు బద్దలు కొట్టిన ఆరెంజ్ ఆర్మీ.. ఈసారి కూడా అగ్రెసివ్‌గా ఆడుతూ తొలి పోరులోనే 286 పరుగులు చేసింది. అయితే.. ఈ ఎడిషన్‌లో హైదరాబాద్ జట్టు ప్లే ఆఫ్స్ రేసులో లేదు. కానీ, ఓపెనర్ల విధ్వంసంతో అత్యధిక పరుగుల భాగస్వామ్యం నమోదు చేసింది కమిన్స్ సేన. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ సెంచరీతో గర్జించగా.. ట్రావిస్ హెడ్ బౌండరీలతో మోత మోగించాడు. దాంతో, 18వ ఎడిషన్‌లో అత్యధిక పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారిద్దరు. ఉప్పల్ మైదానంలో పంజాబ్ బౌలర్లను ఉతికేసిన ఈ చిచ్చరపిడుగులు 75 బంతుల్లోనే 171 రన్స్ పిండుకున్నారు. ఇప్పటివరకూ జరిగిన లీగ్ దశలో ఇదే రికార్డు పార్ట్‌నర్‌షిప్ కావడం విశేషం. రెండో స్థానంలో రాజస్థాన్ ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, యజస్వీ జైస్వాల్ జోడీ ఉంది. విధ్వంసక బ్యాటింగ్‌తో వైభవ్ 35 బంతుల్లోనే శతకం సాధించగా.. గుజరాత్ బౌలర్లను ఉతికేసిన యశస్వీ అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. దాంతో ఈ ద్వయం తొలి వికెట్‌కు 166 పరుగులు జోడించింది. పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు మూడో స్థానంలో నిలిచారు. పవర్ ప్లేలో కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లపై విరుచుకుపడిన ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్‌లు 120 రన్స్‌తో శుభారంభం ఇచ్చారు. ఈ సీజన్‌లో టాప్ గేర్‌లో ఆడుతున్న గుజరాట్ టైటాన్స్ ఓపెనర్లు సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ కూడా 120 పరుగులు చేశారు. కరుణ్ నాయర్, అభిషేక్ పోరెల్(ఢిల్లీ క్యాపిటల్స్) 119 పరుగులతో టాప్ 5లో చోటు సంపాదించారు.

**ఆరెంజ్, పర్పుల్ క్యాప్**

ఐపీఎల్ 18వ సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ రేసులో సూర్యకుమార్ యాదవ్ అందరికంటే ముందున్నాడు. వరుసగా 11 మ్యాచుల్లో 25 ప్లస్ స్కోర్ చేసిన అతడి ఖాతాలో 510 పరుగులు ఉన్నాయి. అతడి వెనకాలే గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్(509), కెప్టెన్ శుభ్‌మన్ గిల్(508) వరుసగా రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నారు. గుజరాత్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ పర్పుల్ క్యాప్ ఒడిసి పట్టేయనున్నాడు. ఈ పొడగరి పేసర్ లీగ్ దశలో 20 వికెట్లు పడగొట్టాడు. సీఎస్కే స్పిన్నర్ నూర్ అహ్మద్ కూడా 20 వికెట్లు తీశాడు. కానీ, రెండు లీగ్ మ్యాచుల్లో అతడు ప్రసిద్ధ్‌ను అధిగమించినా.. ప్లే ఆఫ్స్ ఆడడు. సో.. 18 వికెట్లతో మూడో స్థానంలో ఉన్న ఆర్సీబీ స్టార్ పేసర్ హేజిల్‌వుడ్ పోటీనిచ్చే అవకాశముంది.

# యుద్ధం కోసం సిద్ధంకండి



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా సిద్ధమవుతోంది. ఈ సినిమా ఫైనల్ రిలీజ్ తేదీని టీమ్ ప్రకటించింది. ఇప్పటికే పలుమార్లు ఈ చిత్రం వాయిదా పడిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై చిత్ర బృందం పోస్ట్ పెట్టింది. జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నట్లు వెల్లడించింది. 'జీవితకాలపు యుద్ధానికి సిద్ధంగా ఉండండి. ధర్మం కోసం యుద్ధం ప్రారంభమవుతుంది. జూన్ 12న హరి హర వీరమల్లు రిలీజ్ కానుంది' అంటూ పవన్ కల్యాణ్‌కు సంబంధించిన కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. మొదట ఈ మూవీని మార్చి 28న విడుదల చేయాలని భావించారు. అయితే పవన్ బిజీగా ఉండడంతో దీని చిత్రీకరణ ఆలస్యం అయింది. దీంతో మే నెలకు వాయిదా వేశారు. ఇటీవల పవన్‌కు సంబంధించిన సన్నివేశాలతో పాటు షూటింగ్ మొత్తం పూర్తయిందని చిత్రబృందం తెలిపింది.

# రీల్

## రావణుడి భార్యగా..



కాజల్ అగర్వాల్

బాలీవుడ్ నటుడు రణబీర్ కపూర్, నటి సాయిపల్లవి జంటగా నటిస్తోన్న చిత్రం 'రామాయణ'. బాలీవుడ్ దర్శకుడు నితేశ్ తివారీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్‌గా మారింది. నటి కాజల్ అగర్వాల్ ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె రావణాసురుడి సతీమణి మండోదరి పాత్రలో కనిపించనున్నారని టాక్. ఈ విషయంపై ఇప్పటికే టీమ్ సంప్రదించిందని.. ఆమె సుముఖత వ్యక్తం చేశారని తెలుస్తోంది. అంతేకాకుండా గత వారం లుక్ టెస్ట్ కూడా జరిగిందని ఆంగ్ల వెబ్‌సైట్స్‌లో వార్తలు ప్రచురితమయ్యాయి. ఒకవేళ అదే కనుక నిజమైతే కన్నడ నటుడు యశ్‌కు జంటగా కాజల్‌ను ఈ సినిమాలో చూడొచ్చు. యశ్ ఇందులో రావణాసురుడిగా నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల ఆయన షూట్‌లో భాగమైనట్లు వార్తలు వచ్చాయి. దర్శకుడిగా నితేశ్ తివారీకి బాలీవుడ్‌లో మంచి పేరు ఉంది. 'దంగల్', 'ఛిఛోరే', 'బవాల్' వంటి చిత్రాలను ఆయన తెరకెక్కించారు.

# రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేందుకు నిరీక్షిస్తున్నా..: ఎన్టీఆర్



హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కీలక పాత్రల్లో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'వార్2'. అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని యశ్‌రాజ్ ఫిలిమ్స్ నిర్మిస్తోంది. కియారా అద్వాణీ కథానాయిక. ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్‌ల కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎన్టీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని మే 20న సర్‌ప్రైజ్ ఇవ్వనున్నట్లు హృతిక్ రోషన్ తెలిపారు. దీనిపై తాజాగా ఎన్టీఆర్ స్పందించారు. సర్‌ప్రైజ్ కోసం తాను ఎదురుచూస్తున్నానని అన్నారు. అంతేకాకుండా 'కబీర్.. నిన్ను వేటాడి నీకు ప్రత్యేక బహుమతి ఇచ్చేందుకు వేచి చూస్తున్నా'' అని రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని మే 20న 'వార్ 2' టీజర్ విడుదల చేసే అవకాశం ఉందని సినీ ప్రియులు భావిస్తున్నారు. ఆగస్టు 14న 'వార్2'ను విడుదల చేయనున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం ప్రకటించింది. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన చిత్రం 'వార్'. ఈ స్పై థ్రిల్లర్ సూపర్ సక్సెస్ సాధించి బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. దీనికి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న చిత్రమే 'వార్2'. ఈ సినిమాలో ఎన్టీఆర్ రా ఏజెంట్‌గా నటించనున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి.

## 'కింగ్'లో రాణీ ముఖర్జీ



బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్, అందాల నటి రాణీ ముఖర్జీ మరోసారి వెండితెరపై కలిసి సందడి చేయనున్నారు. పఠాన్ సినిమాతో షారుఖ్‌కి బ్లాక్ బస్టర్‌ను అందించిన దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ మరోసారి షారుఖ్‌తో కలిసి ఒక సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. కింగ్ అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రం మే 20 నుంచి షూటింగ్ ప్రారంభించబోతున్నట్లు సమాచారం. అయితే ఈ ప్రాజెక్ట్‌లో షారుఖ్‌కి జోడిగా రాణీ ముఖర్జీ నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే వీరిద్దరూ కలిసి 'కుచ్ కుచ్ హోతా హై', 'కభీ ఖుషీ కభీ గమ్', 'కభీ అల్విదా నా కెహనా ' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల్లో నటించి మెప్పించారు. వీరిద్దరూ మళ్లీ కలిసి నటిస్తుండటంతో అభిమానులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. ఈ సినిమాలో రాణీ ముఖర్జీ షారుఖ్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ తల్లి పాత్రను పోషించనున్నారు. ఈ పాత్ర సినిమా కథలో ఒక కీలకమైన మలుపు తిప్పుతుందని తెలుస్తోంది.

కొత్త చరిత్ర సృష్టించిన

# భారత సైన్యం

కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం సమగ్ర విధానంతో, భారత సైనికులు తమ శక్తి, సామర్థ్యాలతో కొత్త చరిత్రను సృష్టించారని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. దశాబ్దాలుగా భారతదేశంలో అనేక ఉగ్రవాద ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఉగ్రవాద ఘటనల తర్వాత క్యాండిల్ కాదు వెలిగించాల్సింది, మిస్సైల్స్ వదలాలని, బ్రహ్మోస్‌ను వదిలి ఉగ్రవాదులను మట్టుబెట్టాలని, భారతదేశం అంటే ఉగ్రవాదులకు భయం పుట్టాలనేలా ప్రధాని నరేంద్ర మోదీ గట్టి సమాధానమిచ్చారన్నారు. భారత సైనికులు పాక్‌లోని ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు, నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఆపరేషన్ సిందూరు తాత్కాలిక బ్రేక్ మాత్రమే ఇచ్చామని తెలిపారు. సైనికులకు సంఘీభావంగా శనివారం ట్యాంక్‌బండ్‌పై తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని, అన్ని పార్టీలను, ఎంఎల్‌ఎలను, ఎంపిలను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి స్పందించారు. మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని స్వయంగా ఒప్పుకున్నారన్నారు. ఈ విషయంలో ఎవరు ఎంత కమీషన్ తీసుకున్నారో దర్యాప్తు చేయించాలని సిఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

పిల్లలమర్రి అందాలకు... సుందరీమణులు

# మంత్ర ముగ్ధులు

ఒకేరోజు మూడు ప్రాంతాల్లో సందర్శన






**ప్రజాపక్షం/హైదరాబాద్/రంగారెడ్డి/**మహబూబ్‌నగర్: మిస్ వరల్డ్ పోటీల కోసం వివిధ దేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సుందరీమణులు శుక్రవారం ఒకేరోజు మూడు ప్రాంతాల్లో పర్యటించారు. మెడికల్ టూరిజంలో భాగంగా గచ్చిబౌలి ఎఐజి హాస్పటల్‌ను 40మంది సుందరీమణులు సందర్శించారు. మెడికల్ టూరిజంకు ఇంటర్నేషనల్ హబ్‌గా మారిన హైదరాబాద్ ప్రత్యేకతలను వారికి వివరించారు. ఈ ఆసుపత్రి దేశ, విదేశీ పేషెంట్లకు వైద్యం అందిస్తున్న ఎఐజి దీర్ఘ కాలిక, అరుదైన వైద్య సమస్యలకు మెరుగైన వైద్యం అందిస్తుందని తెలిపారు. ఇతర దేశాలతో పోల్చితే తక్కువ ఖర్చుతో వైద్యం పూర్తవుతుందని ఆసుపత్రి యాజమాన్యం వారికి వివరించింది. కార్యక్రమంలో ఎఐజి వ్యవస్థాపకులు డాక్టర్ పద్మ విభూషణ్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, వైద్య శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. క్యాన్సర్ బాధితులకు అందిస్తున్న వైద్యం, పీడియాట్రిక్స్ వార్డుతో పాటు, బ్యూటీ, హెల్త్ కేర్, ఫిట్ నెస్, డైట్ కార్యక్రమాలపై టాక్ షో నిర్వహించారు. రెండవ బృందం మహబూబ్ నగర్ జిల్లాలో చారిత్రాత్మక పిల్లలమర్రిని సందర్శించింది. 22 మందితో కూడిన అమెరికా, సంబంధిత దేశాల బృందం అక్కడికి వెళ్లింది. తెలంగాణ పంపగల విశిష్టత సంస్కృతిని ప్రతిబింబించేలా సాంప్రదాయ నృత్యాల మధ్య సుందరీమణుల బృందానికి స్వాగతం పలికారు. మొదట శ్రీరాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మ్యూజియాన్ని సందర్శించారు. కాసేపు బతుకమ్మ ఆడారు. గిరిజన యువతుల బంజారా నృత్యం చేయగా, మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు వారితో జత కలిశారు. తర్వాత పిల్లలమర్రి మహావృక్షాన్ని వీక్షించారు. మహావృక్షం చరిత్ర, పునరుజ్జీవనం గురించి అటవీ శాఖ అధికారి వారికి వివరించారు. నారాయణపేట, గద్వాల చేనేత వస్త్రాలు, హస్తకళలు, కళాకృతులు స్టాల్స్‌ను సందర్శించారు.

**ఎక్స్‌పీరియమ్ ఎకో పార్క్ చూసి ముగ్ధులైన మిస్ వరల్డ్ మోడల్స్**

మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా పలువురు మిస్ వరల్డ్ పోటీదారులు హైదరాబాద్ చిలుకూరు సమీపంలోని ఎక్స్‌పీరియమ్ ఎకో పార్క్‌ను సందర్శించారు. మిస్ వరల్డ్ పోటీల కోసం వచ్చిన అందాల భామలు పార్క్ అందాలను వీక్షించారు.

దేశ, విదేశాల నుంచి సేకరించిన అరుదైన జాతి మొక్కలు, వాటి ప్రత్యేకతల గురించి పార్క్ యజమాని రాందేవ్ రావు వారికి వివరించారు. అద్భుతంగా తీర్చిదిద్దిన పార్క్‌ను, అందులో ఉన్న అరుదైన మొక్కలు, అద్భుతమైన శిల్పాలను, థీమ్ మోడల్స్‌ను చూసి ముద్దుగుమ్మలు మంత్రముగ్ధులయ్యారు. ఎకో పార్క్ అందాల మధ్య అందాల భామలు సెల్ఫీలు తీసుకుంటూ ఎంజాయ్ చేశారు. అక్కడి చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు.

ఐక్యరాజ్యసమితి నివేదికలో 6.3 శాతానికి తగ్గిన

# భారత వృద్ధిరేటు

**న్యూయార్క్ :** ఐక్యరాజ్యసమితి తాజా నివేదికలో భారతదేశ వృద్ధిరేటు–2025 అంచనాలను 6.3 శాతానికి కుదించింది. ఈ అంచనాల్లో ఒకశాతం పైగా తగ్గుదల వచ్చింది. ఐనప్పటికీ కూడా భారతదేశం శరవేగంగా అభివృద్ధి చెందే ఆర్థికవ్యవస్థల జాబితాలో ఒకటిగా కొనసాగుతుందని కూడా నివేదిక స్పష్టం చేసింది. ''ప్రపంచ ఆర్థిక పరిస్థితి–మధ్యంతర అంచనాలు–2025'' అనే పేరుతో రూపొందిన నివేదికను ఐక్యరాజ్యసమితి శుక్రవారం విడుదల చేసింది. ఐక్యరాజ్యసమితి ''దేశా''కు చెందిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షణావిభాగం ఆర్థిక వ్యవహారాల సీనియర్ అధికారి ఇంగో పిట్టెర్లే పత్రికాగోష్ఠిలో ఈ నివేదికలోని ప్రధానాంశాలను వివరించారు.

ప్రభుత్వ,ప్రైవేటు రంగాలలో భారతదేశం శరవేగంగా అభివృద్ధిచెందే ఆర్థికవ్యవస్థ స్థానంలో కొనసాగుతున్నప్పటికీ కూడా స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) అంచనాలను 6.3 శాతానికి కుదించింది. 2024 నాటి నివేదిక ప్రకారం 2025లో భారత జిడిపిని 7.1 శాతంగా ముందస్తు అంచనావేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఏ మాత్రం రక్షణలు లేకుండా ప్రమాదపు చౌరాస్థాలో నిలబడి ఉందని నివేదిక పేర్కొంది. ఈ దశలో వీటిని తట్టుకుని నిలబడగల సామర్థ్యం భారతదేశానికి ఉందని, సేవలరంగంలో ఎంతో శక్తిమంతమైనస్థానంలో భారత్ ఉందని పేర్కొంది. ఈ సేవలరంగమే ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని పేర్కొంది. అదేసమయంలో అమెరికా టారిఫ్‌ల భారం గురించి కూడా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది.

వాణిజ్య ఎగుమతుల భారం పెరిగిపోయిందని పేర్కొంది. ప్రస్తుతం ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్స్, ఎనర్జీ, కాపర్ వంటివాటికి మినహాయింపు ఉంది. దీనివల్ల ఆర్థిక ప్రభావం తక్కువగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా మార్కెటింగ్ ఉద్రిక్తతలు, సుంకాల ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని, ఉత్పత్తి వ్యయాలు గణనీయంగా పెరిగే ప్రమాదకరమైన హెచ్చరికలు వస్తున్నాయని నివేదిక పేర్కొంది. ఇవన్నీ ప్రపంచ సరఫరా వ్యవస్థలను సమస్యల్లోకి నెట్టేస్తాయన్నారు. వీటికి అతీతంగా భారతదేశ ఆధునీకరణ ఉన్నప్పటికీ, వేగంగా వృద్ధిచెందే దేశాల జాబితాలో ఉన్నప్పటకీ వృద్ధి అంచనా ప్రపంచ గమనంవల్ల క్షీణించింది. వినియోగవ్యయం, ప్రభుత్వ వ్యయాలు భారత్‌కు మద్దతుగా ఉంటాయని నివేదిక పేర్కొంది.

## రూ.50 వేల కోట్లు! (మొదటి పేజీ తరువాయి)

కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులను ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే. ఈ పద్దు కింద రూ.6,81,210 కోట్లను ప్రతిపాదించింది. 2024–25 బడ్జెట్ కేటాయింపుల (రూ.6.22 లక్షల కోట్లు)తో పోలిస్తే ఇది 9.53 శాతం అధికం. సవరించిన అంచనాల (రూ.6.41 లక్షల కోట్ల)తో పోలిస్తే 6.2 శాతం ఎక్కువ. తాజా కేటాయింపుల్లో కొత్త ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు పెద్దపీట వేశారు. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో రక్షణ కేటాయింపులు 1.91 శాతంగా ఉన్నాయి. రూ.50వేల కోట్ల అనుబంధ బడ్జెట్‌లో నిధులను పరిశోధన, ఆయుధాలు, అవసరమైన పరికరాల కొనుగోలుకు ఉపయోగించే అవకాశాలున్నాయి. 2014–15 ఆర్థిక సంవత్సరానికి ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో డిఫెన్స్ కేటాయింపులు రూ.2.29 లక్షల కోట్లుగా ఉన్నాయి. మొత్తం వార్షిక పద్దులో 13 శాతం రక్షణకే కేటాయించారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌కు సమీపంలో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దానికి ప్రతిగా పిఒకె, పాక్‌లోని ఉగ్రస్థావరాలను ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ ధ్వంసం చేసింది. అది జీర్ణించుకోలేని పాక్ తర్వాత రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. అయితే భారత్ ధాటిని తట్టుకోలేని పాక్ వెనక్కి తగ్గటంతో కాల్పులు విరమణ ఒప్పందం కుదిరింది.

## పర్వతారోహకుడు మృతి

(మొదటి పేజీ తరువాయి)

నుంచి కిందికి దిగలేనని సుబ్రతా ఘోష్ చెప్పారు.

**షెర్పా పదేపదే చెప్పినా, కిందికి దిగని సుబ్రతా ఘోష్**

'కిందికి దిగండి' అని షెర్పా గైడ్ చంపల్ తమాంగ్ పదేపదే చెప్పినా సుబ్రతా ఘోష్ తిరస్కరించారు. దీంతో చంపల్ తమాంగ్ గురువారం (మే 15న) రాత్రి ఒంటరిగా క్యాంప్ – IVకు తిరిగి చేరుకున్నారు. సుబ్రతా ఘోష్ ఎవరెస్టు నుంచి కిందికి దిగలేకపోయారనే విషయాన్ని శుక్రవారం తెల్లవారుజామున అందరికీ తెలియజేశారు. సుబ్రతా ఘోష్ మృతదేహాన్ని ఎవరెస్టు బేస్ క్యాంప్‌నకు తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఆయన మరణానికి అసలు కారణమేంటి? అనేది పోస్ట్ మార్టం పరీక్ష తర్వాత తెలియనుంది.

## దోపిడీ షురూ

(మొదటి పేజీ తరువాయి)

యాజమాన్యాలే చెప్పుకొస్తుండటం విశేషం. కార్పోరేట్ స్థాయి చదువుల పేరుతో పేకమేడల్లాంటి గదుల్లో గాలివెలుతురు లేకుండా విద్యాబోధన చేస్తున్నారు. విశాలమైన తరగతి గదులకు బదులు ఇరుక్కుని కూర్చునే పరిస్థితి ఎర్పడింది. ప్రాథమిక విద్యార్థులకు బోధించినట్లు ప్రక్కప్రక్కనే తరగతు గదులు ఉంటున్నాయి. జిల్లాలో కొన్ని బడుల్లో 8,9,10 తరగతులకు అన్ని రకాల ఫీజులు, పుస్తకాలు, ఇతరత్రా కలిపి ఏడాదికి రూ.1లక్ష నుండి రూ.1లక్ష 20 వేల వరకు ఖర్చు వస్తున్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. మరికొన్నిట్లో సుమారు రూ.50వేలుతో సరిపెడుతున్నారు. ఆయా పాఠశాలలు చేసే హంగామా, గదుల నిర్వహణ, బస్సులు, హడావిడి తదతరాలపై ఫీజులు ఆధారపడి ఉంటున్నాయి. ఇక ఇంటర్ కాలేజీల్లో అయితే ఈ దోపిడీ మాములుగా ఉండదు. అడ్వాన్స్‌డ్ పేరుతో వేసవి సెలవుల్లో సైతం తరగతులు జరుగుతున్నాయి. ఇంటర్ ఎంపిసి, బైపిసి గ్రూపలకు డిమాండ్ ఉండటంతో కార్పోరేట్ కాలేజీలు పెద్ద ఎత్తున ఫీజులు దండుకుంటున్నాయి. జెఇఇ మెయిన్స్, ఎంసెట్, ఇఏపిసెట్‌లలో ప్రత్యేక శిక్షణ పేరుతో, ఏసి, నాన్ ఏసి తరగతి గదులు ఏర్పాటు చేసి ధరలు నిర్ణయించి లక్షల్లో దోచుకుంటున్నారు. ఈ ఫీజుల వ్యవహారంలో నియంత్రణ లేకపోవడం, పర్యవేక్షణ కొరవడటంతో ఎవరి ఇష్టాను సారంగా వారు దండుకుంటున్నారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక**

ఫీజురీయింబర్స్‌మెంట్ అవకాశం ఉందని కళాశాల్లో చేర్పించిన తల్లిదండ్రులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గత మూడేళ్లుగా ఫీజులు రాక పోవడంతో ఇంటర్‌పాసైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చే విషయంలో యాజమాన్యాలు ఫీజులు కట్టి తీసుకెళ్లాల్సిందే అంటూ కొర్రీలు పెడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుండి ఫీజు రాంగానే మీకు రావాల్సింది మీఖాతాలోకే వస్తాయంటూ చెబుతున్నట్లు తెలుస్తోంది. దీంతో చేసేది ఏమీ లేక అప్పుసప్పులు చేసి ఒప్పుకున్నంత ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకునేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

**అర్హతలేనివారితో**.. ప్రైవేటు, బడులు, కాలేజీల్లో అర్హత లేని వారితో చదువులు చెప్పిస్తూ పబ్బంగడుపుతున్నట్లు తెలుస్తోంది. హైస్కూల్ విద్యార్థులకు బోధన చేయాలంటే బిఇడి, ప్రైమరీ స్కూళ్లకు చెప్పాలంటే డిఇడి, కాలేజీల్లో బోధించాలంటే పిజి, ఎంఇడి ఉండాలి. కానీ ప్రస్తుతం కాలేజీలు, స్కూళ్లలో ఈ పరిస్థితి లేదు. పదో తరగతి వారికి కూడా కేవలం డిగ్రీ అయిన వారితోనే చదువులు కానిచ్చేస్తున్నారు. ఇంటర్ చెప్పే వారికి పిజి చదివిన వారు బోధన చేస్తున్నారు. కనీస విద్యానిబంధనలు పాటించకుండా బోధనలు సాగిస్తూ వేలు, లక్షల్లో ఫీజులు కాజేస్తూ అరకొర జీతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

**ప్రభుత్వ నిబంధనలు అమలయ్యేనా**

ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ముందుకు వచ్చినప్పటికీ ఆదిశగా అడుగులు పడేనా అనే అనుమానాలు పలువురువ్యక్తం చేస్తున్నారు. ప్రతీ బడిలో పేదలకు 25 శాతం ఉచిత సీట్లు, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పేరెంట్స్ కమిటీల ఏర్పాట్లు, ఇంజనీరింగ్ కాలేజీల తరహాలో ఫీజుల నియంత్రణ వంటి అంశాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తూ ముసాయిదా చట్టం సిద్ధం చేసింది. అయితే దీనిపై ఇప్పటికే మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రైవేటు యాజమాన్యాలు హాజరై తలూపినప్పటికీ వారు లేవనెత్తిన సందేహాలపై మరో సమావేశంలో చర్చించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పుకొచ్చారు. కాగా ఈ ముసాయిదా తీర్మాణం అమలలైతే మేలని, దీనిపై మోకాలు అడ్డేందుకు ప్రైవేటు యాజమాన్యాలు న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం లేకపోలేదని పలువురు విద్యావిశ్లేషకులు అంటున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com